అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 21-09-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 213 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 14 పేజీలు వెల : 6.50

నేడు రవీంద్రభారతిలో ఏచూరి సంస్మరణ సభ

హాజరు కానున్న సీఎం రేవంత్‌రెడ్డి, రాఘవులు, కేటీఆర్, కూనంనేని, తమ్మినేని, కోదండరామ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


మార్క్సిస్టు మేధావి, సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభను శనివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ నిర్వహించనుంది. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అధ్యక్షతన నిర్వహించే ఈ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఏపీ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి మోహన్‌కందా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారక రామారావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, టీపీసీసీ అధ్యక్షులు బి మహేష్‌కుమార్‌గౌడ్, టీజేఎస్ రాష్ట్ర ...13లో



విప్లవ పథగామికి అక్షర నీరాజనం

ఏచూరి స్మృతిలో ప్రత్యేక వ్యాసాలు

లోపలి పేజీల్లో..



అదానీ మెడకు స్విస్ ఉచ్చు

సీరియస్ విచారణ..మెగా మనీలాండరింగ్‌పై దృష్టి

మోసం చేసినట్టు తేలితే ఐదేండ్ల శిక్ష

న్యూఢిల్లీ : స్విస్ బ్యాంక్ అకౌంట్లలో అదానీ మెగా మనీలాండరింగ్ సొమ్ముపై అక్కడి ప్రభుత్వ రెగ్యులేటరీ సంస్థలు సీరియస్‌గా విచారణ జరుపుతున్నాయని సమాచారం. ఈ కేసుపై స్విస్ అటార్నీ జనరల్ కార్యాలయం (ఓఏజీ) దృష్టి సారించిందని ది వైర్ ఓ కథనంలో తెలిపింది. స్విస్ బ్యాంక్ అకౌంట్లలో అదానీకి ఉన్న 31 కోట్ల డాలర్ల (దాదాపు రూ.2600 కోట్లు) సొమ్మును అక్కడి ప్రభుత్వ అధికారులు సీజ్ చేశారని సెప్టెంబర్ 12న అమెరికన్ రీసెర్చ్ సంస్థ హిండెన్‌బర్గ్ వెల్లడించింది. అదానీ గ్రూపు మనీలాండరింగ్‌కు పాల్పడిందని తెలిపింది. కాగా.. భారత్‌కు చెందిన ఒక గ్రూపు మెగా మనీలాండరింగ్‌కు ...2లో

ఇక హైడ్రా దూకుడే

చట్టబద్ధత, సిబ్బంది కేటాయింపు

- ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంటు కోసం 12 మందితో కమిటీ
- ఖరీఫ్ సీజన్ నుంచే సన్నాలకు రూ.500 బోనస్
- వచ్చే నెల నుంచి కొత్త రేషన్‌కార్డులు..
- జనవరి నుంచి అన్ని కార్డులకు సన్నబియ్యం



వివరాలు 10లో

51 గ్రామాలు సెమీ అర్బన్‌లో విలీనం : రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

సింగరేణి కార్మికులకు రూ.796 కోట్ల బోనస్

దసరాకు ముందే కార్మికుల కుటుంబాల్లో పండగ

ఒక్కో కార్మికునికి రూ.1.90 లక్షలు

తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకూ రూ.5 వేలందజేత : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

13లో.

ఓటుకు నోటు కేసులో సీఎంకు ఊరట

మరో రాష్ట్రానికి విచారణ బదిలీ కుదరదు

రేవంత్‌రెడ్డి దర్యాప్తులో జోక్యం చేసుకోవద్దు : సుప్రీంకోర్టు

వివరాలు 10లో..

సవరించిన ఐటీ నిబంధనలు రాజ్యాంగ విరుద్ధం

కొట్టేసిన బాంబే హైకోర్టు



ముంబయి : సవరించిన ఐటీ నిబంధనలను బాంబే హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. అవి రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో వచ్చే బూటకపు, తప్పుడు సమాచారాన్ని గుర్తించేందుకు ఈ నిబంధనలను తీసుకువచ్చారు. సవరించిన సమాచార సాంకేతిక పరిజ్ఞానం (ఐటీ) నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై జనవరిలో డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పు చీలిపోవడంతో 'టై బ్రేకర్ జడ్జి'గా జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్‌కు ఈ అంశాన్ని నివేదించారు. దానిపై విచారించిన జస్టిస్ చందూర్కర్ రాజ్యాంగ నిబంధనలను ఈ ఐటీ రూల్స్ ...13లో

అమ్మకానికి స్టార్‌హెల్త్ కస్టమర్ల డేటా



టెలిగ్రామ్‌లో బహిరంగంగానే విక్రయానికి పెట్టడంతో ఆందోళన

అనధికార డేటా యాక్సస్ ఆరోపణలపై స్థానికాధికారులకు సమాచారం : స్టార్ హెల్త్

న్యూఢిల్లీ : భారత్‌లో దిగ్గజ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ 'స్టార్ హెల్త్' కంపెనీ నుంచి కస్టమర్ల డేటా భారీ సంఖ్యలో చోరీకి గురైనట్టు తెలుస్తోంది. లక్షలాది కస్టమర్ల సమాచారాన్ని బహిరంగంగానే విక్రయానికి పెట్టినట్టు తెలుస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇందులో కస్టమర్ల మెడికల్ రిపోర్టులతోపాటు సున్నితమైన సమాచారం కూడా ఉంది. టెలిగ్రామ్‌లోని చాట్‌బాట్స్ ద్వారా స్టార్ హెల్త్ సమాచారం అందుబాటులో ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ యాప్‌లో నేరాలకు అనుమతిస్తున్నట్టు టెలిగ్రామ్ వ్యవస్థాపకుడిపై ఆరోపణలు వచ్చిన కొద్ది రోజుల్లోనే ఈ తాజా వ్యవహారం వెలుగులోకి రావడం ...13లో

ఎస్ఎల్బీసీ మూడేండ్లలో పూర్తి

కేసీఆర్ గాలికి వదిలేశారు

- ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ.4637కోట్లు కేటాయిస్తాం..: క్యాబినెట్ సమావేశంలో నిధుల మంజూరుకు ఆమోదం
- 2027 సెప్టెంబర్ 20వరకు పనులు పూర్తి : ఉమ్మడి నల్లగొండ జిల్లా నీటిపారుదల ప్రాజెక్టులపై సమగ్ర సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి
- ఎస్ఎల్బీసీ సొరంగాన్ని పరిశీలించిన మంత్రులు



నవతెలంగాణ- దేవరకొండ

ఉమ్మడి నల్లగొండ చిరకాల స్వప్నం ఎస్ఎల్బీసీ సొరంగ మార్గం పనులను వచ్చే మూడేండ్లలో పూర్తి చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా సరిహద్దులో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి వద్ద ఉన్న శ్రీశైలం ఎడమ కాలువ సొరంగ మార్గాన్ని (ఎస్ఎల్బీసీ సొరంగం) నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శాసనమండలి ...13లో

కాళేశ్వరం కొట్టుకుపోతే.. ప్రాజెక్టుల్లోకి నీళ్లెలా వచ్చాయి?

బీఆర్ఎస్‌ది కిసాన్ రాజకీయం..కాంగ్రెస్‌ది డైవర్షన్ నాటకం

మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు

- మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ సందర్శన
- హరీశ్‌రావును అడ్డుకునేందుకు కట్టపై బైటాయించిన తుక్కాపూర్ గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు
- నచ్చజెప్పి పంపించిన పోలీసులు
- భారీ బందోబస్తు మధ్య ప్రశాంతంగా హరీశ్‌రావు సందర్శన



నవతెలంగాణ-తొగుట

'మాజీ సీఎం కేసీఆర్ కల ఫలించింది. ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకున్నాయి. కొందరు కాళేశ్వరం కొట్టుకుపోయిందని దుష్ప్రచారం చేశారు. కాళేశ్వరం కొట్టుకుపోతే.. ఈ ప్రాజెక్టులన్నింటికీ నీళ్లు ఎలా వచ్చాయి.' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ...13లో



ఏచూరి ఆశయ సాధనే కర్తవ్యం

ప్రజా అసంతృప్తిని సొమ్ము చేసుకుంటున్న పెట్టుబడిదారులు

మతోన్మాద, ఛాందస భావాలను పెంచి పోషిస్తున్న అంబానీ, అదానీ

అట్టడుగు వర్గాల జీవితాల్లో మార్పే సీతారాం జీవిత లక్ష్యం

'అధ్యయనం-పోరాటం' స్ఫూర్తితో భావి పౌరులను తీర్చిదిద్దాలి.. : ఎస్ఎఫ్ఐ ఖమ్మం పూర్వ విద్యార్థుల వేదిక సదస్సులో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఎస్. వీరయ్య


వివరాలు 10లో..

లడ్డూ పాలిట్రిక్స్

తిరుపతి నుంచి గుజరాత్ వరకూ చర్చ

- జంతువు కొవ్వుతో శ్రీవారి ప్రసాదాన్ని తయారు చేశారన్న బాబు సర్కార్
- సర్కారు ప్రకటన రాజకీయ ప్రయోజనాల కోసమేనన్న జగన్ పార్టీ
- భక్తుల మనోభావాల పేరుతో రంగంలోకి హిందూత్వశక్తులు
- ఈ అంశంపై జాతీయ స్థాయిలోనూ చర్చ

రాజకీయాలు ఎప్పుడు ఎలా మారతాయో తెలుసుకునేలోపు మరో అంశం తెరపైకి రావటం కామన్‌గా మారిపోయింది. నిన్నటి వరకు తినే ఆహారంపై రాజకీయం నడిస్తే..ఇపుడు శ్రీవారి ప్రసాదం (లడ్డూ) చుట్టూ రాజకీయం నడుస్తోంది. లడ్డూ తయారీలో నాసిరకం నెయ్యి వినియోగించారంటూ టీడీపీ సర్కార్ చేసిన ప్రకటన ఇప్పుడు ప్రకంపనలు పుట్టిస్తోంది. రాజకీయ ప్రయోజనాలకోసమే చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారని జగన్ పార్టీ అంటోంది. మరోవైపు హిందూ భక్తుల మనోభావాలపై దాడి అంటూ హిందూత్వ శక్తులుతెరపైకి వచ్చాయి. అంతిమంగా లడ్డూ రగడ కాస్త జాతీయస్థాయిలో చర్చనీయాంశంగా మారింది.



హైదరాబాద్ : ప్రస్తుతం రాజకీయాల్లో తిరుపతి లడ్డు మీద చర్చ తీవ్రంగా సాగుతున్నది. ఏపీ సీఎం చంద్రబాబు తిరుపతి లడ్డూ తయారీపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారమే రేపాయి. గత వైసీపీ పాలనలో తిరుపతి లడ్డూను జంతువు కొవ్వుతో తయారు చేశారని ఆయన ఆరోపించారు. ఒక ఆంగ్ల వార్త ఛానెల్ కూడా ఇదే కథనాన్ని ప్రసారం చేసింది. దీంతో తిరుపతి లడ్డు విషయంలో ఒక్కసారిగా రాజకీయ రగడ నెలకొన్నది. టీడీపీ, వైసీపీల మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. మత నాయకులు, రాజకీయ నేతలు, ఆలయాల బాధ్యులు ఇలా పలువురు ఈ అంశంపై స్పందించారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ఈ అంశంపై సమగ్ర విచారణకు డిమాండ్ చేశాయి. రాజకీయ ప్రయోజనం కోసమే చంద్రబాబు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని వైసీపీ ఆరోపించింది. దీనిని ఆసరాగా చేసుకొని కొన్ని హిందూత్వ సంస్థలు, సంఘాలు రంగంలోకి దిగాయి. ముఖ్యంగా, బీజేపీ ఈ విషయంలో ప్రజల సెంటిమెంట్లను ఆయుధంగా వాడుకొని దానితో రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నది. ఈ అంశంపై సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి.

కేంద్రబిందువుగా ల్యాబ్ నివేదిక

గుజరాత్‌లోని ఆనంద్‌లో గల నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (సీఏఎల్ఎఫ్) నుంచి వచ్చిన ల్యాబ్ నివేదిక ఈ వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. తిరుపతి లడ్డూలలో జంతువుల కొవ్వు ఉన్నట్టుగా ఈ నివేదిక సూచిస్తున్నదంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నది. హిందూత్వకు అనుకూలంగా ఉండే వ్యక్తులు, సోషల్ ఖాతాలు ఈ విషయాన్ని విరివిగా ప్రచారం చేశాయి. సుమంత్ రామన్ వంటి ప్రముఖ వ్యాఖ్యాతలు కూడా ఈ నివేదిక పత్రాన్ని ప్రచారం చేశారు. విస్తృతంగా షేర్ అవుతున్న చిత్రాలు నివేదికలోని చివరి పేజీలోని అనుబంధమని ఒక ఆంగ్ల వార్త కథనం నిర్ధారించింది. అయితే, నివేదిక అసంపూర్తిగా ఉన్నదనీ, ల్యాబ్ ఫలితాలు కల్తీని సూచిస్తున్నప్పటికీ..అవి జంతువుల కొవ్వు ఉనికిని కచ్చితంగా ...11లో

ఆరోగ్యమిత్రల సమ్మె విజయవంతం

టీయూఎంహెచ్ఇయూ నాయకులతో మంత్రి చర్చలు సఫలం

రూ.19,500కు వేతనం పెంపునకు సర్కారు ఒకే

సమ్మె విరమించిన ఉద్యోగులు



వివరాలు 2లో..

జానీ మాస్టర్‌కు రిమాండ్

ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరిచిన నార్సింగ్ పోలీసులు

చంచల్‌గూడ జైలుకు తరలింపు



వివరాలు 13లో..

సేయింట్ థామస్ పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

నవతెలంగాణ వార్త ఎఫెక్ట్...?

- విచారణ చేపట్టి వాస్తవాలు తెలుసుకుంటాం



నవతెలంగాణ-పెద్దవూర

ఈ నెల 19వ తేదీన నవతెలంగాణలో ప్రచురితమైన నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం వెల్మగూడెం గ్రామంలోని సేయింట్ థామస్ స్కూల్‌లో 'ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన' కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, జిల్లా విద్యాధికారి బిక్షపతి ఆదేశాల మేరకు మండల విద్యాధికారి తరి రాము శుక్రవారం పాఠశాలను సందర్శించారు. రికార్డులు పరిశీలించి కొంతమంది తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం ఎంఈఓ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాఠశాల యాజమాన్యం ఇక్కడ లేకపోవడంతో అడ్మినిస్ట్రేషన్ బాగాలేదని తెలిసిందన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా బాధ్యతగా చూడాల్సిన ఉపాధ్యాయులే ఇక్కడ గ్రూపులుగా ఉండటంతో విద్యాబోధన సక్రమంగా జరగడం లేదని తెలిపారు.

పాఠశాలలో ఆర్థిక లావాదేవీల విషయంలో కొంత వివాదాలు ఏర్పడుతున్నట్టు తెలిసిందని తెలిపారు. పాఠశాల ప్రారంభించిన ఈ మూడేండ్లలో నలుగురు ప్రిన్సిపాల్స్ మారారని తెలిసిందన్నారు. 'నవతెలంగాణ'లో ప్రచురితమైన వార్త విషయంపై ఇంకా లోతుగా విచారణ జరుపుతామని, తల్లిదండ్రులు, విద్యార్థినులతో మాట్లాడాల్సి ఉందని చెప్పారు. మూడూ నాలుగు రోజుల్లో పూర్తి విచారణ చేపడతామన్నారు. ఉపాధ్యాయుడు వీడియోలు తీసినట్టు విచారణలో తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆరోగ్యమిత్రల సమ్మె విజయవంతం

- టీయూఎంహెచ్ఇయూ నాయకులతో మంత్రి చర్చలు సఫలం
- రూ.19,500కు వేతనం పెంచేందుకు సర్కారు ఒకే
- సమ్మె విరమించిన ఉద్యోగులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ - సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో ఆరోగ్య మిత్రలు చేపట్టిన సమ్మె విజయవంతమైంది. వేతనాల పెంపుతో పాటు క్యాడర్ మార్పు తదితర డిమాండ్ల సాధన కోసం ఈ నెల 18న ఆరోగ్యమిత్రలు సమ్మె ప్రారంభించారు. ఈ నేపథ్యంలో టీయుఎంహెచ్ఇయూ గౌరవాధ్యక్షులు భూపాల్ తదిత నాయకులతో అదే రోజు మంత్రి దామోదర చర్చించారు. డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం మరో దఫా నాయకులతో చర్చించిన మంత్రి ఆరోగ్య మిత్రల వేతనాన్ని రూ.15,600 నుంచి రూ.19,500కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అదే విధంగా క్యాడర్ మార్పు (డేటా ఆపరేటర్)కు అంగీకరించారు. ప్రభుత్వం సానుకూలంగా తీసుకున్న నిర్ణయాన్ని ఆరోగ్య మిత్రలు స్వాగతించారు. యధావిధిగా ఆరోగ్యశ్రీ సేవల విధుల్లో పాల్గొంటున్నట్టు ప్రకటించారు. సమ్మె కాలానికి ఒడీ కింద వేతనాలు చెల్లించాలని మంత్రి ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోను ఆదేశించారు.

యూనియన్ నాయకులు సమ్మె విరమిస్తున్న మంత్రికి లేఖను అందజేశారు. పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న 900 మంది ఆరోగ్య మిత్రల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకున్న మంత్రికి ఆరోగ్యమిత్రలు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రితో జరిగిన చర్చల్లో రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో, భూపాల్, టీయుఎంహెచ్ఇయూ ఆరోగ్య మిత్రల విభాగం రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.కుమార్, ఉపాధ్యక్షులు విష్ణు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు రాజు, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు నగేష్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు తిరుపతి, ఖమ్మం జిల్లా అధ్యక్షులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చర్చల అనంతరం యూనియన్ నాయకులు ఒక ప్రకటన విడుదల చేశారు. మిగిలిన డిమాండ్లలో ట్రస్టు ఉద్యోగులుగా గుర్తించాలనీ, ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయాలనీ, చనిపోయిన ఉద్యోగు కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలనీ, ఎఫ్ఆర్ఎస్, హెల్త్ కార్డుల సమస్యలను పరిష్కరించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. అయితే వేతనాల ఒప్పందాన్ని తక్షణం అమలు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించినందున సమ్మె విరమణకు అంగీకరించినట్టు వారు పేర్కొన్నారు.

నిమ్స్ జెనెటిక్స్ విభాగంలో డే కేర్ సదుపాయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిమ్స్ జెనెటిక్స్ విభాగంలో డే కేర్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారు. సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్, డయాగ్నోస్టిక్స సహకారంతో నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మెడికల్ జెనెటిక్స్ విభాగంలో ఈ సదపాయాన్ని నిమ్స్ సంచాలకులు డాక్టర్ నగరి భీరప్ప శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ ఈ సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వ అరుదైన వ్యాధుల కోసం జాతీయ పాలసీ కింద బాధపడుతున్న రోగుల చికిత్స కోసం రూపొందించబడిందని తెలిపారు. ప్రస్తుతం నిమ్స్-సీడీఎఫ్‌డీ విభాగంలో 85 మంది అరుదైన వ్యాధులతో చికిత్స పొందుతున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ లిజా రాజశేఖర్. డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ షగున్ అగర్వాల్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ అశ్విన్ దలాల్, డిపార్ట్‌మెంట్ అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రజ్ఞ రంగనాథ్, అసిస్టెంట్ మెడికల్ సూపరిండెంట్స్ డాక్టర్ రాకేష్, డాక్టర్ చరణ్, సీనియర్ వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

సాగర్ ఎడమ కాలువ గండ్లు సత్వరమే పూడ్చాలి

- సాగునీరు విడుదల చేయాలి
- ఎండిపోతున్న పంటలను కాపాడాలి : తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఖమ్మం

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పాలేరు రిజర్వాయర్ కింది భాగంలోని సాగర్ ఎడమ కాలువకు పడిన భారీ గండ్లకు మరమ్మతులు పూర్తి చేసి సాగునీరు విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. సాగర్ కాలువకు పడిన గండ్లకు మరమ్మతులు చేపట్టి సాగునీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల జిల్లాలో 2.5 లక్షల ఎకరాల ఆయకట్టులో పంటలు ఎండిపోయే ప్రమాదం దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వర్షాలకు దెబ్బతిన్న ఆహార పంటలకు ఎకరాకు రూ.25వేలు, వాణిజ్య పంటలకు రూ.25వేలు అదనంగా సాగు భూమి వరదతో కోతకు గురైన, ఇసుక మేటలు వేసిన పొలాలకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా సకాలంలో గండ్లకు మరమ్మతులు చేపట్టలేదని అన్నారు.

మంత్రులు బహిరంగంగా ఇరిగేషన్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, దాని వల్ల రైతులకు జరిగిన నష్టం తిరిగి రాదని, ప్రభుత్వం మరమ్మతులకు ఆదేశించినా సకాలంలో పనులు ప్రారంభం చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల పరిధిలోని పంటలకు గోదావరి జలాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సాగర్ ఆయకట్టు పరిధిలో పాలేరు పాత కాల్వ, సాగర్ ఎడమ కాలువ తేడా తెలియకుండా రైతులను మభ్య పెట్టే ప్రకటనలు చేయడం సరికాదన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో జూన్ మాసంలో వరి వెదజల్లే పద్ధతిలో సాగు చేయడం వల్ల ఇప్పటికే 90 రోజులు దాటి పొట్ట దశలో ఉన్న పంటకు భారీ నష్టం జరిగిందని వాపోయారు. ఎకరాకు 25 నుంచి 30 వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు తమ కండ్ల ముందే పంటలు ఎండిపోతుంటే దిక్కుతోచని పరిస్థితుల్లో సాగునీరు కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు సకాలంలో మరమ్మతులు చేపట్టి వ్యవసాయ విద్యుత్‌కు ఆటంకం లేకుండా చేయాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, వరదల్లో నష్టపోయిన రైతులకు నేటికీ పరిహారం అందించలేదని అన్నారు. పెసర పంట తప్ప ఇతర పంటలను పరిహారం జాబితాలో చేర్చలేదని, జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకల సమీపంలో దెబ్బతిన్న పత్తి, వరి పంటలను పరిహారం జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రోజువారీ పర్యవేక్షణ చేస్తామని, మిగతా సమస్యల పరిష్కారం కోసం రైతులకు అండగా ఉంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాతా భాస్కరరావు, నాయకులు వాసిరెడ్డి ప్రసాద్, దుగ్గి కృష్ణ, రచ్చా నరసింహారావు, తాళ్ళపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, కొల్లేటి ఉపేందర్, కూచిపూడి మధు, అయినాల రామలింగేశ్వరరావు, శీలం సత్యనారాయణ రెడ్డి, నల్లమోతు మోహన్‌రావు, పారుపల్లి శ్రీనాథ్ పాల్గొన్నారు.

గురుకులాల పట్ల వివక్ష దారుణం

పాత ఫ్యాకల్టీని కొనసాగించాలి



- పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి
- రాష్ట్ర గురుకులాల కార్యదర్శిని బాధ్యతల నుంచి వెంటనే తప్పించాలి : గౌలిదొడ్డి బాలికల కాలేజీ ఎదుట పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-గండిపేట్

రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల పట్ల వివక్ష చూపడం దారుణమని పేరెంట్స్ కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. ఇటీవల తొలగించిన ఫ్యాకల్టీని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేసింది. శుక్రవారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలంలోని గౌలిదొడ్డి బాలికల గురుకుల కాలేజీ ఎదుట పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తున్న సీనియర్ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఉన్నఫళంగా తొలగించడం దారుణమన్నారు. దీనిపై గతంలో తాము ఆందోళన చేస్తే వారిని తిరిగి తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్ర గురుకులాల కార్యదర్శి శ్రీ వర్షిణిని వెంటనే బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఐఐటీ, నీట్, ఇతర కోచింగ్‌లకు సంబంధించి బోధన చేసే పాత సిబ్బందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సిబ్బందిని నియమించకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గురుకులాల్లో పరిస్థితులు మరీ అధ్వానంగా తయారయిందని విమర్శించారు. శానిటేషన్, మెస్ బిల్లులను సక్రమంగా చెల్లించడం లేదన్నారు. విద్యార్థులకు సరిపడా మెస్ బిల్లులను పెంచాలని డిమాండ్ చేశారు. వివిధ కేటగిరీల్లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులను సకాలంలో చెల్లించాలన్నారు. గురుకులాల్లో మౌలిక వసతులు లేవన్నారు. సరిపడ మరుగుదొడ్లు లేక విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇతర అనేక సమస్యలు ఉన్నాయని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సరిపడా నిధులు కేటాయించి గురుకులాల్లో మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. అనంతరం అక్కడి నుంచి మాసబ్ ట్యాంక్‌లోని గురుకులాల కార్యాలయానికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు మారుతి, సత్తయ్య, నాగరాజు, దుర్గయ్య, విజయ్, ప్రభాకర్, సతీష్ కుమార్, ఉషారాణి, కోటయ్య, సైదులు, ఉషన్న, నాగరాజు, రాజేష్, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

సెమీ కండక్టర్ల తయారీ పూర్తిగా స్వదేశంలో జరగాలి

విప్లవాత్మక మార్పులకు ఐటీ రంగం సిద్ధం కావాలి : ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

నవతెలంగాణ - బంజారాహిల్స్

ప్రతి రంగంలోనూ ప్రస్తుతం సెమీ కండక్టర్ల పాత్ర ఎంతో కీలకంగా ఉందని.. వీటి తయారీ పూర్తిగా స్వదేశంలో జరగాలని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సెమీ కండక్టర్ల ఉత్పత్తికి, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా ఉంటున్నప్పటికీ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లు మన దేశంలో నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన వాలుక రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం పలు ఐటీ కంపెనీలు, సెమీ కండక్టర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సెమీ కండక్టర్ల రంగంలో విప్లవాత్మక మార్పులకు ఐటీ రంగం సిద్ధం కావాలని సూచించారు. భవిష్యత్‌లో



సెమీ కండక్టర్ల వినియోగం, అవసరాలు భారీగా పెరగనున్నాయని, వాటికి అనుగుణంగా స్టార్టప్ కంపెనీలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వాటిని సిద్ధం చేసుకుంటే బాగుంటుందని చెప్పారు. ప్రస్తుతం మన దేశం చైనా, తైవాన్ నుంచి పెద్ద ఎత్తున సెమీ కండక్టర్లను దిగుమతి చేసుకుంటోందని తెలిపారు. ఆ దేశాలకు దీటుగా మన దేశం వీటి ఉత్పత్తిలో ముందుకు రావాలంటే కేంద్ర ప్రభుత్వం సహకరించాలన్నారు. ప్రస్తుతం రైతు, సాధారణ కుటుంబాల నుంచి కూడా యువకులు ఉన్నత చదువులు చదువుకొని ఈ రంగాల వైపు వస్తున్నారని చెప్పారు. కంపెనీలు ముందుకెళ్లేందుకు దేశంలోనే అగ్రభాగాన నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. అడ్వాన్స్ టెక్నాలజీపై ఐటీ కంపెనీలు దృష్టి పెట్టాలని, నగరంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అంతర్జాతీయ స్థాయిలో సదస్సులు నిర్వహించినట్టు గుర్తు చేశారు. అనంతరం వాలుక సొల్యూషన్స్ ఫౌండర్ సునీల్ జాస్తి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం స్టార్టప్ కంపెనీలను బాగా ప్రోత్సహిస్తున్నదని, దీని వల్ల యువతకు మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని అన్నారు. యువకులు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ వైపు రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు శ్లాఘనీయం

- సీఎం, మంత్రులకు ధన్యవాదాలు : రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రముఖ సంపాదకులు, రచయిత, కవి, స్వాతంత్ర సమరయోధులు, వనపర్తి నియోజకవర్గం మొదటి శాసన సభ్యులు సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు యూనివర్సిటీకి పెడుతూ శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవటం శ్లాఘనీయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో గోల్కొండ పత్రిక ద్వారా ఉద్యమ స్ఫూర్తిని, పోరాట జ్వాలలు రగిలించిన గొప్ప వ్యక్తి ప్రతాపరెడ్డిని పేర్కొన్నారు. సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలతో అనేక పుస్తకాలు రచించారని గుర్తు చేశారు. తన రచనల ద్వారా సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న గొప్ప మేధావి అని తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన సురవరం ప్రతాపరెడ్డి తన సొంత అసెంబ్లీ నియోజకవర్గం వనపర్తి నుంచి 1952లో తొలి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. అన్ని రంగాల్లో పేరు ప్రఖ్యాతులు పొందిన సురవరం ప్రతాపరెడ్డి పేరు తెలుగు యూనివర్సిటీకి పెట్టడం చారిత్రాత్మక నిర్ణయమని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రివర్గ సహచరులకు చిన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కారు ఇంజిన్లో మంటలు చెలరేగి దగ్ధం



నవతెలంగాణ- మాడుగులపల్లి

నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలంలోని కొత్తగూడెం వద్ద శుక్రవారం ఉదయం అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై వెళ్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామానికి చెందిన పసుపులేటి నాగయ్య కారులో మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపు వెళ్తున్నాడు. మాడుగుపల్లి మండలం కొత్తగూడెం స్టేజి వద్దకు రాగానే కారు ఇంజిన్లో మంటలు చెలరేగాయి. కారు మొత్తానికి అంటుకోవడంతో గమనించిన స్థానికులు వెంటనే కారు అద్దాలు పగులగొట్టి అతన్ని బయటికి తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న వెంకన్నను 108 వాహనంలో నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కారు పూర్తిగా దగ్ధమైంది.

అదానీ మెడకు స్విస్ ఉచ్చు

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి విచారణ జరుగుతుందని.. దీనిపై స్విస్ అటర్నీ జనరల్ పలువురిని ప్రశ్నించినట్టు తెలుస్తోంది. కాగా.. ఆ సంస్థ పేరును ప్రత్యేకంగా వెల్లడించలేదు. అయితే సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) ప్రకారం అది అదానీ గ్రూపునకు సంబంధించినదని సమాచారం. కాగా.. ఈ కేసులో విచారించిన లేదా పాల్గొన్న, పాల్గొనని వారి పేర్లను వెల్లడించడానికి ఓఏజీ ఆసక్తి చూపలేదు. కాగా 2023 జులై 20 నాడు ఫెడరల్ క్రిమినల్‌కోర్టు (ఎఫ్‌సీసీ) నిర్ణయం ప్రకారం.. అటర్నీ జనరల్ ఆఫ్ స్విట్జర్లాంట్ జెనీవా నుంచి క్రిమినల్ ప్రోసీడింగ్స్‌ను ప్రారంభించింది. ప్రస్తుతం పత్రాల ఫోర్జరీ (ఆర్ట్.305బిఐఎస్ పేరస్.1అండ్2 ఎస్‌సిసి). తీవ్రమైన మనీలాండరింగ్ (ఆర్ట్. 305బిస్ పేరస్ 1,2 ఎస్‌సీసీ)పై పరిశోధనలు కొనసాగుతున్నాయి. విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఇంతకు మించిన సమాచారాన్ని వెల్లడించలేమని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

స్విస్ క్రిమినల్ కోడ్ ఆర్టికల్ 251 ప్రకారం.. "తప్పుడు లేదా తప్పుడు పత్రాలతో మోసగించడానికి ఉపయోగించినట్లయితే.. ఐదేండ్ల వరకు శిక్ష, జరిమానా విధించబడుతుంది." ఆర్టికల్ 305బిఐఎస్ 1.11 ప్రకారం ఉద్దేశ్యపూర్వకంగా మోసానికి పాల్పడితే వారి ఆస్తులను జప్తు చేయడం లేదా మూడు సంవత్సరాల వరకు శిక్ష పడనుంది." అని స్విస్ చట్టాలు చెబుతున్నాయి. మనీలాండరింగ్‌కు పాల్పడిన యాజమాని, వ్యక్తి లేదా సంస్థను బయటికి తీసుకురావాలని విచారణ సంస్థలు లక్ష్యంగా పెట్టుకున్నాయని సమాచారం. బీవీఐ, మారిషెస్, బెర్ముడాల్లో అదానీ స్టాక్స్‌కు చెందిన నిధులను పెట్టుబడిగా పెట్టి మనీలాండరింగ్‌కు పాల్పడిందని ఇటీవల హిండెన్‌బర్గ్ ప్రధానంగా ఆరోపించింది. దీంతో స్విస్ మీడియాలో అదానీ గ్రూప్ చాలా చర్చనీయాంశమైంది. బ్రిటీష్ వర్జిన్ ఐలాండ్స్, మారిషస్, బెర్ముడాలో వివాదాస్పద నిధులలో అదానీ అనుబంధ సంస్థ ఫ్రంట్‌మాన్ ఎలా పెట్టుబడి పెట్టింది అనే దానిపై ప్రాసిక్యూటర్లు సమాచారాన్ని అందించారని హిండెన్‌బర్గ్ వెల్లడించింది. ఈ సమాచారాన్ని స్విస్ క్రిమినల్ కోర్టు రికార్డుల నుంచి పొందినట్టు పేర్కొంది. 2021 నాటికే అదానీపై మనీలాండరింగ్, సెక్యూరిటీల ఫోర్జరీ విచారణలో భాగంగా స్విస్ అధికారులు బహుళ స్విస్ బ్యాంక్ ఖాతాలలో ఈ సొమ్మును స్తంభింపజేసినట్లు వెల్లడించింది. అదానీ గ్రూప్‌నకు సంబంధించిన ఈ మనీలాండరింగ్ కేసు చాలా తీవ్రమయ్యిందని హిండెన్‌బర్గ్ తన రిపోర్ట్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే.

బదిలీలు, పదోన్నతుల అప్పీళ్లను పరిష్కరించాలి

- యూఎస్‌పీసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగిసి 80 రోజులు గడుస్తున్నా అప్పీళ్లను ఇప్పటి వరకు పరిష్కరించకపోవడాన్ని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నిరసిస్తున్నది. ఆ అప్పీళ్లను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. వెబ్ కౌన్సెలింగ్ పద్ధతిలో ప్రక్రియ పారదర్శకంగా జరిగినప్పటికీ కొన్ని సాంకేతిక కారణాలు, అధికారుల తప్పిదాలు, సమయాభావం, అవగాహనా లోపం వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు విద్యాశాఖ అప్పీళ్లకు వారం రోజులు గడువు ఇచ్చిందని గుర్తు చేసింది. ఆ మేరకు కొందరు ఉపాధ్యాయులు తమకు నష్టం జరిగిందంటూ అప్పీల్ చేసుకున్నారని వివరించింది. రెండువారాల్లో అప్పీళ్లను పరిష్కారం చేస్తామంటూ ఉత్తర్వుల్లో ప్రకటించారని తెలిపింది. కానీ 80 రోజులు గడిచినా అప్పీళ్ల పరిష్కారం కాకపోవడం వల్ల ఆ ఉపాధ్యాయులు నిత్యం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని పేర్కొంది. పాత స్టేషన్‌లో రిలీవై కొత్త స్టేషన్‌లో చేరకుండా కొందరు, రిలీవ్ కాకుండా మరికొందరు, కొత్త స్టేషన్‌లో చేరి ఇంకొందరు తమ అప్పీల్ పరిష్కారం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని వివరించింది. ఆ ఉపాధ్యాయుల అప్పీళ్లను పరిశీలించి పరిష్కరించాల్సిన బాధ్యత విద్యాశాఖపై ఉందని తెలిపింది. అప్పీళ్లన్నింటినీ సానుకూలంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేసింది. బదిలీలు, పదోన్నతుల్లో అక్రమాలకు పాల్పడినవారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.


ఆకేరు రైతుల కన్నీటి కష్టాలు తీరేదెలా..?



నవతెలంగాణ -మరిపెడ

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పోటెత్తిన వరదలతో ఆకేరు వాగు పరివాహక ప్రాంత రైతులు నట్టేట మునిగారు. పచ్చని పైరులతో కనిపించే పొలాలు వరద తీవ్రతతో ముంపునకు గురై మట్టిదిబ్బల్లా కనిపిస్తున్నాయి, గ్రామాల్లో వ్యవసాయం మొత్తం దెబ్బతిన్నది. మరో రెండేండ్లయినా కోలుకోలేని పరిస్థితుల్లో ఉన్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు, తెచ్చిన అప్పులు కట్టలేక ఎలా బతకాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇదీ మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని రైతుల ఆవేదన. మండలంలోని ఉల్లెపల్లి, భూక్యతండా, పురుషోత్తమాయగూడెం, సీతారాం తండా, తండా ధర్మారం, బాల్ని ధర్మారం.. తదితర తండాల్లో పొలాలు వరదలతో ముంపునకు గురై పనికిరాకుండా పోయాయి. ఉల్లెపల్లిలో సెక్టార్ పరిధిలోని 409 మంది రైతులకు చెందిన 246 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. తండా ధర్మారం సెక్టార్ పరిధిలోని 282 మంది రైతులకు చెందిన 209 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. పురుషోత్తమాయగూడెం సెక్టార్ పరిధిలో 251 మంది రైతులకు 244 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. సాగుచేసిన పొలాలు కొట్టుకుపోవడమే కాక, దాచుకున్న ధాన్యం తడిసి ముద్దయి పోయిందని, ఇప్పుడు తామంతా ఎలా బతకాలని రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఇస్తామన్న సాయం సమయానికి ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందజేయాలని పలువురు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


నిండా మునిగాం.. ఆదుకోవాలి



ఆకేరు వాగు ఉప్పొంగి నాట్లు పెట్టిన పొలాలు దెబ్బతిన్నాయి. సుమారు ఆరెకరాల్లో వరి నాట్లు వేయగా.. వరద తీవ్రతతో పొలంపై మట్టి దిబ్బలు ఏర్పడ్డాయి. ప్రభుత్వం ఇస్తున్న సహాయం సరిపోదు. అధికారులు సమగ్రంగా సర్వే చేసి రైతులను ఆదుకోవాలి.

- శ్రీనివాస్ రెడ్డి, రైతు, బాల్నిధర్మారం

ఎకరానికి రూ.50,000 ఇవ్వాలి



ఆకేరు వాగు పొంగి పొర్లడంతో దాని పక్కనే ఉన్న మా మూడెకరాల పొలం దెబ్బతిన్నది. జాతీయ రహదారి దెబ్బతిని కంకర, ఇసుక మొత్తం వచ్చి మా పొలంలో మేట వేసింది. దాన్ని సరి చేసుకోవడానికి ఎన్నేండ్లు పడుతుందో అర్థం కాని పరిస్థితి. తీవ్రంగా నష్టపోయిన మాకు ఎకరానికి రూ.50,000 నష్టపరిహారం అందించాలి.

- వంగూరు విజయ్, రైతు, పురుషోత్మాయగూడెం

పొలాలను కమ్మేసిన ఇసుక మేటలు పరిహారం కోసం ఎదురుచూపులు

కౌలు రైతులకు నష్టపరిహారం అందించాలి



వరదలతో నష్టపోయిన కౌలు రైతులనూ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి. నాకు రెండున్నర ఎకరాలు ఉండగా మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని పంట వేశాను. ఆకేరు ముంపుతో పొలం మొత్తం కొట్టుకుపోయింది. సుమారు రూ.2 లక్షల పెట్టుబడి పెట్టా. ఇప్పుడు దాన్ని ఎలా తీర్చుకోవాలి.

- గూగులోత్ హనుమంతు, రైతు, సీతారాం తండా

త్వరలో రైతులకు నష్టపరిహారం అందిస్తాం




ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు త్వరలోనే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించనున్నది. మండలంలో సుమారు 2 వేల మంది రైతులకు చెందిన 1758 ఎకరాల్లో తీవ్ర నష్టం జరిగింది. వారందరి ఆధారాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి పంపించాం.

- భూక్య వీరాసింగ్, మరిపెడ వ్యవసాయ శాఖ అధికారి



వినీలాకాశంలో ప్రకాశవంతమైన నక్షత్రం

కామ్రేడ్ సీతారాం



పినరయి విజయన్

కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం భారత ప్రజాస్వామ్యానికి, లౌకిక రాజకీయాలకు, మరీ ముఖ్యంగా విప్లవ కార్మికోద్యమానికి తీరని దెబ్బ. ఏచూరి ఒక అసాధారణమైన మార్క్సిస్టు మేధావి. గత తొమ్మిదేండ్లుగా సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా పార్టీకి నాయకత్వం వహిస్తూ, అత్యంత కష్టకాలంలో పార్టీని ముందుకు నడిపించారు.


దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన కాలంలో, దానిని వ్యతిరేకించే విద్యార్థి నాయకుడిగా సీతారాం ఏచూరి ప్రసిద్ధుడయ్యారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘానికి అధ్యక్షుడిగా అత్యంత ధైర్య సాహసాలతో, ఆనాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అధికార నివాసానికి ప్రదర్శన నిర్వహించి, ఎమర్జెన్సీ నేపథ్యంలో జరిగిన అకృత్యాలకు బాధ్యత వహిస్తూ జేఎన్‌యూ వైస్ ఛాన్సలర్ పదవికి ఆమె రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటిదాకా జేఎన్‌యూ విద్యార్థి సంఘానికి మూడుసార్లు వరుసగా గెలిచిన ఏకైక వ్యక్తి సీతారాం ఏచూరి. జేఎన్‌యూ క్యాంపస్‌లో మరణానంతరం తుది వీడ్కోలు అందుకున్న రాజకీయ నాయకుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి మాత్రమే. సీతారాం ఏచూరిని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం ఎంత గౌరవించిందో, ఇంకెంతగా ప్రేమించిందో ఇది తెలుపుతుంది.

33 ఏండ్ల వయస్సులో సీతారాం పార్టీ కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. 40 ఏండ్ల వయసులోనే పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడయ్యారు. జాతీయంగా, అంతర్జాతీయంగా పరిస్థితులు వెంటవెంటనే మారుతున్న కాలంలో సీపీఐ(ఎం) పార్టీ రాజకీయ, వ్యూహాత్మక, ఎత్తుగడల పంథాలను రూపొందించడంలో ముఖ్య పాత్ర నిర్వహించారు. మూడు దశాబ్దాల కాలంగా, కమ్యూనిస్టు పార్టీగా మన స్థానం చాలా కీలకమైనదని, సమర్థవంతమైనదని రుజువైంది. అనేక రంగాల్లో మన పని మెరుగుపడటం, ప్రజలను కొత్త తరగతుల్లోకి విస్తరించడమే దీనికి ఉదాహరణ.

సీతారాం ఏచూరి అసాధారణమైన చదువరి. అనేక భాషలు అనర్గళంగా మాట్లాడ గలరు. ఆయనకు భారతదేశ చరిత్ర, భారతీయ సమాజం, సంస్కృతి, రాజకీయాలు, అలాగే వర్తమాన పరిణామాలు, అంతర్జాతీయ సంబంధాలపై లోతైన పరిజ్ఞానం వున్నది. అతని ప్రసంగం తీరు అద్భుతం. ఉపన్యాసాలు, సందేశాలు అన్ని వేళలా పెద్ద మోతాదులో శ్రోతలను ఆకర్షించేవి. మార్క్సిజం, లెనినిజం, గతి తార్కిక భౌతిక వాద సూత్రాలు సాధారణమైన వ్యక్తికి కూడా అర్థమయ్యేట్లు వివరించగల సామర్థ్యం గలవారు సీతారాం. పార్టీ తరగతులు బోధించాలని, మరీ ముఖ్యంగా విద్యార్థులు యువజనులు కోరేవారు. ప్రజలకు విజ్ఞానం కల్పించడంలో కలిగే ఉత్సాహాన్ని ముందుకు తీసుకెళ్లడానికి 'లెఫ్ట్ వర్డ్ బుక్స్' ప్రచురణ సంస్థకు ఫౌండర్ డైరెక్టర్‌గా పని చేశారు.

ఏచూరి ప్రమేయం చారిత్రాత్మకమైనది

ఈ నయా ఉదారవాదం యుగంలో కార్మికులకు , రైతులకు సంబంధించిన సమస్యలపై ఏచూరికి స్పష్టమైన అవగాహన ఉంది. ఇటీవల సంవత్సరాల్లో వారి దుస్థితిని ప్రధానంగా దేశం ముందుకు తీసుకురావటంలో అతని ప్రమేయం చారిత్రాత్మకమైనది. ఎన్నికల రంగంలో ఫలితాల సాధనలో మనది వెనకడుగైనప్పటికీ, క్షేత్రస్థాయిలో మన పోరాటాలు విస్తరించాయి. వాటి ఫలితంగా స్వతంత్ర భారతదేశంలో మొదటిసారి పాలకవర్గాలకు అతి ఇష్టమైన మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవలసిన వచ్చింది



ప్రతిఘాత శక్తులు చరిత్రకు వక్రభాష్యాలు అల్లుతున్న సందర్భంలో సీతారాం ఏచూరి తన వాదనా పటిమతో చరిత్రను మళ్ళీ పట్టాల మీదకు ఎక్కించారు. పార్టీ చరిత్ర పట్ల, అందులోనూ క్లిష్టమైన సందర్భాలలో అనుభవజ్ఞులైన పార్టీ నాయకులు చేసిన కషి గురించి సీతారాంకు ఉన్న జ్ఞానం అపారమైంది. రెచ్చగొట్టే సందర్భాలలో కూడా చిరునవ్వుతో ఆ సమస్యలను పరిష్కరించటం అతని ప్రత్యేకత.

మరణానంతరం శాస్త్రీయ దక్పథానికి కట్టుబడి ఉన్న ఏచూరి

జీవిత పర్యంతం అనుసరించిన విధంగానే, మరణానంతరం కూడా సీతారాం ఏచూరి శాస్త్రీయ దక్పథానికి కట్టుబడి ఉన్నారు. పరిశోధన స్ఫూర్తిని ఎలుగెత్తారు. ప్రకాశిస్తున్న నక్షత్రం, ఇప్పుడు సైన్సులో విశ్రాంతి తీసుకుంటున్నది.. ప్రియమైన కామ్రేడ్ నీకు ఇవే నా అరుణారుణ వందనాలు.

ప్రజల తరపున నిజమైన ప్రతినిధి ఏచూరి

కామ్రేడ్ సీతారాం పార్లమెంటులో ప్రజల తరపున ఉన్న నిజమైన ప్రతినిధి. రాజ్యసభలో సభ్యుడిగా ఉన్న రెండు పర్యాయాలు, దేశంలోని సామాన్యులను, పేదలను వేధించే సమస్యలు లేవనెత్తి సభలో చర్చ జరిగేటట్టు చేసేవాడు. నిజానికి అట్టడుగున, అణగారిన ప్రజలపట్ల ఉన్న ఆవేదన, యూపీఏ -1 హయాంలో కనీసం ఉమ్మడి కార్యక్రమం రూపొందించడంలో ఆయన చేసిన కషి కనబడుతుంది. రాజ్యసభ చర్చలలో కామ్రేడ్ సీతారాం జోక్యం చేసుకోవడానికి సభయావత్తు ఆసక్తితో గమనించేది, తరచుగా సభాధ్యక్షులు నుంచి ప్రశంసలు వచ్చేవి.

రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్షాలు తెచ్చిన సవరణలు ఆమోదించినప్పటికీ, సీతారాం ఏచూరి చాకచక్యమైన జోక్యంతో రెండు సవరణలను ప్రభుత్వపక్షం అంగీకరించాల్సి వచ్చింది. ప్రతిపక్షంలో అనుభవజ్ఞుడైన నాయకుడిగా కామ్రేడ్ సీతారాం, ప్రజల మేలు కోసం వివిధ పార్టీల నాయకులను ఏకతాటిపైకి తెచ్చిన సందర్భాలు అనేకం. అనేక సమస్యలపై రాజకీయ ఏకాభిప్రాయం సాధించడంలో అతనికున్న సమర్థత కామ్రేడ్ సీతారాంను ఒక నిజమైన రాజనీతిజ్ఞుడిగా నిలబెట్టింది. అతని దృష్టిలో దేశ ప్రయోజనం అంటే ప్రజల ప్రయోజనమే. వారి ప్రయోజనాలు కాపాడడానికి సాధ్యమైన అవకాశాలు అన్నింటినీ అన్వేషించేవారు.



భారతదేశంలో ప్రజాస్వామ్యం నిలద్రొక్కుకోవాలంటే, దేశం యొక్క లౌకిక, సమాఖ్య లక్షణాలు కాపాడబడాలి. దేశ వ్యవహారాలు నడపడంలో దేశంలోని అన్ని తరగతుల ప్రజలకు సమాన హక్కు కలిగి ఉండాలని నమ్మారు.

ప్రజాస్వామ్యం పారదర్శకంగా లేనిపక్షంలో, అది ఎప్పుడు వెనకబడిన వారికి పేదలకు అనుకూలంగా ఉండదు అని గట్టిగా విశ్వసించారు. ఆర్టికల్ 370, సీఏఏ, ఎలక్టోరల్ బాండ్స్ మొదలైన సమస్యల పట్ల సీపీఐ(ఎం) వైఖరిని పార్టీ ప్రధాన కార్యదర్శిగా దేశం ముందుకు తీసుకురావటంలో, చివరికి సుప్రీంకోర్టు వరకైనా వెళ్ళటం ఏచూరికి వున్న అంకిత భావాన్ని తెలుపుతుంది. భారతదేశ సమాఖ్య నిర్మాణాన్ని సమర్థించడంలో దఢంగా నిలబడ్డారు. రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు, ఆర్థికాలలో కేంద్రం చొరబడుతున్న నేపథ్యంలో, జంతర్ మంతర్ దగ్గర కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేరళ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వివిధ జాతీయ పక్ష రాజకీయ నాయకులను భాగస్వామ్యం చేయటంలో ఆయన కీలకంగా వున్నారు.

కేరళ సీపీఐ(ఎం)కు సంబంధించి, సీతారాం ఏచూరి రాజకీయ, నిర్మాణ విషయాలతో పాటు అన్ని విషయాలలో సహాయపడేవారు. సిద్ధాంతం పట్ల స్పష్టత, పార్టీపట్ల అతనికున్న అంకితభావం నిజంగా వెలుగు బాటన నడిపించేవే.. కేరళలో మా ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి సంబంధించి గత ఎనిమిదేండ్లుగా అతను చేసిన మార్గదర్శకత్వాన్ని, మద్దతును ఎప్పుడూ గొప్పగా చెప్పుకుంటాం. అతను లేకపోవడం, నిస్సందేహంగా మాకు తీరని లోటు.

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీలోనూ, పొలిట్‌బ్యూరోలోనూ కామ్రేడ్ సీతారాం ఏచూరితో కలిసి పని చేయగలగటం వ్యక్తిగతంగా నా అదష్టంగా భావిస్తాను. అతని కొలీగ్‌గా, కామ్రేడ్‌గా అతని నుంచి తెలుసుకోవాల్సింది, నేర్చుకోవాల్సింది చాలా వుంది. వ్యక్తిగతంగా తీవ్ర నష్టం వాటిల్లిన సందర్భంలోనూ, ఆరోగ్యం క్షీణిస్తున్న పరిస్థితుల్లోనూ పార్టీ ఇచ్చిన బాధ్యతలను, సమాజం ఆయనపై పెట్టిన నమ్మకాన్ని సదా అంకితభావంతో నిర్వర్తించారు. అతని మరణం వ్యక్తిగతంగా నాకు ఒక బాధాకరమైన లోటు మాత్రమే కాదు, జాతీయ, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి కూడా పూడ్చలేని లోటు.

ఉన్నత విలువలను సమర్థించడంలో సీతారాం పెట్టని కోట

ప్రజాస్వామ్యం, సమాఖ్య భావన, సోషలిజం, లౌకికవాదం, దేశ సార్వభౌమాధికారం వంటి ఉన్నత విలువలను సమర్థించడంలో కామ్రేడ్ సీతారాం ఒక పెట్టని కోటలా ఉండేవాడు. సజనాత్మకమైన అతని ఆలోచనలు దేశానికి సంబంధించిన అనేక విషయాలలో ఏకాభిప్రాయ సాధనకు ఉపయోగపడేవి. సరళీకరణ - ప్రయివేటీకరణ- ప్రపంచీకరణ (ఎల్పీజీ)కు వ్యతిరేకంగా పోరాడే సీతారాం ప్రభుత్వ రంగ సంస్థలను చెక్కుచెదరకుండా కాపాడేందుకు గట్టిగా నిలబడే వాడు. గత నాలుగైదు దశాబ్దాలుగా ఢిల్లీ నగరం చూసిన ప్రతి పోరాటంలోనూ, పోలీసు దాడులను ధైర్యంగా ఎదుర్కొంటూ ముందు భాగంలో ఉండేవారు. రైతుల పోరాటం మొదలుకొని సీఏఏ పోరాటం దాకా, ఇటీవల జరిగిన అన్ని పోరాటాలలో ఆయన ముందు వరుసలో ఉన్నాడనే విషయం అందరి దష్టిలో ఉంది. తన



స్థానం ప్రాముఖ్యత మీద ఆయనకు స్పష్టత ఉంది. అతని ప్రసంగాలలో 2జీ కుంభకోణం నుంచి పరమాణు ఫ్యాక్టరీల దాకా విస్తతంగా అనేక అంశాలు ఉండేవి. యూపీఏ -1 హయాంలో సమాచార హక్కు, విద్యాహక్కు, ఆహార భద్రత పథకాల రూపకల్పనలో కామ్రేడ్ సీతారాం నాయకత్వ పాత్ర వహించారు.

ఏచూరిది.. భిన్నత్వంలో ఏకత్వం పట్ల

ఉద్వేగభరిత నిబద్ధత



బి.వి. రాఘవులు

సీతారాం ఏచూరితో సుదీర్ఘ అనుబంధం కలిగిన సహచరులకు, కామ్రేడ్స్‌కు, మిత్రులకు ఆయన తమ మధ్యలో లేరన్న వాస్తవాన్ని జీర్ణించుకోవడం చాలా కష్టం. అంతకు మించి ఫాసిస్టు హిందూత్వ తరహా మతోన్మాదులు చేస్తున్న భయంకర దాడులకు వ్యతిరేకంగా సంకీర్ణ భారత పరిరక్షణ కోసం ప్రస్తుతం కొనసాగుతున్న పోరాటంలో ఆయన భౌతికంగా శాశ్వతంగా లేకపోవడం వల్ల ఏర్పడిన శూన్యాన్ని సమీప భవిష్యత్తులో భర్తీ చేయడం మరింత కష్టమైన పని. సంకీర్ణ భారతం అనేది ఆయన అభిమానపాత్రమైన భావన. అయినప్పటికీ మతోన్మాద వ్యతిరేక పోరాటం పట్ల ఆయన రాజీలేని నిబద్ధత, ప్రజాస్వామ్య ఆదర్శాల పరిరక్షణ పట్ల ఆయన అంకితభావం, అణగారిన, దోపిడీకి గురవుతున్న జనం ప్రయోజనాల కోసం ఆయన జీవితాంతం పాటుపడిన తీరు- ఆయన విడిచివెళ్లిన వారసత్వాన్ని ముందుకు తీసుకు వెళ్లేందుకు మనల్ని ఉత్తేజితుల్ని చేస్తూనే ఉంటాయి.

యావత్ జీవితం ప్రజలు, దేశం, సీపీఐ(ఎం) కోసం అంకితం

సీతారాం తన సహచరులందరికన్నా ఎక్కువ విశ్వజనీన వ్యక్తి, అంతర్జాతీయవాది. ఆయన ప్రపంచ వ్యాపిత పర్యటనలు, అనేక భాషలను ధారాళంగా, వినసొంపుగా మాట్లాడగలిగిన నేర్పు, ఒక అత్యున్నత శ్రేణి కమ్యూనిస్టు ప్రచారకునిగా ప్రతి అంశంపై ఆయనకున్న బహుముఖ పరిజ్ఞానాన్ని వినియోగించడం- ఇవన్నీ తనను ఆ స్థానంలో నిలబెట్టాయి. అంతేకాదు, ఆయన అభ్యుదయ తెలుగు సంస్కృతి విశిష్ట ఉత్పాదన కూడా. ఆ సంస్కృతి ఆయనలో పొంగిపొర్లే హాస్యచతురతలోను, చతురోక్తులు, రిపార్టీల లోను ప్రతిబింబిస్తుంది. యావత్ జీవితం ప్రజలు, దేశం, సీపీఐ(ఎం) కోసం అంకితం

సీతారాం బాల్యం తెలుగు ప్రజల రాజకీయాల్లోని ఎత్తుపల్లాలతో పరోక్షంగా ప్రభావితమైంది. అప్పటి మద్రాసు రాష్ట్ర రాజధాని చెన్నైలో ఆయన జన్మించారు. కొత్తగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్ర హైకోర్టు గుంటూరులో ఏర్పడటంతో జడ్జిగా ఉన్న తన తాతగారితో పాటు సీతారాం గుంటూరుకు వచ్చారు. తర్వాత ఏర్పడిన భాషాప్రయుక్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌కు 1956లో చేరుకున్నారు. మళ్ళీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కల్లోలం. 1969లో ప్రత్యేక తెలంగాణా కోసం ఆందోళన. దీంతో నవయువకుడు సీతారామా రావు తన చదువు ఆగకుండా కొనసాగించే దుకు ఢిల్లీకి మారాల్సి వచ్చింది. అక్కడ ఆయన ప్రెసిడెంట్స్ ఎస్టేట్ స్కూలులోను, సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలోను ప్రతిభావంతంగా చదువుకుని జేఎన్‌యూకు చేరుకున్నారు. అక్కడే కామ్రేడ్ సీతారాం ఏచూరిగా మారారు. తన యావజ్జీవితాన్ని ప్రజల కోసం, దేశం కోసం, తన పార్టీ సీపీఐ(ఎం) కోసం అంకితం చేశారు.

తన కార్యాచరణ కేంద్రం ఢిల్లీ అయినప్పటికీ, తెలుగు ప్రజల రాజకీయాలతో తన సంబంధాన్ని సీతారాం ఎన్నడూ వీడలేదు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం, జాతీయ రాజకీయాలలో అతి చురుకైన పాత్ర వహించడం, సీపీఐ(ఎం) కేంద్ర బాధ్యతల్లో ఉన్న సీతారాం జాతీయ స్థాయి రాజకీయాల్లో జోక్యం పెంచుకోవడం ఏక కాలంలో జరిగాయి.

1984లో ఎన్‌టి రామారావు ప్రభుత్వాన్ని కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూలదోసినపుడు దేశవ్యాపితంగా మద్దతు కూడగట్టే కృషిలో సీతారాం అగ్రభాగాన నిలిచారు. తన మెజారిటీని రాష్ట్రపతి ముందు చూపించడానికి ఎన్‌టి రామారావు ఆనాడు ఎమ్మెల్యేలను ఢిల్లీకి తీసుకు వచ్చినప్పుడు వారికి ఏర్పాట్లు చేయడంలో యువనేతగా ఉన్న సీతారాం చురుకైన పాత్ర వహించారు. ఆ తర్వాత దేశవ్యాపితంగా కాంగ్రెస్ వ్యతిరేక శక్తులను కూడగట్టి 1989-90లో నేషనల్ ఫ్రంట్ ఏర్పాటులో ఎన్‌టి రామారావు ముఖ్య పాత్ర వహించారు. ఆ కృషిలో సీపీఐ(ఎం) కీలక పాత్ర దాల్చింది. 1996-98లో ఎన్‌టి రామారావు కన్వీనర్‌గా యునైటెడ్ ఫ్రంట్ ఏర్పడిన సమయంలో జరిగిన చర్చలు, సంప్రదింపుల్లో సీపీఐ(ఎం) అగ్రనేతలతో పాటు సీతారాం చురుగ్గా పాల్గొన్నారు.

2004 సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగిన సంప్రదింపుల్లో ఆయన సంప్రదింపుల ప్రావీణ్యాన్ని ప్రత్యక్షంగా గమనించే అవకాశం నాకు లభించింది. సీతారాం, నేను ఆనాడు ఢిల్లీలోని కొందరు ముఖ్య కాంగ్రెస్ నేతలతో జరిగిన చర్చల్లో పాల్గొన్నాము. ఎదుటివారు చెప్పిన దానికి అంగీకరించకుండా, అదే సమయంలో తెగదెంపులు చేసుకోకుండా అంగుళం అంగుళం ముందుకు కదులుతూ ఓపిగ్గా మనం అనుకున్నదానికి చేరుకోవడం ఆయన సంప్రదింపుల నేర్పరితనపు ముఖ్య లక్షణం. చాలా దూరంలో ఉన్న ఢిల్లీలో అఖిల భారత స్థాయిలో బాధ్యతలు నిర్వహిస్తున్న ప్పటికీ తెలుగు రాష్ట్రాల ప్రజలకు, పార్టీకి సహాయం చేయడానికి సీతారాం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేవారు. 2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు, సీపీఐ(ఎం) వైఖరిని దేశానికి తెలియజేయడంలో పార్లమెంటులో ఆయన ముఖ్యపాత్ర వహించారు. ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా రాష్ట్రాన్ని విభజించడంలో కాంగ్రెస్, బీజేపీల మ్యాచ్ ఫిక్సింగ్‌ను ఆయన ఎండగట్టారు. 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అంటూ గురజాడను ఉటంకిస్తూ, ఇరు ప్రాంతాల ప్రజలకు హాని కల్గించబోయే ఇలాంటి ముఖ్యమైన నిర్ణయం తీసుకోవడానికి వెనక ఉన్న దురుద్దేశాలను ఆయన ప్రశ్నించారు. మీరు రెండు పడవల్లో ప్రయాణిస్తున్నారు, మధ్యలో మునిగిపోతారు అంటూ ఆనాడు కాంగ్రెస్ వారిని సీతారాం హెచ్చరించారు. ఆ హెచ్చరిక సరైందని తర్వాత అనతి కాలంలోనే రుజువైంది. తదుపరి 2014 ఎన్నికల్లో ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాలలోనూ కాంగ్రెస్ ఘోరపరాజయం పాలైంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం అమలు గురించి 2014 ఫిబ్రవరి 20వ తేదీన పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల అమలు గురించి 2016, జులై 28న రాజ్యసభలో స్వల్ప వ్యవధి చర్చ జరిగింది. అప్పుడు తన మాతృభాష అయిన తెలుగులో ప్రసంగిస్తూ చేసిన వాగ్దానాలను, ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. అలా చేయకపోతే సీపీఐ(ఎం) చూస్తూ ఊరుకోదని, హామీల అమలుకు పోరాటం చేస్తుందని సభలో ప్రకటించారు. మతోన్మాద శక్తుల వల్ల దేశ సమైక్యతకు ఏర్పడిన ముప్పు పట్ల ఆయన ఎల్లప్పుడూ ఆందోళన చెందుతూ ఉండేవారు. ముందు తరాల నుంచి మనకు సంక్రమించిన భారత సంకీర్ణ సంస్కృతి దేశ సమైక్యతను పరిరక్షిస్తుందని ఆయన గట్టిగా విశ్వసించారు. భారత దేశ విశిష్టతలో ముఖ్యలక్షణమైన భిన్నత్వంలో ఏకత్వం పట్ల ఉద్వేగపూరిత నిబద్ధత ఆయన హృదయాంతరాళాల్లో నుంచి వచ్చింది.



గర్వంగా ప్రకటించిన సందర్భం

రాజ్యసభలో 2017, ఆగస్టు 10న ఆయన వీడ్కోలు ప్రసంగం ఈ అంశాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించింది. తన కుమారుడ్ని ఉత్తర భారతీయుడంటారా, దక్షిణ భారతీయుడంటారా, ఉన్నత కులస్తుడంటారా, నిమ్న కులస్తుడంటారా, హిందూ అంటారా, ముస్లిం అంటారా అని ప్రశ్నించి, ఈ ముద్రలేవీ అతనికి వర్తించవని, ఒక్క భారతీయుడన్నది మాత్రమే వర్తిస్తుందని గర్వంగా ప్రకటించారు. 1921లో అహ్మదాబాద్‌లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలో మౌలానా హస్రత్ మొహాని, స్వామి సంపూర్ణానంద కలిసి సంపూర్ణ స్వరాజ్యాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారని, స్వాతంత్ర్య పోరాటంలోని ఆ ఘట్టాన్ని ప్రస్తావించారు. వారిరువురు కలిసి తీర్మానాన్ని ప్రవేశపెట్టడం మత గుర్తింపులకు అతీతమైన భారత ప్రజల సమైక్యతకు చిహ్నంగా భాసిల్లుతుందని చెప్పారు.



సీతారాం ఏచూరి

అతను సామాన్య రాజకీయవేత్త కాదు
సామాన్య మానవుడూ కాదు
ఇక సెలవంటూ నేను వీడ్కోలు పలికినప్పుడు
రాజకీయాల్లో కొందరే
నీకోసం నేనున్నా అనేవారు
నీకోసం ఎంతకైనా తెగించేవారు
రాజకీయాలలో కేవలం కొందరే
అటువంటి వాళ్ళు ఉంటారని నాకు అర్థమైనది
పేదలకోసం పోరాడేవారు
ఆర్తుల కోసం ఆరాటపడేవారు
దోచుకునే, దాచుకునే
రాజకీయ నాయకుడిలా
కాకుండా....

- (కపిల్ సిబల్, ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది)



ఏచూరి కుటుంబం మినీ భారతం


సీతారాం పుట్టింది దక్షిణ భారతంలో, స్థిరపడింది ఉత్తర భారతంలో. ఆయన బహు భాషలు మాట్లాడగలడు. తెలుగు, హిందీ, బెంగాలీ, తమిళం మొదలైన భాషల్లో మాట్లాడుతూ వారితో తేలిగ్గా కలిసి పోగలడు. ఆయన కుటుంబం ఒక మినీ భారతం- అది భిన్నత్వంలో ఏకత్వం. తన స్వంత రాష్ట్రాన్ని వీడి చాల కాలమైనప్పటికీ తెలుగు చక్కగా మాట్లాడే వాడు. తెలుగు రాష్ట్రాలలో పర్యటిస్తున్నపుడు ప్రజలు ఆయనను తెలుగులోనే మాట్లాడమని కోరేవారు. ఆయన ఉపన్యాసాలు కథలు, జీవిత ఘట్టాలతో పండితులను, పామరులను కూడ ఆకట్టుకునేవి. ఆయన శైలి చాల సరళంగా ఉంటుంది. ఆయనలో హాస్యచతురత పుష్కలంగా ఉంది. ఆయన ఒక అద్భుతమైన కమ్యూనిస్టు పార్లమెంటేరియన్, ప్రచారకుడు. ఆయన పూర్వీకుల గృహం ఆంధ్రప్రదేశ్, తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడలో ఉంది. ఆయన తల్లిగారు అక్కడే నివసించేవారు. ఆయన మేనమామ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి హైదరాబాద్‌లో నివసిస్తారు. తెలుగు రాష్ట్రాలను సందర్శిం చినప్పుడల్లా ఆయన వీలు చేసుకుని వారి వద్దకు వెళ్ళేవారు. తన కుమారుడు అప్పుడప్పుడైనా వచ్చి తన చేతివంట తినాలన్నది ఆయన తల్లిగారి ఏకైక కోరిక. ఎంత తరచుగా వీలైతే అంత తరచుగా ఆయన తన తల్లి గారి కోర్కె తీర్చేందుకు ప్రయత్నించేవారు. ఆయన తన చివరి వరకు నిర్విరామంగా కొనసాగించిన ముమ్మర కృషి మధ్యలో అది మాత్రమే ఆయన వారకివ్వగలిగిన ఉపశాంతి.





సంపాదకీయం

మార్పు మిథ్య



'మార్పు మిథ్య, మోడీయే సత్యం!- మోడీ పదేండ్ల పాలనలో దేశానికి ఒరిగింది ఏమీ లేదు. బహుశా భవిష్యత్తులో కూడా ఒరిగేది ఏమీ ఉండదు. ఏకపక్ష, నిరంకుశ విధానాలు ఇక చెల్లవంటూ.. 303 స్థానాల నుంచి 63 స్థానాలకు కోత పెట్టి, 240 సీట్లకు పరిమితం చేసినా.. అంగీకరించే నైతికత ఇసుమంతైనా లేదు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు షరతులతో కూడిన ప్రజామోదాన్ని నరేంద్ర మోడీ పొందారు. అయితే ప్రజా తీర్పుపై వ్యక్తమైన ప్రజల అభీష్టాన్ని ఆయన గుర్తించలేదు. ఈ దురహంకారం ఆయన స్వాభావికమైనదని మరి చెప్పనవసరం లేదు. అత్యధిక ప్రజలు ఎదుర్కొం టున్న ఆకలి, నిరుద్యోగం, దారిద్ర్యంపై గతంలో 'ఫ్యాన్ ఇండియా- (ఫైనాన్షియల్ అకౌంటబులిటీ నెట్ వర్క్ ఇండియా) విడుదల చేసిన బ్లాక్ పేపర్ ఇప్పటికీ వైఫల్యాలను ఎత్తిచూపుతూనే ఉంది.

> కథువా, హత్రాస్, ఉన్నావ్, మణిపూర్‌లో అత్యంత అనాగరిక ఘటనల గురించి ఎన్నడూ నోరుమెదపని మోడీ.. ఇటీవల మహిళల భద్రత గురించి మాట్లాడటం విడ్డూరమే! హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, అస్సాం తదితర రాష్ట్రాల్లో ఆవు పేరుతో ఆటవికంగా హత్యలు చేసే ఘోరాలు సాగిపోతూనే ఉన్నాయి. నేరస్తులను రక్షిస్తూ, బాధితులను జైళ్లలో తోస్తున్నది. ఈ దేశంలో మనుషుల కంటే ఆవులు, దూడలే ముఖ్యమన్నట్టు.. కొత్తగా దూడను తన కుటుంబ సభ్యురాలిగా చేసుకుంటున్నా నంటూ సోషల్ మీడియాలో ప్రధాని ప్రకటించారు.


మతం పేరుతో సమీకరణాలు జరుపుతూ, వైషమ్యాలు పెంచడమే అజెండాగా గతంలో ముందుకు తీసుకొచ్చిన 'ఒకే దేశం - ఒకే ఎన్నిక', లేటరల్ ఎంట్రీ విధానం, ప్రసార సేవల (నియంత్రణ) బిల్లు, వక్ఫ్ చట్ట సవరణ... ఇలా ప్రతి అంశంలోనూ ముందుకెళ్లేందుకు ప్రయత్ని స్తూనే వుంది. ఈ అజెండాతో వెళ్తే.. తమ కొంప కొల్లేరైపోతుందని సంకీర్ణ భాగస్వామ్య పక్షాలు సైతం భయపడుతున్నాయి. మరో వైపు చేతికి ఎముక లేదన్నట్టు ఆశ్రిత కార్పొ రేట్లకు సర్వం కట్టబెడుతూ, వారి అరాచకాలకు కొమ్ముకాస్తోంది.

మూటగట్టుకున్న ప్రజావ్యతిరేకతను తగ్గించుకునే ప్రయత్నంలో.. చేసిన జిమ్మిక్కులు వికటించాయి. పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) స్థానంలో తీసుకొస్తున్నట్టు ఆర్భాటంగా ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)పై ఉద్యోగ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నిరుద్యోగ యువతకు భరోసా ఇచ్చే ప్రయత్నమేదీ గత వందరోజుల్లో లేదు. అగ్నివీర్‌ను సమీక్షిస్తామని చెప్పినా.. ఆ పథకాన్ని రద్దు చేయాల్సిందేనన్న నినాదం మారుమోగుతోంది. అదానీ కుంభకోణంలో అడ్డంగా దొరికి పోయిన సెబీ చైర్‌పర్సన్ మాధబి బచ్‌కు వత్తాసు పలుకుతూ, చర్యలకు మీనమేషాలు లెక్కిస్తోంది. ఆర్ఎస్ఎస్ కార్య కలాపాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై నిషేధాన్ని ఎత్తివేసిన కొద్దిరోజులకే లేటరల్ ఎంట్రీ విధానం తీసుకురావడం యాదృచ్ఛికం కాదు. నిపుణుల పేరుతో కార్పొరేట్లను, సంఘ్ పరివారాన్ని తీసు కొచ్చి, బ్యూరోక్రసీని నేరపూరితం, కార్పొరేటీ కరించడమే లక్ష్యంగా సివిల్స్ అభ్యర్థుల కలలను కల్లలు చేసేందుకు యత్నించింది. పెద్దఎత్తున నిరసన, మిత్రపక్షాలైన జేడీయూ, ఎల్‌జేపీ వ్యతి రేకతతో మూడో రోజే విరమించుకోవాల్సి వచ్చింది. ఆలయాల్లో అన్యమతస్తులు ఉండకూడదంటూ నిత్యం ఉద్రిక్తతలు రెచ్చగొడుతూనే.. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డులను ముస్లిమేతరులతో నింపేసి, ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టే వక్ఫ్ సవరణ చట్టంపై సర్వత్రా వ్యతిరేకత ఎదురైంది. మిత్రపక్షాలుసైతం మద్దతివ్వలేమని సంకేతాలి వ్వడంతో జేపీసీకి నివేదించింది. తగినంత మెజారిటీ లేకపోయినా.. 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' జమిలీకి కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. జమిలీ ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని విజ్ఞులమాట.

లోక్‌సభ ఎన్నికల్లో మోడీ సర్కారు, గోడీ మీడియా బండారాన్ని బయటపెట్టిన కొన్ని యూట్యూబ్ న్యూస్ ఛానెళ్లు, కొందరు యూట్యూబర్లు లక్ష్యంగా తీసుకొచ్చిన బ్రాడ్ కాస్టింగ్ సర్వీసెస్ (నియంత్రణ) బిల్లుకు తీవ్ర వ్యతిరేకత రావడంతో అక్టోబర్15 వరకూ స్పందనలు సమర్పించ వచ్చంటూ మంత్రితో ప్రకటన చేయించింది. కోవిడ్ సాకుతో జనగణనను వాయిదా వేసిన కేంద్రం.. కులగణనకు ప్రతిపక్షాలు గట్టిగా పట్టుబడు తుండటంతో.. అందుకు సమాయత్తమవుతున్నట్టు సంకేతాలిస్తోంది. గ్రామీణులకు కొంతమేరకు భరోసా ఇస్తున్న ఉపాధి హామీ నిధుల్లో కోత పెడుతూ ఉసురు తీస్తోంది. పంటల బీమా పథకం, యూరియా సబ్సిడీ, పోషకాహార ఆధారిత సబ్సిడీలకూ కేటాయింపులు తగ్గించింది. కొల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి, హత్యపై న్యాయం చేయడానికి బదులు రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ పాకులాడుతోంది.

కథువా, హత్రాస్, ఉన్నావ్, మణిపూర్‌లో అత్యంత అనాగరిక ఘటనల గురించి ఎన్నడూ నోరుమెదపని మోడీ.. ఇటీవల మహిళల భద్రత గురించి మాట్లాడటం విడ్డూరమే! హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, అస్సాం తదితర రాష్ట్రాల్లో ఆవు పేరుతో ఆటవికంగా హత్యలు చేసే ఘోరాలు సాగిపోతూనే ఉన్నాయి. నేరస్తులను రక్షిస్తూ, బాధితులను జైళ్లలో తోస్తున్నది. ఈ దేశంలో మనుషుల కంటే ఆవులు, దూడలే ముఖ్యమన్నట్టు.. కొత్తగా దూడను తన కుటుంబ సభ్యురాలిగా చేసుకుంటున్నా నంటూ సోషల్ మీడియాలో ప్రధాని ప్రకటించారు. దానికి 'దీపజ్యోతి- అంటూ నామకరణం కూడా చేశారు. కార్పొరేట్ అనుకూల, మతోన్మాద అజెండానే మోడీ 3.0 లోనూ ముందుకు సాగింది. ఈ దుర్విధానాలకు అడ్డుకట్ట వేయాల్సింది ప్రజా ఉద్యమాలే!

హిందూత్వ వ్యతిరేక పోరాటంలో అగ్రగామి సీతారాం ఏచూరి


నీలోత్పల్ బసు



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఇకలేరు. తీవ్రమైన శ్వాసకోశ సంబంధిత వ్యాధితో కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతల్లో ఉంటూ మరణించిన మొదటి నాయకుడు సీతారాం ఏచూరి. ఆయనను ప్రధాన కార్య దర్శిగా మాత్రమే చూడటం అంటే వివిధ రంగాలలో ఆయన చేసిన కృషిని అసమగ్రంగా అంచనా వేయటమే అవుతుంది. సుదీర్ఘకాలం నుంచి ఆయన పార్టీ నాయకత్వ బృందంలో భాగంగా ఉన్నారు. ఆయన నిర్వహించిన బాధ్యతలకు మించి విస్తారమైన కృషి చేశారు. మరణి ంచిన తర్వాత వివిధ రంగాలలోని వారి నుండి వచ్చిన సంతాప సందేశాలు, వ్యాఖ్యలు పార్టీని, దేశ రాజకీయ రంగాన్ని ఆయన విస్తారంగా ప్రభావితం చేశాడని వెల్లడిస్తున్నాయి. పార్టీ సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, ఆందోళన తదితర రంగాలన్నింటిలోకి ఆయన కృషి విస్తరించింది. ఆయన వ్యక్తిత్వాన్ని, వివిధ సందర్భాలలో చేసిన కృషిని ప్రశంసిస్తూ సందేశాలలో పేర్కొన్నారు. ఎఐఐఎంఎస్ నుంచి ఆయన భౌతికకాయాన్ని తీసుకుని, అంతిమయాత్రను ప్రారంభించిన రోజు జరిగిన సంఘటనలను తలచుకుంటే ఆయన మరణం వలన కలిగిన లోటేమిటో తెలుస్తుంది. ఆయన భౌతికకాయాన్ని శవపేటికలో ఉంచి, విద్యార్థి సంఘ కార్యకర్తగా ఆయన ప్రజాస్వామిక ఉద్యమంలోకి మొదటగా ప్రవేశించిన జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలోకి తీసుకెళ్ళినపుడు ఊహించని శిబిరం నుంచి కూటమిలోని వారు తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. సీతారాం ఏచూరి క్రైస్తవుడని, కాబట్టి హిందూయిజాన్ని ఆయన వ్యతిరేకించటం ఆశ్చర్యం కలిగించదని బీజేపీ ఐటీ విభాగంలోని సీనియర్ సభ్యుడొకరు ట్వీట్ చేశారు.

మరణించిన తర్వాత కూడా సీతారాం ఏచూరి హిందుత్వ కూటమిని వెంటాడుతున్నాడని దీనిని బట్టి స్పష్టమౌతున్నది. హిందుత్వను ఎదుర్కోవటం కోసం సైద్ధాంతిక రంగంలో ఆయన చేసిన లోతైన కృషి ప్రాధాన్యతను కూడా ఇది వెల్లడిస్తున్నది. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించటం కోసం జీవితాంతం ఆయన చేసిన కృషిని లౌకిక, ఉదారవాద భావాలతో ఉన్నవారు ప్రశంసిస్తుండగా, మతపరమైన గుర్తింపును వక్రీకరించటం ద్వారా ఆయన వారసత్వాన్ని ప్రశ్నార్థకం చేసేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఆర్ఎస్ఎస్ విధానాలు బలహీనానికి కృషి

హిందుత్వను, దాని సైద్ధాంతిక మూలశక్తి అయిన ఆర్ఎస్ఎస్ విధానాలను బట్టబయలు చేయటం, దానిని బలహీన పర్చటం కోసం ఆయన తన జీవితాంతం కృషి చేశాడు. దేశ రాజకీయ రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులను, ముఖ్యంగా 1992లో బాబ్రీ మసీ దును కూల్చివేసిన తర్వాత వచ్చిన మార్పులను ఆయన గ్రహించాడు. ఆందోళన కరమైన ఘటనలు జరుగుతున్న ఈ సమయంలో హిందుత్వ ప్రాజెక్టు అత్యంత వేగంగా ముందుకు పోయింది. మనం సాధారణంగా హిందుమతంగా భావించే వివిధ రకాలైన భావజాలాలకు, దీనికీ ఎటువంటి సంబంధం లేదు. హిందుత్వ ఎజెండా నిజస్వరూపాన్ని బట్టబయలు చేయటం కోసం సీతారాం ఏచూరి తీవ్ర కృషి చేశారు.

ఆయన ప్రధాన రచనలలో ఒకటి, 1993లో ప్రచురించిన "హిందురాష్ట్ర అంటే ఏమిటి?" లో ఆర్ఎస్ఎస్ రెండవ నాయకుడు గోల్వాల్కర్ భారతదేశ నాగరికతాభివృద్ధి చరిత్రను వక్రీకరిస్తూ చేసిన వాదనలను విమర్శనాత్మకంగా పరిశీలించాడు. గోల్వాల్కర్ రచించిన "మనము, మన జాతీయత", పుస్తకంలోని అంశాలను కూలంకషంగా చర్చించాడు. బ్రిటిష్ వ్యతిరేక పోరాటం ద్వారా భారతీయులు సాధించుకున్న సమాజాన్ని, జాతీయతను విచ్ఛిన్నం చేయటం హిందుత్వ ప్రధాన లక్ష్యం అని ఆ పుస్తకంలో ఆయన విశ్లేషణ చేశాడు. భారతదేశ లౌకిక, ప్రజాస్వామిక రాజ్య వ్యవస్థను, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయటమే ఆర్ఎస్ఎస్, హిందుత్వ శక్తుల లక్ష్యమని చెప్పాడు. వారి మౌలిక సైద్ధాంతిక లక్ష్యాలను బట్టబయలు చేశాడు. అధ్యయనం ద్వారా రుజువైన వాస్తవాలను ఆయన విస్తారంగా ప్రచారం చేశాడు. ఈ ప్రాజెక్టు లక్ష్యాలను బయట పెట్టటం ఆర్ఎస్ ఎస్, విస్తారంగా ఉన్న దాని అనుబంధ సంఘాలకు బల్లెపు పోటులా పరిణమిం చింది. ఆర్ఎస్ఎస్‌కు ఇటాలియన్ ఫాసి స్టులతో ఉన్న సంబంధాలను పరిశోధకుడు మార్జియా కొజోలరి వెల్లడించటం, వలస విధానం, మానవ జీవకణాలపై జరిగిన అధ్యయనాలలో వెల్లడౌతున్న వాస్తవాలు ఆ సంస్థ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎండగడుతున్నాయి.

తరచూ లెనిన్ మాటలను ఉదహరించిన ఏచూరి

నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అధ్యయనం చేయటమే గతితార్కిక విధాన సారాంశం అన్న లెనిన్ మాటలను సీతారాం ఏచూరి తరచుగా ఉదహరిస్తుండే వాడు. జాతీయతకు మతమే ప్రాతిపదిక అన్న గోల్వాల్కర్ భావాలను తుత్తు నియలు చేయటంలో ఈ సూత్రం ఆయనకు బాగా ఉపయోగపడింది. ఈ సూత్రం ప్రాతి పదికగా కార్యాచరణ లేనట్లైతే భారతదేశంలో మితవాద రాజకీయ సిద్ధాంతానికి అగ్ర గామిగా ఉన్న హిందుత్వను ఎదుర్కోవటం కోసం చేసిన ప్రయత్నాలు అసంపూర్తిగా మిగిలిపోయేవి. ఆర్ఎస్ఎస్‌కు అనుబం ధంగా ఉండటం వలన బీజేపీ ఇతర రాజకీయ పార్టీల కంటే భిన్నమైనదని ఆయన చెప్పారు. ఉన్నతమైన మార్క్సిస్టు సంప్రదాయాల ఒరవడిలో జరుపు తున్న ఈ మతోన్మాద వ్యతిరేక సైద్ధాంతిక పోరా టాన్ని జాతీయోద్యమ నాయకులు చేసిన కృషితో ముడిపెట్టి, ఆధునీకరించిన సీపీఐ(ఎం) కార్యక్ర మంలో కూడా దానిని చేర్చారు. జేఎన్‌యూలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయటం, ఆర్థికవేత్తగా ఉన్న పూర్వరంగం సోవియట్ యూనియన్ పతనం తర్వాత ప్రపంచ ఆర్థికవ్యవస్థలో వచ్చిన తీవ్రమైన మార్పులను అర్థం చేసుకోవటానికి దోహదం చేశాయి. ఈ నూతన దశలో దేశంలో అసమానతలు, నిరు ద్యోగం, దరిద్ర్యం పెరుగుతాయని చెప్పాడు. ప్రపంచ ద్రవ్య పెట్టుబడి భారతదేశంలో ఏ విధమైన మార్పులు తీసుకురానున్నదో ఆయన వివరించాడు. తీవ్ర మితవాద శక్తుల పెరుగుదలకు ఇది దోహదం చేస్తుందని, వారికి సైద్ధాంతిక సాధనంగా హిందుత్వ, భౌతిక లక్ష్యాల సాధనకు ఆర్ఎస్ఎస్ ఉపయోగపడుతుందని చెప్పాడు. గత నాలుగు దశాబ్దాలుగా నేను సీతారాం ఏచూరితో కలిసి పనిచేస్తున్నాను. విద్యార్థి ఉద్యమంలో జాతీయస్థాయిలో మా కృషి ప్రారంభమైంది. అసాధా రణమైన విశ్లేషణా శక్తి, భావాలను స్వేచ్ఛగా, స్పష్టంగా వ్యక్తీకరిం చటం, ఒక కామ్రేడ్‌గా, నాయకుడుగా, మార్గదర్శిగా ఆయన ఇచ్చిన తోడ్పాటు విద్యార్థి ఉద్యమం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించ టంలో మాకు ఎంతగానో తోడ్పడ్డాయి. భారత విద్యార్థి ఫెడరేషన్ కోసం ఆయన రాసిన ' వలసవాదానికి దారితీసే నూతన విద్యా విధానం' కరపత్రం విద్యార్థి ఉద్యమమే కాక మొత్తం విద్యారంగం భవిష్యత్ పోరాటాలకు సన్నద్ధం కావటానికి పునాదిగా పనిచేసింది. విద్యారంగంపై దాడి, ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులు తర్వాత కాలంలో 'కేంద్రీకరణ, వాణిజ్యీకరణ, మతతత్వీకరణ' కు దారితీస్తాయని ఆయన చేసిన విశ్లేషణ రానున్న ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావటానికి దోహదం చేసింది. రాజ్యసభలో విద్యారంగంపై చర్చ జరుగుతున్న పుడు జోక్యం చేసుకొని, ప్రభుత్వాన్ని వెనుకడుగు వేయించటానికి ఈ రంగంలో ఆయన చేసిన అధ్యయనం తోడ్పడింది. ఫలితంగా నూతన విద్యా విధానంపై ప్రవేశపెట్టిన మొదటి ముసాయిదాను ప్రభుత్వం హడావిడిగా ఉప సంహరించుకున్నది.

వినమ్రతగా వ్యవహరించేవారు

ఆయన వినమ్రతగా వ్యవహరించటాన్ని నేను స్వయంగా చూశాను. నేను పార్లమెంటు సభ్యునిగా ఉన్న చివరి సంవత్సరం ఆయన రాజ్యసభ సభ్యునిగా ఎన్నికయ్యారు. నేను రాజ్యసభలో సీపీఐ(ఎం) గ్రూపు నాయకునిగా ఉన్నాను. పార్టీ గ్రూపు నాయ కునిగా ఆయన బాధ్యతలు స్వీకరించాలని నేను మళ్ళీమళ్ళీ విజ్ఞప్తి చేసినప్పటికీ ఆయన వెంటనే ఆ బాధ్యతను స్వీకరించటానికి అంగీకరించలేదు. నేను పార్లమెంటు సభ్యునిగా ఉన్నంత కాలం ఆ బాధ్యత నేనే నిర్వహించాలని చెప్పాడు. ఆ తర్వాత 11 సంవత్సరాలు ఆయన చేసిన కృషి నమోదై ఉండటంతో పాటు, ప్రజలలో కూడా విస్తృతంగా ప్రచారమైంది. వివిధ రాజకీయ అంశాలపై జరిగే చర్చలలో ఆయన సమయస్ఫూర్తితో వ్యవహరించినప్పటికీ, హిందు త్వతో ఎదురయ్యే ప్రమాదాలు, అది మన రాజ్యాంగాన్ని దిగజార్చ టానికి చేస్తున్న ప్రయత్నాలను వివరించటంపై ప్రధాన కేంద్రీకరణ ఉండేది.

భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రపై పార్లమెంటులో ప్రత్యేక చర్చ జరిగినపుడు ఆయన జోక్యం గుర్తుంచుకోదగినది. దేశ స్వాతం త్ర్యం కోసం జరిగిన పోరాటంలో కమ్యూనిస్టుల ఘనమైన వారస త్వాన్ని సభ దృష్టికి తెచ్చాడు. హిందుత్వ, ఆర్ఎస్ఎస్‌లు చేసిన ద్రోహాన్ని ఎండగట్టాడు. హిందుత్వ ఫాసిస్టు లక్షణాలు మరింతగా స్పష్టమౌతున్నపుడు, మన వనరులన్నింటినీ సమీకరించి దానిపై పోరాటాన్ని తీవ్రం చేయాల్సిన పరిస్థితులలో సీతారాం ఏచూరి పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనాడు. హిందుత్వపై రాజకీయ, సైద్ధాంతిక పోరాటాలు చేయటంతో పాటు లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న విస్తృతమైన తరగతులను, శక్తులను కలుపుకురావాలి. కీలకమైన ఈ పోరాటంలో వామపక్ష, ప్రజాస్వామిక శక్తులను ఐక్యంగా కదిలించాల్సిన అవసరాన్ని ఆయన ఎన్నడూ మరువలేదు. భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవటం కోసం జరిగే విస్తృతమైన పోరాటాల ద్వారా మాత్రమే ఈ ఐక్యతను సాధించగలమన్న విషయం కూడా ఆయనకు తెలుసు.

> భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రపై పార్లమెంటులో ప్రత్యేక చర్చ జరిగినపుడు ఆయన జోక్యం గుర్తుంచుకోదగినది. దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో కమ్యూనిస్టుల ఘనమైన వారస త్వాన్ని సభ దృష్టికి తెచ్చాడు. హిందుత్వ, ఆర్ఎస్ఎస్‌లు చేసిన ద్రోహాన్ని ఎండగట్టాడు. హిందుత్వ ఫాసిస్టు లక్షణాలు మరింతగా స్పష్టమౌతున్నపుడు, మన వనరులన్నింటినీ సమీకరించి దానిపై పోరాటాన్ని తీవ్రం చేయాల్సిన పరిస్థితులలో సీతారాం ఏచూరి పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనాడు. హిందుత్వపై రాజకీయ, సైద్ధాంతిక పోరాటాలు చేయటంతో పాటు లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న విస్తృతమైన తరగతులను, శక్తులను కలుపుకురావాలి. కీలకమైన ఈ పోరాటంలో వామపక్ష, ప్రజాస్వామిక శక్తులను ఐక్యంగా కదిలించాల్సిన అవసరాన్ని ఆయన ఎన్నడూ మరువలేదు.

> నాజీల దాడి సమయంలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం చూపిన మార్గంలో స్వతంత్రంగా నడవాలని, ఇతర ప్రజాస్వామిక, లౌకికశక్తులతో కలిసి ఫాసిస్టు శక్తులను ఐక్యంగా దెబ్బకొట్టాలన్న సూత్రాన్ని అమలు చేశాడు. ఇండియా కూటమిని ఏర్పాటు చేయటంలో ఈ సూత్రం మార్గదర్శిగా పని చేసింది. ఆ కూటమి ఇపుడు బీజేపీకి ప్రత్యామ్నాయ శక్తిగా ఉన్నది.

కామ్రేడ్ కిషన్ సింగ్ సూర్జిత్ లాంటి సీనియర్ నాయకులతో కలిసి రాజకీయ పరిణామాల లో జోక్యం చేసుకోవటం, 1996లో ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం, 2004లో ఏర్పడిన బీజేపీయేతర ప్రభుత్వ అనుభవాలతో అందరూ అంగీకరించే అంశాల ప్రాతిపదికగా విస్తారమైన లౌకిక, ప్రజాతంత్ర శక్తులను సమీకరించటంలో నేర్పు సంపాదించాడు. 2019 ఎన్నికల తర్వాత మోడీ ప్రభుత్వం పూర్తి బలంతో విజృంభిస్తున్నపుడు దానిని ఎదుర్కోవటానికి ఈ అనుభవాలు ఉపయోగపడ్డాయి. మోడీ నాయకత్వంలో హిందుత్వ శక్తులు అజేయులని ప్రచారం జరుగుతున్నప్పటికీ, ఆర్థిక, రాజకీయ, సైద్ధాంతిక అంశాలలో వారి బలహీనతలను సీతారాం ఏచూరి గ్రహించాడు.

నాజీల దాడి సమయంలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం చూపిన మార్గంలో స్వతంత్రంగా నడవాలని, ఇతర ప్రజాస్వామిక, లౌకికశక్తులతో కలిసి ఫాసిస్టు శక్తులను ఐక్యంగా దెబ్బకొట్టాలన్న సూత్రాన్ని అమలు చేశాడు. ఇండియా కూటమిని ఏర్పాటు చేయటంలో ఈ సూత్రం మార్గదర్శిగా పని చేసింది. ఆ కూటమి ఇపుడు బీజేపీకి ప్రత్యామ్నాయ శక్తిగా ఉన్నది.

సీతారాం ఏచూరి మరణం పట్ల మిత్రులు, శత్రువులు తీవ్రంగా స్పందించారు. వాస్తవాన్ని అర్థం చేసుకోవటం, దానిని మార్చటం అన్న సూత్రాన్ని మరింతగా బలపరిచేందుకు ఆయన చేసిన కృషి రానున్న కాలంలో జరిగే పోరాటాలకు మార్గదర్శిగా ఉంటుంది. చివరిగా సీతా రాం తనను ఒక వ్యక్తిగా ఎప్పుడూ భావించుకోలేదు. ఒక పెద్ద ఉద్య మంలో తానొక భాగంగా వ్యవహరించాడు. మార్పులను అర్థం చేసు కోవటం, శాస్త్రీయంగా విశ్లేషణ చేయటం, ప్రతికూలాంశాలను అధిగమించటం కోసం చేసే కృషిలో ఆయన వారసత్వం కొనసాగుతుంటుంది.

ఎర్ర కాగడా

ఉదయ కిరణ బాణాలు
ఒక నిరంకుశత్వాన్ని చీల్చేస్తూ
నిత్య నిర్మల వికాసానికి
వారధిగా నిలబడి గెలిచింది
ఎర్ర జెండా రెపరెపలు
ఒక వినూత్న గేయాలాపనకు
సమసమాజ గీతికగా
నిరంతరం పోరాటం చేసింది
అట్టడుగు నిర్బంధాలతో
ఒక గీత అడ్డంగా వచ్చినప్పుడు
ఎరుపు కండ్ల పరిష్కారపు ఒరవడి
ఉవ్వెత్తున లేచి నిలబడింది



అణగదొక్కే పరిణామపు కోరల్ని
ఎర్రటి కాగడా వెలుగు ఖడ్గం
ఖండించే పనిలో నిమఘ్నమైంది
ఆ ఎర్ర సూరీడు మండుతుంటే
వెక్కిరించే అరచేతుల మధ్యన
పెదబబ్బల గుణపాఠం
ఒక పరిష్కారపు మార్గమైంది
చిన్న చూపుల పరంపరలో
దూరమౌతున్న మానవతకు
బుద్ధి చెప్పే ఉద్యమాల పోరు గద్ద
ఒక్కసారిగా దండెత్తి కదిలింది

ఎగురుతున్న ఎరుపు పతాకం
కొడవండ్లు చేతబట్టి
కలుపు మొక్కల కొత్తకై కదులుతూ
సమధర్మ పాలిత ప్రాంతానికై
సమర శంఖం పూరిస్తూ కదిలింది
బడుగు సమర భేరి నినాదంలో
అనచబడేప్రక్రియకు
తిలోద కాలిస్తూ
పగ్గాలను చేతబట్టే చైతన్యానికి
ఊతమిస్తూ ఉరకలేస్తోంది
ఎర్రసూరీడు సాక్షిగా
ఒక ఉద్యమ బాట
ఒక ఉద్ధారణ హోమానికి
ఆజ్యం పోస్తూ బతుకునిస్తోంది
సమాజంలో బతకనిస్తోంది

- నరెద్దుల రాజారెడ్డి
9666016636

విద్యార్థి దశలోనే ప్రతిభచూపిన సీతారాం ఏచూరి


ఎంఎ బేబి


సీతారాం ఏచూరితో నా సన్నిహిత పరిచయం 45 సంవత్సరాల క్రితం 1979లో ప్రారంభమైంది. 1979, ఫిబ్రవరిలో ఎస్ఎఫ్ఐ మూడవ మహాసభ పాట్నా లో జరిగింది. ఇతరులతో పాటు మమ్మల్ని కూడా ఎస్ఎఫ్ఐ కేంద్ర ఆఫీస్ బేరర్లుగా ఎన్నుకున్నారు. అప్పటి వరకు తమ స్వంత రాష్ట్రాలలో పని చేస్తున్న కొందరు ఆఫీస్ బేరర్ల సహకారంతో ప్రకాశ్‌కరత్ ఒక్కడే అఖిలభారత కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. మహాసభ తర్వాత ఐదుగురితో ఢిల్లీలో అఖిలభారత కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. ప్రధాన కార్యదర్శి నేపాల్‌దేవ్ భట్టాచార్య, వైస్ ప్రెసిడెంట్ సైఫుద్దీన్ చౌదరి, ట్రెజరర్ సొహైల్ హష్మి, సహాయ కార్యదర్శి సీతారాం ఏచూరి, ప్రెసిడెంట్‌గా నేను టీంలో ఉన్నాం. 20 జనపథ్‌లో మాకొక చిన్నగది ఇచ్చారు. ఆ గదిని ఎంపీగా ఉన్న సుశీలా గోపాలన్ గారికి కేటాయించారు. తన పార్లమెంటు సభ్యులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలలోనే ఢిల్లీ నుంచి పనిచేస్తున్న కార్యకర్తలకు వసతి కల్పించాలనేది సీపీఐ(ఎం) విధానంగా ఉన్నది. మా పనిలో భాగంగా నేను, సీతారాం ఏచూరి అనేకసార్లు కలిసి ప్రయాణం చేశాం. అనేక సందర్భా లలో రైళ్ళలో రిజర్వేషన్ లేకుండా రాత్రిపూట ప్రయాణం చేశాం.

పంజాబ్‌లో ఖలిస్తానీ వేర్పాటువాదులు, ఈశాన్య ప్రాంతంలో విచ్ఛిన్నకరశక్తులు నిరంతరం భౌతికదాడులకు పాల్పడటం, క్రమపద్ధతిలో విచ్ఛిన్నకర కార్యకలాపాలు నిర్వహిం చటం వలన ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐలు తీవ్రంగా నష్టపోయాయి. ఇటువంటి పరిస్థితులలో కొత్తగా ఏర్పడిన డీవైఎఫ్ఐ నాయకత్వంతో కలిసి వేర్పాటువాద కార్యక్రమాలకు వ్యతిరేకంగా జాతీయస్థాయిలో అన్ని తరగతుల విద్యార్థులు, యువతలో ప్రచారం చేయాలని నిర్ణయించాం. విద్యార్థులు, యువతను ఆకర్షించేలా అందరికీ విద్య అందరికీ ఉద్యోగం అనే నినాదాలిచ్చాం.

ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ కార్యకర్తలు వెళ్ళగలిగిన ప్రతిమూలకూ ప్రచారాన్ని తీసుకెళ్ళాం. సంకుచిత నినాదాలైన భూమిపుత్రులు లాంటివి ఏ విధంగా తప్పో, మేం ఇస్తున్న నినాదాలు ఏ విధంగా సరైనవో వారికి వివరించాం. దోపిడీ సమాజంలో విద్య, ఉద్యోగాలు పొందటానికి ఎదురౌతున్న సమస్యలకు శాస్త్రీయ కారణాలను వివరించాం.

సీతారాం ఏచూరి సంపాదకుడిగా ఉన్న ఎస్ఎఫ్ఐ పత్రిక స్టూడెంట్స్ స్ట్రగుల్ ఈ క్యాంపెయిన్‌లో ముఖ్య పాత్ర నిర్వహించింది. ఆయన రాసిన సంపాదకీయాలు, పత్రికలోని సమాచారాన్ని ప్రచారంలో విస్తృతంగా వినియోగించాం. పార్లమెంటు, రాష్ట్రపతి భవన్‌లకు సమీపంలోని బోట్‌క్లబ్ వద్ద 1981, సెప్టెంబరు 15వ తేదీన ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థి, యువజన ప్రదర్శన గొప్పగా విజయవంతమైంది. (కొంతకాలం నుండి అక్కడ ఏ విధమైన కార్యక్రమాలకు అనుమతి ఇవ్వటం లేదన్న విషయం మనకు తెలుసు). ఈ అఖిలభారత విద్యార్థి, యువజన ప్రదర్శనకు అవసరమైన సన్నాహాలు చేయటం, సూక్ష్మ ప్రణాళికను రూపొం దించటంలో సీతారాం ఏచూరి, సొహైల్ హష్మి కీలక పాత్ర నిర్వహించారు. ఢిల్లీలోని ప్రజాతంత్ర ఉద్యమ సహకారంతో దీనిని అమలుచేశారు.

స్టూడెంట్స్ స్ట్రగుల్‌లో పనిచేస్తున్న సమయంలోనే సంపాదకుడిగా, రచయితగా సీతారాంలోని అసాధారణ ప్రతిభ వెలికి వచ్చింది. అంతకు ముందుకాలంలో విద్యార్థులు చేసిన ఆందోళనలు, అప్పటి విద్యార్థి ఉద్యమానికి సంబంధించిన వార్తలు, వ్యాసాలు మాత్రమే ఎస్ఎఫ్ఐ పత్రికలో వచ్చేవి. వీటితో పాటు సైన్స్, చరిత్ర, సంస్కృతి, ఆటలు, సినిమాలు, అంతర్జాతీయ పరిణామాలు తదితరాలను అదనంగా ఇవ్వటం ద్వారా దానిని ఎక్కువ మంది ఆదరించే, విస్తృతంగా చదివే పత్రికగా మార్చాడు. ఇదే సందర్భంలో అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ కోసం క్యూబాకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత సిని దర్శకుడు థామస్ గుటిరెజ్ అలియా ఢిల్లీకి వచ్చిన సందర్భంగా సీతారాం ఏచూరి స్వయంగా ఆయనను ఇంటర్వ్యూ చేసిన విషయం నాకు గుర్తుకు వస్తున్నది. అదేవిధంగా ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన సాపేక్ష సిద్ధాంతానికి సంబంధించి రాజేంద్ర ప్రసాద్ రాసిన వ్యాసం కూడా స్టూడెంట్ స్ట్రగుల్‌లో ప్రచురించారు. క్లిష్టమైన శాస్త్రీయ అంశాన్ని తేలిక భాషలో సాధారణ విద్యార్థులకు అర్థమయ్యేలా ఆ వ్యాసం ఉన్నది.



సీతారాం ఏచూరి కమ్యూనిస్టు ప్రామాణాలను పాటించటం లో సరైన ఉదాహరణగా ఉండేవాడు. మానవ కార్యాచరణ జరిగే ప్రతిరంగం పైనా ఆయన ఆసక్తి చూయిస్తాడు. ఆయన సాహిత్యం, సినిమాలు, ఆటలు, సంగీతం, ఆహారాన్ని ఇష్టపడ తాడు. మేం విఠల్‌బాయ్ పటేల్ హౌస్ ఫ్లాట్లలో ఉండేటపుడు షటిల్ ఆడటం కోసం దగ్గరలో ఉన్న యూఎన్ఐ ప్రాంగణంలోని బ్యాడ్మింటన్ కోర్టుకు వెళ్ళేవాళ్ళం. ఏచూరి శిక్షణ పొందిన ఆటగాడు కావటంతో ఆయన కొట్టే కొన్ని షాట్లు ప్రత్యర్థి ఆటగాళ్ళను కలవరపాటుకు గురిచేసేవి.

పాల్ రాబ్సన్, బాబ్ మార్లే, హార్రి బెలాఫోంటే, బాలమురళి కృష్ణ, మహమ్మద్ రఫీ, లతా మంగేష్కర్, అమరుడైన చిలియన్ గాయకుడు విక్టర్ జారా తదితరుల గురించి గంటలకు గంటలు మాట్లాడేవాడు. హార్రి బెలాఫోంటే మరణించినపుడు ఆ అమెరికన్ ప్రజా కళాకారునికి నివాళులు అర్పించటం కోసం కామ్రేడ్ సీతారాం ఏచూరిని ఆహ్వానించారు. అక్కడ ఆయన చేసిన ప్రసంగం సంగీతంపై ఆయనకున్న విస్తృతమైన పరిజ్ఞానాన్ని వెల్లడించటంతో పాటు, సమాజంలో కళాకారులు నిర్వహించాల్సిన పాత్ర గురించి కూడా విశదీకరించింది.

> రెండు సంవత్సరాల క్రితం త్రివేండ్రంలోని ఇఎంఎస్ అకాడమీలో జరిగిన ఒక వర్క్‌షాపులో సీతారాం ఏచూరి చాలా ఆసక్తిగా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలలో బాలల సంఘాలలో పనిచేస్తున్న వారు, అటువంటి సంఘాలలో పనిచేయటం కోసం కేటాయించిన వారు ఆ వర్క్‌షాపుకు హాజరయ్యారు. వారిలో అప్పటికే బాల సంఘాలలో పనిచేస్తూ లేదా పనిచేయటం కోసం ఆసక్తి చూపుతున్న వారు ఎక్కువ మంది ఉన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవలసిన అవసరం గురించి ఏచూరి ప్రసంగించారు.

రెండు సంవత్సరాల క్రితం త్రివేండ్రంలోని ఇఎంఎస్ అకాడమీలో జరిగిన ఒక వర్క్‌షాపులో సీతారాం ఏచూరి చాలా ఆసక్తిగా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలలో బాలల సంఘాలలో పనిచేస్తున్న వారు, అటువంటి సంఘాలలో పనిచేయటం కోసం కేటాయించిన వారు ఆ వర్క్‌షాపుకు హాజరయ్యారు. వారిలో అప్పటికే బాల సంఘాలలో పనిచేస్తూ లేదా పనిచేయటం కోసం ఆసక్తి చూపుతున్న వారు ఎక్కువ మంది ఉన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవలసిన అవసరం గురించి ఏచూరి ప్రసంగించారు. యువతను లక్ష్యంగా పెట్టుకొని, చాలా సామాన్య భాషలో ఆయన మాట్లాడారు. గొప్ప వ్యక్తులను గుర్తు చేసుకోవటం అంటే మనకాలంలోని అవసరాలను తీర్చుకొనే విధంగా చర్చించటం సరైన పద్ధతి అని చెప్పారు. వారి తల్లిదండ్రుల సహకారంతో బాలికలను, బాలురను వారి వారి ప్రత్యేక ప్రజాతంత్ర సంఘాలలో చేర్చాల్సిన ప్రాధాన్యత గురించి చెప్పారు. ఈ విషయంలో విఫలమైతే విచ్ఛిన్న భావాలను పెంపొందిస్తున్న కుల, మత సంఘాల దయాదాక్షిణ్యాలకు వారిని వదిలేయటం అవుతుందని ఆయన హెచ్చరించారు.

ఈ అంశాలను పిల్లల నుంచి వృద్ధుల వరకు వివరించగల, కళా విమర్శ చేయటంతో పాటు కళలపై లోతైన పరిజ్ఞానం గల సీతారాం ఏచూరి బహుముఖ ప్రజ్ఞను వెల్లడిస్తున్నాయి. రాజకీయాలు, మార్క్సిస్టు దృక్పథంతో మిళితం చేయటానికి వచ్చే ఏ ఒక్క అవకాశాన్ని వదలకుండా అన్ని రంగాల గురించి ఆయన విస్తృతంగా ప్రసంగించేవాడు. ఆయన వారసత్వాన్ని కొనసాగించాల్సిన బాధ్యత ఇప్పుడు మనపై ఉంది.



వరద బాధితులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

టీజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ శ్రీరామ్ నాయక్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మున్నేరు, ఆకేరు వరదల్లో తీవ్రంగా నష్టపోయిన వరద బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి రామావత్ శ్రీరామ్ నాయక్ అన్నారు. మండలంలోని కస్నాతండా గ్రామంలో శుక్రవారం విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, వాటర్ బాటిల్స్ అందజేశారు. ఈ సందర్భంగా రామావత్ శ్రీరామ్ నాయక్ మాట్లాడారు. హైదరాబాద్‌లోని గ్రీన్ కో సంస్థ, వైరా పట్టణానికి చెందిన మార్పు స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఈ వస్తువులను వరద బాధితుల కుటుంబాలకు అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వరదల సమయంలో 12 మంది రక్షించిన ఏడుగురు యువకులను, గ్రామపంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించారు. ఖమ్మం జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ వరద బాధితులకు అండగా ఉన్న గిరిజన సంఘం నేతలకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ కిరణ్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్య వీరభద్రం, మార్పు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు గుడిమెట్ల రజిత, మోహన్‌రావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి భూక్య నాగేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు అజ్మీర రామ్మూర్తి, బాణోత్ కిషన్ నాయక్, భూక్య విజయ, భూక్య సైదమ్మ, సీపీఎం నాయకులు ఊరుబండి చంద్రయ్య, అవిరేణి గురవయ్య, నాగరాజు, మార్తి ఉపేందర్, శైలజ, వల్లాల రాంబాబు, రామ్మూర్తి, జగన్ తదితరులు పాల్గొన్నారు.



సామాన్య ప్రజలపై భారాలను ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-సత్తుపల్లి

సామాన్య ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతున్న భారాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, సామాన్య ప్రజలు జీవనం సాగించేలా వారి స్థితిగతుల మెరుగుదలకు ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి రావుల రాజబాబు కోరారు. శుక్రవారం స్థానిక పాతసెంటరు హమాలీ అడ్డా వద్ద జరిగిన హమాలీ-2 శాఖ మహాసభలో రాజబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నిత్యావసర ధరలను అదుపు చేయకపోగా వాటి పెరుగుదలకు ప్రభుత్వాలు ఊతం ఇస్తున్నాయని ఆరోపించారు. గత 10యేండ్లుగా తెలంగాణలో పేదల రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం అటకెక్కిందన్నారు. అర్హులైన వారందరికి తక్షణమే రేషన్ కార్డులు అందించి ప్రజలకు అవసరమయ్యే అన్ని రకాల నిత్యావసరాలను రేషన్ దుకాణాల ద్వారా అందించాలని రాజబాబు డిమాండ్ చేశారు. పట్టణ హమాలీ-2 శాఖ కార్యదర్శిగా గుదే రామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు, రాము, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, శివకుమార్, ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

హార్వెస్ట్ ఉపాధ్యాయునికి ఇన్స్పైరింగ్ టీచర్ అవార్డ్

నవతెలంగాణ- ఖమ్మం



హైదరాబాద్ సహెూదయ స్కూల్స్ కాంప్లెక్స్ వారు ప్రతిష్టాత్మకంగా ఎంపిక చేసే సెలబ్రీ టీచర్- 2024 "అథేనా అరిస్టియా ఇన్స్పైరింగ్ టీచర్ అవార్డ్"కు తమ విద్యాసంస్థలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు జి.ఉమామహేశ్వరరావు ఎంపిక కావడం జరిగిందని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి. రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతీ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ క్లస్టర్ పరిధిలో గల సిబిఎస్ఇ స్కూల్స్ వారు ఉమ్మడిగా ఏర్పాటైన హైదరాబాద్ సహెూదయ స్కూల్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో ప్రతీయేటా రాష్ట్రవ్యాప్తంగా సిబిఎస్ఇ స్కూల్స్‌లో పనిచేసే ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను సెలబ్రీ టీచర్లుగా ఎంపిక చేస్తారని వారు వివరించారు. 2024 విద్యాసంవత్సరానికిగానూ సిబిఎస్ఇ స్కూల్స్‌లో పనిచేస్తూ ఉత్తమ సేవలందిస్తూ, విద్యార్థులను వివిధ రంగాలలో ఉన్నతంగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. తమ విద్యాసంస్థలో ఐఐటి ఫౌండేషన్ ఇంచార్జీగా పనిచేస్తున్న గణిత శాస్త్ర ఉపాధ్యాయులు గంజి. ఉమామహేశ్వరరావు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. గురువారం హైదరాబాద్లో జరిగిన అవార్డ్ ఫంక్షన్ వేడుకలో ప్రశంసాపత్రాన్ని స్వీకరించడం జరిగిందన్నారు. శుక్రవారం హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతీరెడ్డి అవార్డు ఎంపికైన ఉమామహేశ్వరరావును అభినందించి, శాలువాతో సత్కరించి, భవిష్యత్లో మరింతగా విద్యార్థుల బంగారు భవిష్యత్కు తోడ్పడాలని అభిలాషించారు.

ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజమే

నవతెలంగాణ-వైరాటౌన్

ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో బదిలీలు సహజమని, కానీ వారు పనిచేసిన కాలాన్ని ప్రతి ఒక్కరు గుర్తు చేసుకునేటట్లు పనిచేయడమే నిజమైన ఉద్యోగి కర్తవ్యం అని, వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎల్.నవీన్ జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తు బదిలీలపై ఇతర కళాశాలకు వెళ్ళిన టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బందికి కళాశాలలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన టీచింగ్, నాన్- టీచింగ్ సిబ్బందికి జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బదిలీపై వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విచ్చేసిన నూతన ప్రిన్సిపల్ ఎల్.నవీన్ జ్యోతి, టీచింగ్, నాన్- టీచింగ్ సిబ్బందికి పూల మొక్కలతో ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టి... చెట్టెక్కిన కారు

ఇంజన్ భాగాలు ఊడి చెల్లాచెదురు

ఒకరికి తీవ్రగాయాలు, మరో ముగ్గురికి స్వల్పగాయాలు

నవతెలంగాణ-సత్తుపల్లి



మద్యం మత్తు కళ్లకెక్కింది.. స్టీరింగ్ చేతిలో ఉంది.. ఎక్సలేటర్‌ని అడుగంటా తొక్కగానే ఆ కారు ఎటు వెళ్తుందో తెలియని మత్తులో ఉన్న ఆ నలుగురు యువకుల్లో స్టీరింగ్ ఎవరి చేతుల్లో ఉందోకాని అంతే వేగంతో డివైడర్‌ను ఢీకొట్టిన ఆ కారు 30 అడుగుల దూరంలో చెట్ల కొమ్మల మధ్య ఇరుక్కుపోయింది. కారునుంచి ఇంజిన్ భాగాలు ఊడి చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ఘటన సత్తుపల్లి మండలం గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ సమీపంలోని రాష్ట్రీయ రహదారిపై గురువారం రాత్రి 12గంటల సమయంలో అశ్వారావుపేట వైపు నుంచి వస్తున్న కారు వేగంగా డివైడర్‌ను ఢీకొట్టగానే అందులో ఉన్న నలుగురిలో కాలసాని శ్రీను అనే యువకుడు రోడ్డును బలంగా ఢీకొట్టి కింద పడిపోయాడు. మిగతా బెజవాడ చెన్నకేశవ, దేవేందర్‌సాయి, మాణిక్యాల వెంకటకృష్ణ చెట్లమధ్యన ఇరుక్కున కారునుంచి బయటకు వచ్చారు. రోడ్డుపై బలంగా పడ్డ యువకుడు శ్రీను పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించినట్లు తెలుస్తోంది. అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

దేశ ప్రజల దృష్టిని మళ్లించడానికే జమిలి ఎన్నికలు

- ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ఎర్రజెండా బాట పట్టాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీకాంత్

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్





కేంద్రంలో వున్న బిజెపి ప్రభుత్వం "ఒకే దేశం-ఒకే ఎన్నిక" విధానానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడంపై సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్‌లు మండిపడ్డారు. ఈ నిర్ణయం దేశ సమాఖ్య వ్యవస్థను బలహీనపరుస్తుందని తెలిపారు. శుక్రవారం స్థానిక ఖమ్మం నగరంలోని 29వ డివిజన్‌లో లక్ష్మినారాయణ అధ్యతన జరిగిన పార్టీ శాఖా మహాసభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించాలని తీసుకున్న నిర్ణయం వెనుక రహస్య ఎజెండా వున్నదని విమర్శించారు. సమాఖ్య వ్యవస్థను తటస్థం చేసేందుకు కేంద్రానికి విశేష అధికారాలు కట్టబెట్టేందుకు రహస్య ఎజెండాను రూపొందించారని తెలిపారు. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య వైవిధ్యాన్ని నాశనం చేసేందుకే ఒకే ఎన్నిక నినాదాన్ని అందిపుచ్చుకున్నారని వారు తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రతి ఒక్కరూ ఎర్రజెండా బాటలో నడవాలని పిలుపునిచ్చారు. పార్టీ శాఖా మహాసభలు జరుగుతున్న తరుణంలో పార్టీని కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళి విస్తతపర్చాలన్నారు. వర్గ పోరాటాల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా సమాయత్తం కావాలన్నారు. తొలుత మహాసభల సందర్భంగా పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళులర్పించి ఎర్ర జెండాను ఎగురవేశారు. స్థానిక 3 టౌన్‌లో ఆదిలక్ష్మీ కోల్డ్ స్టోరేజిలో 29వ డివిజన్ మిర్చి ఎగుమతి, కోల్డ్ స్టోరేజ్ శాఖల మహాసభలు జరిగాయి. సిపిఎం మహాసభలు ప్రతి 3 సం.లకు ఒకసారి జరుగుతాయని, ఈ మహాసభలు గ్రామం, వార్డు స్థాయినుంచి మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరుగుతాయని, గత 3 సం.లుగా పార్టీ చేసిన కార్యక్రమాలు, నిర్మాణం సమీక్షించుకొని భవిష్యత్‌లో మరింత ముందుకు పోవడం కోసం అనేక చర్చలు ఈ మహాసభల్లో జరుగుతాయని, భవిష్యత్‌లో పార్టీ బలోపేతం కోసం చర్చలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ మహాసభల్లో నూతన శాఖా కార్యదర్శులుగా 29వ డివిజన్ శాఖా కార్యదర్శిగా నూకల నాగేశ్వరరావు, మిర్చి ఎగుమతి శాఖ కార్యదర్శిగా హెచ్చు బుజ్జి, కోల్డ్ స్టోరేజి శాఖా కార్యదర్శి మీనల మల్లిఖార్జున్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ మహాసభలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, పార్టీ 3 టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బండారు యాకయ్య, మండల కమిటీ సభ్యులు శీలం వీరబాబు, నూకల నాగేశ్వరరావు, పి.స్వామి, నలమాసు వీరస్వామి, కుర్రా రవి హాజరయ్యారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు

తిరుమలాయపాలెం : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ రూపకల్పన చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు కొలిచలం స్వామి అధ్యక్షతన పార్టీ తిరుమలాయపాలెం గ్రామ శాఖ మహాసభ జరిగింది. ఈ శాఖ మహాసభకు నున్నా నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా వామపక్షాలకు ఆదరణ లభిస్తుందన్నారు. దేశంలో మతోన్మాద రాజకీయాలు పెరుగుతున్నాయని, వాటికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు వస్తున్నాయని ఆయన అన్నారు. రానున్న ఐదు రాష్ట్రాలు ఎన్నికల్లో బిజెపి ఓటమి తప్పదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హామీల అమలు చేయడంలో వైఫల్యం కనబడుతుందని ఆయన అన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ స్థానికంగా ప్రజా ఉద్యమాలు చేయడం ద్వారానే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. ఆ దిశగా కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ స్థానిక సమస్యలు తీసుకొని పోరాటం చేయాలని, తిరుమలాయపాలెం గ్రామంలో పోరాటాలు చేశామని, భవిష్యత్తులో కూడా చేయాలని ఆయన అన్నారు. మహాసభల ప్రారంభ సూచకంగా పార్టీ జెండాని సీనియర్ నాయకురాలు విప్పుల పుష్పవతి ఆవిష్కరించారు. గ్రామ నూతన శాఖ కార్యదర్శిగా నెరుసుల వెంకటేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ శాఖ మహాసభలో సిపిఎం నాయకురాలు దొండేటి సుగుణమ్మ, వేగినాటి వెంకట్రావు పాల్గొని ప్రసంగించారు. ఈ మహాసభలో గ్రామ నాయకులు ఎస్ వెంకటేశ్వర్లు, కొమ్ము వెంకన్న, ముత్తయ్య, మదిలేని శ్రీనివాస్, మదిలేని వెంకటేశ్వర్లు, కొమ్ము నాగేశ్వరరావు, బచ్చలకూర రాములు, నెమలిమరి ఉప్పలయ్య, కొమ్ము వీరస్వామి, చీమ నగేష్, కొమ్ము రాంబాబు, కొమ్ము నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఎదుట కార్మికుల ధర్నా

నవతెలంగాణ- ఖమ్మం




ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు చెల్లించాలని కోరుతూ కార్మికులు శుక్రవారం ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటియు జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్దన్, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి జి.రామయ్య మాట్లాడుతూ ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన అసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు గత రెండు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, వైద్య విధాన పరిషత్తు నుండి డియంఈ పరిధిలోకి జిల్లా ఆస్పత్రి మారడంతో కార్మికుల జీతాలు టెక్నికల్ కారణాలు చూపిస్తూ జీతాలు సకాలంలో చెల్లించకపోవడం జరుగుతుందన్నారు. కార్మికులకు సకాలంలో జీతం లేకపోవడం ఫలితంగా వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇంటి అద్దెలు చెల్లించలేక ఇంటి యజమానులు కార్మికుల్ని ఖాళీ చేయమని తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలతో కార్మికుల కుటుంబాలు గడవడం తీవ్ర ఇబ్బందులుగా ఉందని, సెలవులు పెట్టుకొని రోజువారి కూలి పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని, జీతాలు ఇవ్వండని కాంట్రాక్టర్‌ని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జీతాలు ఇవ్వని కాంట్రాక్టర్‌పై చర్యలు వెంటనే తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయమ్మ, వెంకటరమణ, అంబేద్కర్, ఉపేందర్, రాములమ్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.

సైనిక పాలనలో జమ్మూకాశ్మీర్ వెళ్లిన ఏకైక నాయకుడు ఏచూరి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ - బోనకల్



జమ్మూకాశ్మీర్‌లో కేంద్ర ప్రభుత్వం సైనిక పరిపాలన పెట్టిన తర్వాత ఆ రాష్ట్రానికి ఆ సమయంలో వెళ్లన ఏకైక దేశ నాయకుడు సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని రామాపురం గ్రామంలో సిపిఎం రామాపురం గ్రామ శాఖ మహాసభ సీతారాం ఏచూరి నగర్‌లో గుడిపుడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. తొలుత మహాసభ ప్రారంభ సూచికంగా సిపిఎం పతాకాన్ని సీనియర్ నాయకులు గుడిపూడి నాగేశ్వరరావు ఎగురవేశారు. అనంతరం సీతారాం ఏచూరి తదితర సిపిఎం అమరవీరులకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన మహాసభలో పొన్నం వెంకటేశ్వరరావు, నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆనాడు రామాపురంలో కొత్తగా కాలనీ తీసుకువచ్చిన ఘనత సిపిఎందేనని అన్నారు. రామాపురం గ్రామానికి విద్యుత్, రహదారి సౌకర్యం కూడా సిపిఎం ప్రజాప్రతినిధుల హయాంలోనే ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కెసిఆర్ అహంకారం, నియంతృత్వ పరిపాలన, ప్రతిపక్షాలపై అణచివేత తదితర అంశాలపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావటం వల్లే కాంగ్రెస్ గెలిచిందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను మాత్రం అమలు చేయకుండా మరల రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. అనంతరం సిపిఎం రామాపురం నూతన శాఖ కార్యదర్శిగా కొమ్మినేని నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ మహాసభలో సిపిఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు బంధం శ్రీనివాసరావు, కందికొండ శ్రీనివాసరావు, కిలారు సురేష్, బూర్గుల అప్పాచారి, పెద్దపోలు కోటేశ్వరరావు, గుడిపుడి వెంకటేశ్వర్లు, కొండ నాగేశ్వరరావు, ఎడ్లపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహపూరితంగా సీపీఐ(ఎం) గోవిందాపురం ఎల్ గ్రామశాఖ మహాసభలు

మండల పరిధిలోని సీపీఐ(ఎం) గోవిందపురం ఎల్ గ్రామ శాఖ మహాసభలు ఉత్సాహపూరితంగా సాగాయి. ఈ మహాసభలలో యువకుల ప్రధాన ఆకర్షణగా నిలిచారు. యువకులు పెద్ద ఎత్తున ఉత్సాహంతో మహాసభల విజయవంతం కోసం విశేషంగా కృషి చేయడంతో పాటు మహాసభల ఉత్సాహపూరితంగా జరగటానికి కృషి చేశారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల పురిటిగడ్డగా పేరుగాంచిన గోవిందాపురం ఎల్ గ్రామం సిపిఎం శాఖ మహాసభలు నిర్వహణలో పోరాట పటిమ కనిపించింది. మహాసభలు నూతన యువ రక్తానికి అవకాశం కల్పించింది. నూతన శాఖ కార్యదర్శిలను మహాసభలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. సిపిఎం గోవిందాపురం ఎల్ గ్రామశాఖ ఒకటో కార్యదర్శిగా తమ్మారపు లక్ష్మణ్, రెండవ శాఖ కార్యదర్శిగా పొన్నం రాంబాబు, మూడో శాఖ కార్యదర్శిగా కోట కాటయ్య, మహిళా శాఖ కార్యదర్శిగా నల్లమోతు వాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వరద బాధితులకు సహాయం అందించడం అభినందనీయం

ఇన్స్‌పెక్టర్ ఎం.రాజు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



వరద బాధితులకు సహాయం అందించడం అభినందనీయమని సీఐ ఎం.రాజు అన్నారు. కల్లూరు పట్టణానికి చెందిన లంకా అప్పలనాయుడు సత్యావతి దంపతులు తమ కుమారుడు అన్వేష్ పుట్టిన రోజు సందర్భంగా ఖమ్మంరూరల్ మండలం జలగంనగర్‌లోని వరద బాధితులకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్స్పెక్టర్ రాజు మాట్లాడారు.. ప్రకృతి విలయం సృష్టించడంతో అనేక మంది నిరాశ్రయులయ్యారని, సర్వం కోల్పోయి బాధలో ఉన్నప్పుడు మానవతాదృక్పథంలో అప్పలనాయుడు కుటుంబం ఆదుకునేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు పరిశ పుల్లయ్య, సముద్రాల పుల్లారావు, మిట్టకోలు లక్ష్మీనారాయణ, జర్నలిస్టులు ఏనుగు వెంకటేశ్వరరావు, అశోక్, గంటల ప్రేమ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

2వేల వేమన పద్య పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-సత్తుపల్లి

స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ముద్రించిన 2వేల వేమన పద్య పుస్తకాల ప్రతులను సత్తుపల్లి మండలంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లోని విద్యార్థులకు ఆయా స్వచ్ఛంద సంస్థల బాధ్యులు శుక్రవారం పంపిణీ చేశారు. ఆశా స్వచ్ఛంద సంస్థ, గార్లపాటి పాపాచలం, బొల్లేపల్లి సత్యనారాయణరాజు స్మారక ట్రస్ట్ సౌజన్యంతో ప్రచురించిన వేమన శతక పద్య పుస్తకాలను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ చేతుల మీదుగా ఇటీవల ఆవిష్కరణ జరిగిన విషయం విదితమే. ఇదే క్రమంలో ఆయా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ముద్రించిన ఆయా శతక పద్య పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ఆశా డైరెక్టర్ రామిశెట్టి శ్రీనివాసరావు, గార్లపాటి పాపాచలం, బొల్లేపల్లి సత్యనారాయణరాజు స్మారక ట్రస్టుల నిర్వాహకులు గార్లపాటి రామకృష్ణ, బొల్లేపల్లి మధుసూదనరాజు పాల్గొన్నారు. వేమన శతకంలోని 100 పద్యాలను విద్యార్థులతో చదివించడం ద్వారా, రాయించడం నేర్పించాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు.

మిషన్ భగీరథ పైపు లైన్ క్లియర్

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మండలం వల్లాపురం గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలు వచ్చినప్పుడు మిషన్ భగీరథ పైపు లైన్ వాగు వరదల్లో కొట్టుకుని పోవడం జరిగింది. శుక్రవారం వరదల్లో కొట్టుకుపోయిన పైపులైనును బాగు చేశారు. అనంతరం బ్రిడ్జి కాలాల్లో ఇరుక్కున్న తాటి మొద్దులు, చెత్తాచెదారం తొలగించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు బాజోజు రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉద్యోగ బదిలీలు సహజం : ఎస్ఐ

నవతెలంగాణ - బోనకల్

ప్రతి ఉద్యోగికి బదిలీ సహజమని కానీ విధులను సమర్థవంతంగా నిర్వహించడమే ప్రధానమని ఎస్సై కడగండ్ల మధుబాబు అన్నారు. బోనకల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఇసంపల్లి సువర్ణ బాబు ఇటీవల వీఎ బంజర పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో సువర్ణ బాబుకి ఎస్సై కడగండ్ల మధుబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సువర్ణ బాబుకి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీస్ శాఖలో బదిలీలు తరచూ జరుగుతూనే ఉంటాయని కానీ ఉద్యోగ విధులు ఎలా నిర్వహించామనేదే ప్రధానమన్నారు. సువర్ణబాబు బోనకల్ పోలీస్ స్టేషన్‌లో విధులు సమర్థవంతంగా నిర్వహించారని అభినందించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అద్దంకి ఆనంద్‌కుమార్, కానిస్టేబుళ్ళు రమేష్, నరసింహారావు, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓవర్సీస్ విద్యానిధి ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఖమ్మం

2024-25 విద్యా సంవత్సరానికి గాను మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యా నిధి పథకం క్రింద ఉపకార వేతనాలకు అక్టోబర్ 15 వరకు దరఖాస్తు చేసుకొనుటకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సాగర్ జలాలు విడుదల చేసి పంటలను కాపాడాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సభ్యులు బండి రమేష్

నవతెలంగాణ-ముదిగొండ



నాగార్జున సాగర్ జలాలు విడుదల చేసి రైతుల పంటలను కాపాడాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. సిపిఐ(ఎం) గ్రామ మహాసభల్లో భాగంగా మండల పరిధిలోని పమ్మి గ్రామంలో పార్టీ నాయకులు కొండమీది రఘుపతి అధ్యక్షతన శుక్రవారం శాఖ మహాసభ జరిగింది. ఈ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సాగర్ కాలువలను వెంటనే మరమ్మతులు చేసి పంటలకు సాగునీరు అందించాలన్నారు. ఈ జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న వరదలకు గండిపడిన కాలువలను మరమ్మతులు చేయలేకపోతున్నారన్నారు. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్న పట్టించుకోకుండా పాలకులు విదేశీ పర్యటన చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం మాట్లాడుతూ గ్రామాలలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు.అనంతరం సిపిఐ (ఎం) గ్రామ నూతన శాఖ కార్యదర్శిగా ఎస్కే నాగుల్ మీరాను ఎన్నుకున్నారు. తొలత సిపిఐ(ఎం) మహాసభలో పార్టీ సీనియర్ నాయకులు రాధారపు బాబు ఎర్రజెండాను ఎగరవేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల నాయకులు మందరపు వెంకన్న, టీఎస్ కళ్యాణ్, రాయల శ్రీనివాసరావు, గ్రామశాఖ సభ్యులు చావా శ్రీనివాసరావు, చిలుకూరి ఉపేందర్, నకిరికంటి నరసింహారావు, చిలుకూరి సుబ్బయ్య, చిలుకూరి స్వామి, మహేశ్వరపు పుల్లయ్య, బుగ్గవీటి నాగేశ్వరరావు, కందుల మల్లయ్య ఇనప పిచ్చయ్య, రాయబారపు యేసు, వంగూరి భాస్కర్, నారపొంగు ఉపేందర్, నాదెండ్ల ఉపేందర్, రాయబారపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరుకు సిద్ధంకండి

నేలకొండపల్లి : ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం పోరుకు సిద్ధం కావాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని అనాసాగరం గ్రామంలో పార్టీ గ్రామ శాఖ మహాసభ ఎడ్ల తిరుపతిరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపాల వద్ద వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థూపాల వద్ద ఏర్పాటు చేసిన పార్టీ జెండాను పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి వెంకటనరసయ్య ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మరణించిన పార్టీ జాతీయ కార్యదర్శి మాజీ రాజ్యసభ సభ్యులు సీతారాం ఏచూరి సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బండి రమేష్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వేలాది ఎకరాలలో రైతులు సాగుచేసిన వరి, పత్తి, మిర్చి, చెరుకు వంటి పంటలతో పాటు ఇల్లు నీటి మునిగి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పంటలు దెబ్బతిని 20 రోజులు గడిచిన ప్రభుత్వ నేటికీ నష్టపరిహారం అందించకపోవడంతో రైతులు బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రుణమాఫీ పథకాన్ని సంపూర్ణంగా అమలు చేయకపోవడంతో రుణమాఫీ రాని రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతు రుణమాఫీలో ఎటువంటి షరతులు లేకుండా 2 లక్షల రుణమాఫీని నేరుగా రైతుల ఖాతాలో జమ చేసి ఆదుకోవాలని, సాగర్ జలాలను తక్షణమే విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ ఒకటవ గ్రామ శాఖ కార్యదర్శిగా నున్న మధుసూదన్ రావు, రెండవ గ్రామ శాఖ కార్యదర్శిగా బొడ్డు మధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.వి రామిరెడ్డి, నాయకులు ఏటుకూరి రామారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, మారుతి కొండలరావు, మందడపు మురళీకృష్ణ, దండ సూర్యనారాయణ, పాపినేని వెంకటేశ్వర్లు(బాబు), బొడ్డు నారాయణ, గడిపూడి వెంకటేశ్వర్లు, బొడ్డు బాబురావు, నున్న రంగారావు, కర్రీ నరసింహారావు, బొడ్డు రాము, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలు వెంటనే విడుదల చేయాలి

- ఎండిన వరిపొలాల్లో బీఆర్ఎస్ నిరసన

నవతెలంగాణ-చింతకాని



మరో నాలుగు రోజులు సాగర్ జలాలు రాకపోతే వరి పొలాలు పొట్టకొచ్చి ఉండటంతో పూర్తిగా ఎండిపోయి రైతులకు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని సాగర్ జలాలు వెంటనే విడుదల చేయాలని రైతులు, బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గత 22 రోజులుగా సాగర్ జలాలు రాకపోవడంతో చింతకాని మండలవ్యాప్తంగా వరిపొలాలు ఎండుపోతున్న నేపథ్యంలో శుక్రవారం నాగిలిగొండ వరి పొలాల్లో రైతులు, బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పెంట్యాల పుల్లయ్య మాట్లాడుతూ సాగర్ జలాలు విడుదల చేయకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందన్నారు. అనంతరం చింతకాని తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని కార్యలయం ఎదుట ఆందోళన నిర్వహించి వెంటనే సాగర్ జలాలు విడుదల చేయాలని తహసీల్దార్ అనంతరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు, మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమతంరావు, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ సభ్యులు మంకెన రమేష్, నాయకులు వేముల నర్సయ్య, యువజన నాయకులు పిన్నెల్లి శ్రీను, గడ్డం శ్రీను, పర్చగాని ఏడుకొండలు, రైతులు ఆదిరెడ్డి, సీతారెడ్డి, వల్లపు అంకాలు, బత్తుల వెంకటేశ్వర్లు, రాయల బాబు, ఓర్సు వెంకటేశ్వర్లు, రాయల పూర్ణారావు, సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

నవతెలంగాణ-కల్లూరు

ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ఆసర చేసుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎండిఓ దాసరి చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం ఉషోదయ మండలం మహిళా సమైక్య నందు స్త్రీ శక్తి భవన్ 19వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి దాసరి చంద్రశేఖర్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు స్వచ్ఛత సేవాహి, మహిళా శక్తి కార్యక్రమాలను వివరించారు. అందులో భాగంగా స్వయం సహాయక సంఘాలు, గ్రామ సమాఖ్యలు, మహిళలు సుస్థిరాభివృద్ధి సాధించేందుకు బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, సిఐఎఫ్ రుణాలను పొంది సకాలంలో చెల్లించి అభివృద్ధి చెందాలని కోరారు. ఈ సమావేశంలో ఉషోదయ మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జీ.నిర్మల పాలకవర్గం కమిటీ సభ్యులు ఏపీఎం. వెంకట్రామారావు, సీసీలు టీ.రాజ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు, శ్యామలదేవి, వెంకట్రావమ్మ ఎస్తేరు ఫాతిమా, అపర్ణ, లక్ష్మి గ్రామ సమాఖ్య కమిటీ సభ్యులు తదితరులు

మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్లూరు

స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్, మార్కెట్ కమిటీ చైర్మెన్ భాగం నీరజాదేవితో కలిసి పరిశీలించారు. కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేసి గోడౌన్ పరిశీలించారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో త్వరలో నిర్మించబోయే విశ్రాంతి భవనం మ్యాప్‌ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగం ప్రభాకర్ చౌదరి, ఆలకుంట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నయాబజార్ కాలేజీని అన్ని విధాలుగా ఆదుకుంటాం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

నయాబజార్ ఉన్నత కల పాఠశాల కళాశాలలను జిల్లాకే ఆదర్శంగా తీర్చిదిద్దామని తుమ్మల యువసేన నాయకుడు తుమ్మల యుగేందర్ అన్నారు. ఇటీవల వరదల మూలంగా కళాశాలకు జరిగిన నష్టాన్ని చూచి ఆయన చలించి పోయారు. శుక్రవారం కళాశాలలో కంప్యూటర్లు, ప్రింటింగ్ మిషన్, పిల్లలకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని, ఈ కళాశాలలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ సంక్షేమ హాస్టల్‌లో ఉంటున్న 250 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించారు. కళాశాల ప్రిన్సిపల్ కేఎస్.రామారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు శీలం సతీష్, రఫీదా, ముస్తఫా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొంగలు తిరుగుతున్నారు జాగ్రత్త : ఎస్సై

నవతెలంగాణ-కల్లూరు

మండల ప్రజలకు పోలీసువారి ఆకతాయిలు, ద్విచక్ర వాహనంపై వచ్చి బంగారు గొలుసులను దొంగలించే ముఠా వచ్చిందన్న సమాచారం మేరకు ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై ఎస్‌కే.షాకీర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరైనా అనుమానంగా కనిపించిన, మీకు అపరిచితులు అని అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు తెలపాలని తెలిపారు.

వరంగల్ యుద్ధభేరిని విజయవంతం చేయండి

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

వరంగల్ యుద్ధబేరిని విజయవంతం చేయాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామళ్ళ సత్యనారాయణ పిలుపునిచ్చారు. నవంబర్ 22న హన్మకొండలో తలపెట్టిన విద్యార్థి యుద్ధభేరి పోస్టర్‌ను ఖమ్మం జిల్లా నయాబజార్ కాలేజీ ఆవరణలో శుక్రవారం విద్యార్థుల సంక్షంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టి, బిసి, మైనార్టీ సంక్షేమ, గురుకుల హాస్టల్లో మెస్ చార్జీలు మూడింతలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-పెనుబల్లి



మహిళా సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షులుగా మాదాసు నాగేశ్వరి, కార్యదర్శిగా మిట్టపల్లి నాగమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నల్లబోతుల భారతి, గోళ్ళ పద్మప్రియ, సహాయ కార్యదర్శిగా మరి రజిని, రాజిని విజయ, కోశాధికారిగా తడికమల్ల సునీత, సభ్యులుగా పిట్టల సునీత, సింగిచాల సుజాత, గరిడేపల్లి లక్ష్మీ, చిలకా రమణమ్మ, పామర్తి వసుంధర, ఏతి తిరుపతమ్మ ఎట్టి శకుంతల, కుర్రం కృష్ణవేణిలు ఎన్నికయ్యారు.

ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి జాజిరి శ్రీనివాస్
- నూతన శాఖ కార్యదర్శిగా కాకాని శ్రీనివాసరావు

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, తెలంగాణ రాష్ట్రంలో రైతులందరికి రుణ మాఫీచేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) బేతుపల్లి శాఖ మహాసభ శుక్రవారం పార్టీ సినీయర్ నాయకురాలు పోలాసి భాగ్యమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు, ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలన్నారు. ఈ మహాసభలో బేతుపల్లి నూతన శాఖ కార్యదర్శిగా కాకాని శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు ఐనంపూడి సనందన్‌రావు, గుంజి కొండా, వెంకటలక్ష్మి, నాగరాజు, రమాదేవి, లక్ష్మి, రాజ్‌కుమార్, రఘు, గుంజి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతులకు శాపంగా గేట్లకు వెల్డింగ్ వ్యవహారం

21 రోజులుగా నీళ్లు లేక ఎండుతున్న పంట పొలాలు

- అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమంటున్న రైతాంగం..!
- ఎస్కేప్, జలాశయం గేట్లకు వెల్డింగ్..?

నవతెలంగాణ-కూసుమంచి



ప్రకృతి వైపరిత్యానికి తోడు అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల రైతులకు శాపంగా మారింది. పాలేరు జలాశయానికి వచ్చిన బారి వరదలకు తోడు.. సాగర్ కాలువకు ఉన్న ఎస్కేప్‌కు, పాలేరు జలాశయం అలుగు ప్రాంతంలో ఉన్న గేట్లకు అధికారులు వెల్డింగ్ పెట్టిన తీరుతో, రైతుల పాలిట శాపంగా మారి ప్రజల కష్టాలకు కారణమైంది. ఈ నెల 1న నాగార్జునసాగర్ ఎడమ (రంగుల బ్రిడ్జి దగ్గర) కాలువకు భారీ గండి పడింది. అలాగే పాలేరు జలాశయం అలుగు ప్రాంతంలో ఉన్న గేట్ల(అవుట్ ఫాల్ గేట్లు) పైనుండి వరద పోయడంతో పాలేరు ఏటి పక్కన పొలాలు మొత్తం ఇసుక మేటలు పెట్టిన విషయం తెలిసిందే. అలానే నిండు రెండు ప్రాణాలను బలిగొన్న విషయం కూడా తెలిసిందే.



ఎస్కేప్ గేట్లకు, పాలేరు జలాశయం గేట్లకు వెల్డింగ్ పెట్టిన అధికారులు..?

నాగార్జునసాగర్ ఎడమ కాలువ రంగులు బ్రిడ్జి వద్ద ఉన్న ఎస్కేప్ (అత్యవసర పరిస్థితులలో నీటి ప్రవాహాన్ని మళ్ళించడం కోసం) ఏర్పాటు చేసిన ఎస్కేప్, పాలేరు జలాశయం అలుగు ప్రాంతంలో ఉన్న గేట్లకు గత వేసవికాలంలో ఎన్ఎస్పి అధికారులు, వెల్డింగులు పెట్టించారని, దీంతో వరద ప్రహారం పెరిగి కాలువ కట్టలు తెగటానికి కారణం అయ్యాయని రైతులు ఆరోపిస్తున్నారు. మళ్లీ వర్షాకాలం ప్రారంభమై.. వర్షాలు వృద్ధిగా పడుతున్న క్రమంలో కూడా ఆ గేట్లకు వెల్డింగును తొలగించలేదని, దీంతో సాగర్ నుంచి వచ్చే ప్రవాహం, పాలేరు ఏటికీ సూర్యాపేట జిల్లా నుండి వచ్చే వరద క్రమేపి భారీ స్థాయిలో పాలేరు జలాశయానికి భారీ స్థాయిలో వరద వచ్చి చేరింది. ఈ క్రమంలో నాగార్జునసాగర్ నుండి వచ్చే నీటి ప్రవాహానికి జలాశయానికి వచ్చే వరదకు నీరు పోటు ఎత్తడంతో రంగుల బ్రిడ్జి వద్ద ఉన్న ప్రధాన కాలువకు గండిపడి భారీ నష్టం జరిగింది. దీంతో చుట్టుపక్కల పొలాలు, అలాగే జలాశయం చుట్టు ఉన్న గ్రామాలలో ఇండ్లలోకి నీరు చేరి బారినష్టం జరిగింది. రైతన్నల నష్టానికి ప్రజల కష్టానికి ఎన్ఎస్పి అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణమని రైతాంగం ఆరోపిస్తుంది.

పాలేరు జలాశయానికి ఆటోమేటిక్ గేట్లు...

జలాశయానికి ఉన్న గేట్లు వరద ప్రవాహం పెరిగే కొద్దీ ఆటోమేటిగ్గా ఒక్కొక్క గేటుగా పడిపోతూ... వరద తగ్గిన తర్వాత ఆటోమేటిక్గా మళ్లీ గేట్లు యధా స్థాయిలో వచ్చి చేరే పరిస్థితి ఉంది. కానీ అధికారులు వెల్డింగ్ పెట్టడం వల్ల గేట్లు తెరుచుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

సెప్టెంబర్ 1న సాగర్ ప్రధాన కాలువకు గండి... పాలేరు జలాశయం పెద్ద కాలువ చిన్న కాలువకు గండ్లు. భారీ వర్షాల వల్ల వచ్చిన వరదలకు నాగార్జున ఎడమ కాలువ రంగుల బ్రిడ్జి వద్ద సెప్టెంబర్ 1న భారీ గండి పడింది. అదేరోజు పాలేరు జలాశయానికి ఉన్న చిన్న కాలువ, పెద్ద కాలువ కు కూడా గండ్లు పడ్డాయి. దీంతో గండిపడిన ప్రాంతంలో ఉన్న చుట్టుపక్కల పొలాలు మొత్తం కొట్టుకుపోయాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. కాలువలకు పడిన గండ్లు పడటంతో జిల్లావ్యాప్తంగా నాగార్జునసాగర్ నీటిపై ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్న రైతులందరికీ తీవ్ర నష్టం జరుగుతుంది.

21 రోజులుగా నీళ్లు లేక ఎండుతున్న పొలాలు...!

ఈనెల 1న సాగర్ కాలువ కాల్వకు గండిపడి 21రోజులు పూర్తి అయ్యింది. ఇంత వరకు ప్రభుత్వం కాలువలకు పడిన గండ్లను పుడ్చంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, 21 రోజులు అయినా కూడా కాల్వ గండ్లను పూడ్చక పోవడంతో నాగార్జున సాగర్ నుండి నీళ్ళు విడుదల కాలేదు. దీంతో నీళ్ల రాకపోవడంతో నిలువునా రైతుల పొలాలు ఎండిపోతున్నాయి.

అధికారుల నిర్లక్ష్యం వల్లనే రైతులకు, ప్రజలకు తీవ్ర నష్టం : యడవల్లి రమణారెడ్డి (సీపీఐ(ఎం) మండల కార్యదర్శి)



ఎన్ఎస్పి అధికారులు వేసవి కాలంలో సాగర్ ఎడమ కాలువ ఎస్కేప్‌కు, పాలేరు జలాశయం అలుగు ప్రాంతంలో ఉన్న గేట్లకు వెల్డింగ్‌ల పెట్టడం వల్ల భారీగా వచ్చిన వరద నీరు కిందికి పోకుండా జలాశయంలోనే ఉండి నీరు పోటు ఎత్తటంతో జలాశయం చుట్టూ ఉన్న ఇండ్లలోకి నీళ్ల చేరి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే కాలువ కట్టలు తెగటం వల్ల 21 రోజులుగా నీళ్ల లేక రైతన్నల పంటలు ఎండిపోతున్నాయి. దీనికి ఎన్ఎస్పి అధికారుల నిర్లక్ష్యమే కారణం.

ప్రభుత్వ వైఫల్యం స్పష్టం : తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు తోటకూరి రాజు



సాగర్ ఎడమ కాలువ రంగుల బ్రిడ్జి వద్ద, పెద్ద కాలువకు గండ్లు పడి 21 రోజులు అయినా రాష్ట్ర ప్రభుత్వం మరమత్తు పనులు మాత్రం నత్తనడకన నడుస్తున్నాయి. ఇంతవరకు సాగర్ ప్రధాన కాలువకు పడిన గండిని పొడుచ్చలేదు. పాలేరు జలాశయం పెద్ద కాలువ పూర్తి కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం అధికారులు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, 21 రోజులుగా పంటలకు నీళ్ల లేక పొలాలు మొత్తం ఎండిపోతున్నాయి. పాలేరు జలాశయం చిన్న కాలువ గండి ఈనెల 19 నా పూర్తి చేశారు.

వరదలు వచ్చేటప్పుడు గేట్లకు వెల్డింగులు లేవు : ఎన్ఎస్పీ డీఈ మధు

పాలేరు జలాశయానికి ఎన్నడూ లేని విధంగా భారీ ఎత్తున నీటి ప్రవాహ ఎక్కువ వచ్చింది. జలాశయం నీటిమట్టం 23 అడుగులు కాగా, సెప్టెంబర్ 1న 33 అడుగుల ఎత్తులో వరద ప్రహారం వచ్చింది. నాగార్జునసాగర్ ఎడమ కాలువకున్న ఎస్కేప్‌కు ఎలాంటి వెల్డింగులు పెట్టలేదు. గేట్లు కొద్దిగా తెరిచే ఉన్నాయి. పాలేరు జలాశయం అలుగు ప్రాంతంలో ఉన్న గేట్లకు మాత్రం త్రాగునీరు వృధా కాకుండా గేట్లకు వెల్డింగ్ చేసిన మాట వాస్తవమే. కానీ వర్షాకాలం ప్రారంభంలో గేట్లకు పెట్టిన వెల్డింగుల వెంటనే తొలగించడం జరిగింది. అలానే గేట్లకు ఉన్న క్రోన్ వీల్స్ 2023 సంవత్సరంలో దొంగలించబడ్డాయి. దీంతో గేట్లు తొందరగా తెచ్చుకునే అవకాశం లేకపోయింది.

సాగర్ నీళ్లు లేక పొలం ఎండిపోయింది గూగులోత్ అక్కమ్మ(సీత్లా తండ)

నాగార్జునసాగర్ ప్రధాన కాలువకు గండిపడి 21 రోజులు గడిచినా కూడా ఇంతవరకు కాలువ పనులు పూర్తి కాలేదు. దీంతో నీళ్ల లేక నా పొలం మొత్తం ఎండిపోయింది.

మహిళా హక్కుల కోసం రాజీలేని పోరాటాలు

- మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి

నవతెలంగాణ-పెనుబల్లి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై రాజీ లేని పోరాటాలు నిర్వహించేది ఐద్వా ఒక్కటేనని మహిళా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి అన్నారు. శుక్రవారం మండలంలోని వీఎం బంజర్ చలమాల సూర్యనారాయణ భవన్‌లో మహిళా సంఘం మండల మహాసభ నిర్వహించారు. ముందుగా అమరజీవి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం పథకాన్ని ఆవిష్కరించి మాచర్ల భారతి మాట్లాడారు. దేశంలో మహిళల పట్ల అనేక రకాలుగా వివక్షత గురవుతున్నారన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని అధికారంలో ఉన్న పార్టీలు స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి మహిళను మోసం చేస్తున్నారన్నారు. సనాతన ధర్మం పేరుతో బిజెపి దాని అనుబంధ సంస్థలు మహిళల స్వేచ్ఛకు, చైతన్యతకు భంగం కలిగిస్తున్నాయని తెలిపారు. మహిళా హక్కులను కలరాసి కేంద్ర ప్రభుత్వ విధానాలు మోడీని గదించేందుకు మహిళలు ఐక్య పోరాటాలు పోరాటాల నిర్వహించాలన్నారు. పెరుగుతున్న ధరలు ప్రభావంతో మహిళలు చాలీచాలని ఆహారంతో రక్తహీనత, అనారోగ్యం పాలవుతున్నారన్నారు. పురుషులతో మహిళలకు సమాన పనికి సమాన వేతనం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యులు శీలం పకీరమ్మ, రాజనేని మంగమ్మ, మిట్టపల్లి నాగమణి పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



విద్యార్థులు ఎప్పటికప్పుడు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని మీతం ఐటీ టెక్నాలజీ మేనేజింగ్ డైరెక్టర్ విశాల్ అన్నారు. మండల పరిధిలోని మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం, కెరియర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో 'పవర్ బీఐ' అనే అంశంపై శుక్రవారం విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడారు. ఫ్యూచర్ డెవలప్మెంట్‌కు సంబంధించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత మార్కెట్లో కామర్స్‌కు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. అనంతరం వర్క్ షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసశర్మ, అధ్యాపకులు అమీనా కాతూన్, రత్నమాల, శశికళ, సునీత, సుమలత, స్వప్న, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలకై ఎన్ఎస్పీ కార్యాలయ ముట్టడికి కదలిరండి

- రైతు సంఘం జిల్లా నాయకులు రచ్చ నరసింహారావు

నవతెలంగాణ-నేలకొండపల్లి



సాగర్ జలాలు అందించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ సిపిఐ(ఎం), తెలంగాణ రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం (నేడు) చేపట్టిన స్థానిక ఎన్ఎస్పి డిఈ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు రచ్చ నరసింహారావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం మండల జనరల్ బాడీ సమావేశం కట్టెకోల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల ప్రభావంతో వేలాది ఎకరాల్లో రైతులు సాగుచేసిన వరి, పత్తి, మిర్చి, చెరుకు వంటి పంటలు నీట మునిగి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వరదల వల్ల సాగరు కాలువలకు గండ్లు పడి సాగునీటి సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడి 20 రోజులు గడుస్తున్న గండ్లు పూడ్చడంలో ప్రభుత్వం సంబంధిత అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వర్షాలతో వేలాది ఎకరాలు వరదల్లో కొట్టుకుపోయి తీవ్ర నష్టం వాటిల్లగా మిగిలిన పంటలకు కాలువలకు గండ్లుపడి సాగునీటి సరఫరా లేక నెర్రలు బాసి నిలువునా ఎండిపోతున్నాయన్నారు. ఒకవైపు ప్రకృతి బీభత్సం, మరోవైపు ప్రభుత్వ నిర్లక్ష్యం వెరసి వ్యవసాయ సాగంటేనే రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతూ కంటిమీద కునుకు లేకుండా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సాగర్ కాలువ గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి సాగర్ జలాలను అందించి ఎండిపోతున్న పంటలను కాపాడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ(ఎం) జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కెవి. రామిరెడ్డి, నాయకులు ఏటుకూరి రామారావు, దుగ్గి వెంకటేశ్వర్లు, కట్టెకోల వెంకటేశ్వర్లు, పగిడికత్తుల నాగేశ్వరరావు, బెల్లం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని గోపాలపేట గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ వైరా, జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా పశు వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించినట్లు డాక్టర్ నిస్సి జోషి తెలిపారు. 28 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ టి.నాగభూషణం, ఎం. వెంకటేశ్వర్లు, చుక్కరావు. వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో అత్యధిక బహుమతులు సాధించిన బీసీ వెల్ఫేర్ గురుకుల విద్యార్థులు

నవతెలంగాణ-బోనకల్



మండల పాఠశాలల స్థాయి క్రీడా పోటీలను మండల పరిధిలోని చిరునోముల ఉన్నత పాఠశాల నందు ఎఫర్ట్ ఆర్గనైజేషన్ వారు రెండు రోజులుగా నిర్వహించారు. శుక్రవారం ఈ క్రీడా పోటీలు ముగిశాయి. మండల స్థాయి క్రీడా పోటీలలో మండల కేంద్రంలో గల మహాత్మ జ్యోతిబాపూలే బోనకల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ క్రీడా పోటీలలో భాగంగా విద్యార్థులు కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్, షాట్ పుట్ విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులను సాధించారు. బహుమతులను సాధించిన విద్యార్థులను ఖమ్మం జిల్లా కొత్తగూడెం బీసీ గురుకుల పాఠశాలల ఆర్ సి ఓ బ్యూలా రాణి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లింగం జ్యోతిర్మయి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల స్థాయిలో నిర్వహించిన పాఠశాల క్రీడా స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలన్నారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించటం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా పి ఈ టి వి నరేష్ , ఏటీపీ రామారావు, ఉపాధ్యాయులు పరమేశ్వర్, నాగేశ్వరరావు, ప్రవీణ్, రవికుమార్, వెంకటేశ్వర్లు, సురేష్ కుమార్ పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని దుబ్బతండలో గురువారం రాత్రి శాంతమ్మ (55) ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం పోస్టుమార్టమ్‌కు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-దమ్మపేట

మండల పరిధిలోని గండుగులపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రజాపాలన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఐదు మండలాల నుండి పలు సమస్యలపై ఎమ్మెల్యేకు ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించిన జారే సాధ్యమైనంత వరకూ అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే దరఖాస్తు దారులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

- మండల స్థాయి క్రీడల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడతాయని స్థానిక శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు అన్నారు. శుక్రవారం భద్రాచలం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మండల స్థాయి పాఠశాల క్రీడలను వెంకట్రావు లాంచనంగా ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో మంచి నైపుణ్యం సాధించి దేశ భవిష్యత్తుకు తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం భాగంగా మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన గౌరవ వందనాన్ని గౌరవ ఎమ్మెల్యే, క్రీడల అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి పాఠశాల క్రీడల కన్వీనర్ జి.పద్మజ, మండల క్రీడల ఆర్గనైజింగ్ కార్యదర్శి యం.రమేష్, బి.వెంకటేశ్వర్లు, జి.శరత్, జి.జాన్సన్, లక్ష్మీనారాయణ, బి.జయబాబు, వివిధ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరికలు అబద్ధం

నవతెలంగాణ-మణుగూరు

పగిడేరు పంచాయతీలో బీఆర్ఎస్ 30 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు ప్రకటించుకోవడం పచ్చి అబద్ధమని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. శుక్రవారం డా.బి.ఆర్ అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. తప్పుడు ప్రకటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గురువారం పగిడేరులో నిర్వహించిన కాంగ్రెస్ సమీక్షా సమావేశంలో జనాలే కరువయ్యారని అన్నారు. అటువంటిది 30 బీఆర్‌యస్ కుటుంబాలు ఎక్కడి నుండి వచ్చి కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. చేరింది బీఆర్ఎస్‌కు సంబంధం లేని వారన్నారు. పగిడేరు పోరాటాల పురిటి గడ్డ అని పగిడేరు ప్రజలు ఉద్యమ పార్టీ అయిన బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటారన్నారు. ముందు స్థానిక ఎమ్మెల్యే ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఇటీవల కురిసిన అతి వర్షాలకు పంట నష్టం, గృహ నష్టం, శాంతినగర్ చెరువు అలుగు వరద వలన రహదారులు తీవ్రంగా పాడైపోయాయని అన్నారు. పగిడేరులో నష్టపోయిన కుటుంబాలకు పరిహార ఎందుకు చెల్లించలేదని మండిపడ్డారు. కనీసం సర్వే కూడా నిర్వహించలేదు అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌యస్ నాయకులు గువ్వా రాంబాబు, మండల ఉపాధ్యక్షులు బేతమళ్ళ సుందర్, వేర్పుల సురేష్, మాజీ ఉపసర్పంచ్ దామల్ల దయాకర్, కొమరం నాగేశ్వర రావు, తుపాకుల నాగేశ్వర రావు, పూనెం రాము, యాదగిరి, ఉప్పలయ్య, శ్రీనివాస్, వర్ధయ్య, గంగరాజు, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన వినతి పత్రాలపై స్పందన కరువు

- హైడ్రా వస్తేనే అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారా..?
- బీఎస్పీ మండల అధ్యక్షులు నరసింహారావు

నవతెలంగాణ-జూలూరుపాడు

మండలంలోని వెంగన్నపాలెం గ్రామపంచాయతీలో గల జమ్మికుంట చెరువు ఆక్రమణకు గురవుతుందంటూ గతంలో స్థానిక రెవెన్యూ అధికారులకు వినతి, ఇరిగేషన్ అధికారులకు చరవాణి ద్వారా వివరించినా చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని బీఎస్పీ మండల అధ్యక్షులు తంబర్ల నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. హద్దులు నిర్మిస్తామని రెవెన్యూ అధికారులు చెప్పి ఇన్ని నెలలు అవుతున్నా ఇంతవరకు జాయింట్ సర్వే ఎందుకు చేయలేదని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా అందరి అనుమానాలు తొలగిపోవాలి అంటే హైడ్రా మండలానికి రాకముందే జమ్మికుంట చెరువుకు రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వే జరిపి హద్దులు నిర్మించాలని ఆయన అన్నారు.

జాగ్రత్తలతో విద్యుత్తును ఉపయోగించుకోవాలి

- మణుగూరు ఏరియాలో పర్యటించిన డీఎంఎస్ (ఎలెక్ట్రికల్) ఆనంద్ వెల్



నవతెలంగాణ-మణుగూరు

జాగ్రత్తలతో విద్యుత్తును వినియోగించుకోవాలని డీఎంఎస్ ఎలక్ట్రికల్ ఆనంద్ వెల్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి శాఖకు చెందిన సౌత్ సెంట్రల్ జోన్ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (ఎలెక్ట్రికల్) డీఎంఎస్ ఆనంద్ వెల్ మణుగూరు ఏరియాలో పర్యటించి 132 కేవి సబ్ స్టేషన్ నూ సంబంధిత అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తగు జాగ్రత్తలతో వినియోగించుకొంటే విద్యుత్ ఎంతగా ఉపయోగపడుతుందో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా అంతగా ప్రమాదానికి దారి తీస్తుంది. సబ్ స్టేషన్‌లలో గాని, గనులలో గాని ఎలెక్ట్రికల్ ఎక్విప్మెంట్ మీద పని చేసేటప్పుడు ముందున్న మెయిన్ కంట్రోల్ స్విచ్‌ను తప్పనిసరిగా బంద్ చేసి ఇసొలేటర్ ఓపెన్ చెయ్యాన్నారు. ఎర్త్ స్విచ్ క్లోజ్ చేసి లోటో బోర్డును మెయిన్ స్విచ్‌కు లాక్ చెయ్యాలన్నారు. లాక్ చేసిన పిదపనే ఎలక్ట్రీషియన్లు పని ప్రారంభించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం,కోల్ మినిస్ట్రీ వారి ఆదేశాల మేరకు అక్టోబర్ 2 నుండి 31 అక్టోబర్ తేదీ వరకు సింగరేణి వ్యాప్తంగా నిర్వహించబడుతున్న స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమంలో భాగంగా మణుగూరు ఏరియాలోని అన్నీ సబ్ స్టేషన్‌లలో పరిశుభ్రత చేయుటకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ ఆర్.శ్రీనివాస్, ఏరియా రక్షణ అధికారి వెంకట రామరావు, ఎస్ఈ(ఈ అండ్ఎం) ఎస్.మధుసూదన్, డీవైఎస్ఈ(ఈఅండ్ఎం) ఎస్.శోబన్ బాబు, ఈఈ(ఎలెక్ట్రికల్) ఈ.విజయ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క జార్జిరెడ్డి : పీడీఎస్‌యూ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క జార్జిరెడ్డి అని, భారత విద్యార్థి ఉద్యమాలకు పీడీఎస్‌యూ దిక్సూచిలా నిలిచిందని పీడీఎస్‌యూ భద్రాచలం డివిజన్ కార్యదర్శి మునిగేలా శివ ప్రశాంత్ తెలిపారు. శుక్రవారం భద్రాచలం డిగ్రీ కాలేజీలో పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని పోస్టర్ ఆవిష్కరణ సదస్సు నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. నక్సల్బరి, శ్రీకాకుళం, గోదావరిలోయ ప్రతిఘటన పోరాటాల ప్రేరణతో కత్తుల వంతెన పై నెత్తుటి కవాతు చేసిన పీడీఎస్‌యూ 50 యేండ్ల ఉద్యమ ప్రస్థానంలో ఎందరో విద్యార్థి రత్నాలైన జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలాశంకర్రం, గవల్లి చేరాలు రమణయ్య, సాంబయ్యలు తమ వేడి నెత్తురును ధార పోశారని గుర్తు చేశారు. ఈ నెల 30 తేదీన ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే బహిరంగ సభని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు ఆలం సంజు, కేసరి సాయి, ప్రవీణ్, ఇర్పా బాలు, భవాని, శ్రీహజ, వైష్ణవి, నవ్య,శైలజ, తదితరులు పాల్గొన్నారు.

గుంతలను పూడ్చిన యువకులు...అభినందించిన మెచ్చా

నవతెలంగాణ-దమ్మపేట



మనకెందుకులే అని ఆలోచించే ఈ రోజుల్లో రోడ్డుపై పడ్డ గుంతలతో ప్రమాదం పొంచి ఉందని గుర్తించి కొంతమంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వాటిని పూడ్చడం చాల సంతోషకరం అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు ప్రకటనలో పేర్కొన్నారు. నరకానికి కేరాఫ్ అడ్రస్‌గా అశ్వారావుపేట నియోజకవర్గ రోడ్లు మారాయని మన నియోజకవర్గం తెలంగాణలో ఉందా? అసలు తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? ప్రభుత్వం చేయాల్సిన పనులు ఎవరు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం చేయాల్సిన పనులు పట్టించుకోకపోవడంతో స్వయంగా గ్రామస్తులే చేసుకుంటున్నారు మార్పు అంటే ఇదేనా అని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నూతనంగా తెచ్చిన తారు రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోయాయని, అవి ఎప్పుడూ మొదలు పెడతారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. మరో నెలరోజుల్లో గుంతలు పూడ్చకపోతే తానే స్వయంగా సందర్శించి బీఆర్ఎస్ పార్టీ తరపున ధర్నా చేస్తానని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పడకేసిన అభివృద్ధి

- పంచాయతీలకు వెంటనే నిధులు కేటాయించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-ములకలపల్లి



గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పడకేసిందని, ప్రభుత్వం గ్రామపంచాయతీలకు తక్షణమే నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలో పూసుగూడెం పార్టీ శాఖ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రజా పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక వెలవెల పోతున్నాయన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పథంలో ముందుంచాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు ఎరువులు, పురుగుమందులు సబ్సిడీ ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. రైతులను మోసం చేసే పురుగు మందుల షాపులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నాయకులు ఊకంటి రవికుమార్, మాలోతు రావూజా, పొడియం వెంకటేశ్వర్లు, భూక్యా సామిని, సీతారాములు, లాలు, రంగా, భూక్యా శ్రీదేవి, శ్రీరాములు, రమణ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి లాభాలు వాటా ప్రకటించాలి : సీఐటీయూ

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణిలో ఈ ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాలను ప్రకటించి, కార్మికులకు 35 శాతం వాటా ఇవ్వాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వల్లూరు వెంకటరత్నం డిమాండ్ చేశారు. శుక్రవారం రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు అయిపోతున్నా ఇంతవరకు లాభాలు ప్రకటించలేదని విమర్శించారు. వరద సహాయం కింద సీఎం రిలీఫ్ ఫండ్‌కి కార్మికుల అనుమతి లేకుండానే బేసిక్‌లో కట్ చేశారని, సీఎం రిలీఫ్ ఫండ్ మీద ఉన్న శ్రద్ధ లాభాలు ప్రకటించడంలో లేదని అన్నారు. ఈ సమావేశంలో లక్ష్మారావు, ఈశ్వరరావు, ప్రభాకర్ రావు, లక్ష్మణరావు, విల్సన్ రాజు, బొల్లం రాజు, సుమన్, బుచ్చిరెడ్డి, శ్రీకాంత్, శ్రీను, కిరణ్ కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడటమే ఏచూరికిచ్చే నివాళి

- సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎం.బి.నర్సారెడ్డి
- సీఐటీయూ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



మోదీ తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కార్మిక హక్కులను కాపాడుకోవడమే సీతారాం ఏచూరికి ఇచ్చే నిజమైన నివాళి అని సీఐటీయూ భద్రాచలం పట్టణ కన్వీనర్ నర్సారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం నందు నాగరాజు అధ్యక్షతన జరిగిన ఏచూరి సంతాప సభ సందర్భంగా నర్సారెడ్డి ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. అనారోగ్యంతో మరణించిన సీతారాం ఏచూరి అకాల మరణం చెందటం దేశంలోని కార్మిక వర్గానికి మొత్తానికి తీవ్ర నష్టమని ఒక వైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలన్నిటినీ రద్దుచేసి కార్మిక కోడ్లుగా మార్చిందని, వీటిపై అలుపెరుగని పోరాటం చేస్తున్నటువంటి ఏచూరి మరణించడం కార్మిక వర్గానికి తీవ్ర లోటు అని అన్నారు. రాబోయే కాలంలో అన్ని సంఘాల, రంగాల కార్మికులు ఏచూరి సంతాప సభలను అన్ని కార్మిక వాడల్లో నిర్వహించి, ఘనమైన నివాళులర్పించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు గడ్డం స్వామి, పారేల్లి సంతోష్, అప్పారి రాము, అజయ్ కుమార్, రాయల రాములు, పండ్ల వర్తక సంఘం నాయకులు రాము, బాలకృష్ణ, వాసు, బాలాజీ, మురళి కృష్ణ, భూపేందర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమం ప్రయివేట్ పరం చేయొద్దు

- సీఐటీయూ నాయకులు అర్జున్

నవతెలంగాణ-అశ్వారావుపేట



బిల్డింగ్ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అమలును ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించే టెండర్లు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బిల్డింగ్ కార్మికులు అడ్డా వద్ద జరిగిన సమావేశంలో అర్జున్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు అమలు అవుతున్న ప్రమాద, సహజ మరణం, ప్రసూతి, పెళ్లి కానుక ఈ నాలుగు రకాల సంక్షేమ పథకాలు అమలును ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించేందుకు కార్మిక శాఖ ద్వారా ప్రభుత్వం పిలిచిన టెండర్ల ప్రక్రియను రద్దు చేయాలని అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందని 1996 నిర్మాణ రంగ కార్మికుల చట్టానికి సవరణ చేసి బలహీన పరుస్తుందని అన్నారు. బీజేపీ తెచ్చిన లేబర్ కోడ్ల అమలులో భాగంగానే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించే చర్యలు జరుగుతున్నాయని అన్నారు. సంక్షేమ బోర్డు సలహా మండలి నియమించాలని ప్రభుత్వం వాడుకున్న రూ.1350 కోట్లు బోర్డుకు జమ చేయాలని ప్రమాద బీమా పరిహారం రూ.10 లక్షలకు సహజ మరణ పరిహారం ఐదు లక్షలకు పెంచాలని వివాహ ప్రసూతి కానుకలను రూ.లక్షకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ రంగ మండల నాయకులు వెంకన్న బాబు, కృష్ణ, శ్రీను, చెన్నారావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ముత్యాలమ్మ ఆలయ నూతన స్టీరింగ్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండల కేంద్రమైన దుమ్ముగూడెం గ్రామంలో తరతరాలుగా వెలసిన గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ నూతన స్టీరింగ్ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత స్టీరింగ్ కమిటీ అధ్యక్షులు యలమంచి రవి కుమార్ అధ్యక్షతన ఆలయ ఆవరణలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామస్తుల సమక్షంలో ఆలయ అభివృద్ధికి కృషి చేసి, అనుభవం కలిగిన వ్యక్తులను గ్రామ సభ ద్వారా ప్రజల సమక్షంలో నూతన ఆలయ స్టీరింగ్ కమిటీని ఎన్నుకోవడం కొంతకాలంగా ఆనవాయితీగా వస్తుంది. గత స్టీరింగ్ కమిటీ అధ్యక్షులు యలమంచి రవి కుమార్, మిగిలిన సభ్యులలో ఇద్దరు సభ్యులు మరణించారు. మిగిలిన ఇద్దరు వయో వృద్ధులు కావడం వలన నూతన స్టీరింగ్ కమిటీ ఏర్పాటు అనివార్యం కావడంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా యలమంచి రవి కుమార్‌ను గ్రామ సభ ద్వారా గ్రామస్తుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోగా స్టీరింగ్ కమిటీ సభ్యులుగా కెల్లా వేణు గోపాల్, దల్లి అప్పల రెడ్డి, కొత్తూరి సీతారామారావు, మొసలి రాంబాబులను గ్రామ సభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ ఆహ్వాన సభ్యులుగా ఎండి హలీం ఖాన్ (భద్రాచలం), కొడాలి లోకేష్ బాబు(సీతారాం పురం), గొట్టుముక్కల సీతారామరాజు (చర్ల) కమిటీనీ ఎన్నుకున్నారు. ఇక మీదట ఆలయ అభివృద్ధికి ఈ రోజు ఎన్నుకున్న స్థిరింగ్ కమిటీ పూర్తి బాధ్యతతో నిర్వర్తిస్తుందని తెలియచేశారు. ఈ సమావేశంలో గత స్థిరింగ్ కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేసిన సీరపు వెంకట రమణా రెడ్డి (వయోవృద్ధులు) నూతన స్టీరింగ్ కమిటీ అధ్యక్షులు సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ గ్రామ సభలో ప్రస్తుత ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అన్ని అర్హతలున్నా తొలగించడం అన్యాయం

- నిబంధనల మేరకే నియామకం
- కన్నీరు మున్నీరైన బాధిత హిందీ పండిత్ ప్రేమ్ లాల్

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని ఏకలవ్య మోడల్ స్కూల్లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న తనను అన్యాయంగా తొలగించారని బాధిత హిందీ టీచర్, సింగరేణి మండలం భాగ్యనగర్ తండాకు చెందిన వాంకుడోత్ ప్రేమ్ లాల్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం టేకులపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హిందీ పండిత్, బీఏ హిందీ, ఎంఏ హిందీ పూర్తి చేసిన తాను 2019 నుంచి 16 సెప్టెంబర్ 2013 వరకు దమ్మపేటలోని గిరిజన బాలుర రెసిడెన్షియల్ కాలేజీలో టీజీటీ హిందీ టీచర్‌గా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేశానని తెలిపారు. 17.09.2023లో టేకులపల్లి మండలం ఏకలవ్య పాఠశాలలో టీజీటీ హిందీ టీచర్‌గా చేరినట్టు తెలిపారు. ఇక్కడ రెండు పోస్టులు కాగా అప్పటికే కల్పన అనే టీజీటీ హిందీ టీచర్‌గా ఉన్నారని తెలిపారు. ఇది ఇలా ఉండగా 2024-25 ఈ విద్యా సంవత్సరం జులై నెలలో రెగ్యులర్ టీజీటీ హిందీ టీచర్ ఒకరు రావడంతో ఉన్న ఇద్దరు ఔట్సోర్సింగ్ టీజీటీ హిందీ టీచర్లలో ఒకరిని తీసివేయాల్సిన పరిస్థితిలో తనతో పాటు మరో ఔట్సోర్సింగ్ టీచర్ అయిన కల్పన ఇద్దరికీ డెమో టెస్ట్ పెట్టారని, ఇద్దరి సర్టిఫికెట్స్ పరిశీలించారని, టీచింగ్ నైపుణ్యం, విద్యార్హతలు, డెమో టెస్ట్‌లో ప్రతిభ అన్నింటినీ పరిశీలించి నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (ఎన్ఈఎస్‌టీఎస్) నిబంధనల మేరకే తనను సెలెక్ట్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. జులై నెల నుంచి పనిచేస్తున్న తరుణంలో కల్పనను తాను పని చేస్తున్న పోస్ట్‌లో టీజీటీ హిందీ టీచర్‌గా నియమిస్తూ 30.08.2024న భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆమె సెప్టెంబర్ 12న టీజీటీ హిందీ టీచర్‌గా జాయిన్ అయ్యారన్నారు. సెప్టెంబర్ 11 వరకు తాను పని చేశానని, ఆమె జాయిన్ కావడంతో తనను వద్దన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను వర్కింగ్‌లో ఉండగా తొలగించడం, వేరే వారిని నియామించడం నిబంధనలకు విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎంఆర్ఎస్ గురుకుల కార్యదర్శి, రీజినల్ కో ఆర్డినేటర్‌ల దృష్టికి తన సమస్యను తీసుకెళ్లినట్లు తెలిపారు. తనకు జరిగిన అన్యాయం విషయంలో న్యాయం చేయాలని ఐటీడీఏ పీఓని స్వయంగా కలిసి వేడుకున్నా పుట్టుకతో వికలాంగుడనైన తనను చూసి కూడా కనికరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉద్యోగం పైనే తన ఆధారమని అన్యాయంగా తనను ఉద్యోగం నుంచి తీసివేయడం వల్ల భార్య, ఇద్దరు పిల్లల పోషణ భారంగా మారుతుందని కన్నీటి పర్యంతమయ్యారు. జిల్లా మంత్రులు, కలెక్టర్, పీఓ, ఈఎంఆర్ఎస్ అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ముమ్మరంగా సీపీఐ(ఎం) శాఖ మహాసభలు

నవతెలంగాణ-అశ్వారావుపేట





నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో సీపీఐ(ఎం) క్షేత్రస్థాయి నిర్మాణం పటిష్టత మూడేళ్ళకు ఒక సారి నిర్వహించే శాఖా మహాసభలు మండల కన్వీనర్ చిరంజీవి పర్యవేక్షణలో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని నందిపాడులో శుక్రవారం అయిదు శాఖల మహాసభలను మడకం బుచ్చమ్మ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ పతాకాన్ని మడకం ముత్యాలు(పెద్ద కాపు) ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి అరుణాంజలి ఘటించి నివాళులు అర్పించారు. మాడి నాగేశ్వరరావు, మడకం సత్యవతి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలకు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లయ్య మహా సభలను ఉద్దేశించి మాట్లాడారు. ఎటువంటి పక్షపాతం లేకుండా గిరిజనుల పక్షాన నిలిచి పోరాడేది సీపీఐ(ఎం) మాత్రమే నని అన్నారు. పోడుకు పట్టాలు వచ్చినా, 1/70 చట్టం ఇంకా బలంగా ఉండటానికి సీపీఐ(ఎం) వైఖరే కారణం అని తెలిపారు. ఈ మహాసభల్లో స్థానిక నాయకులు కారం సూరిబాబు, కన్నయ్య జోగారావు, ముడివి నాగేశ్వరరావు, మడకం రాజు, ముడివి నరేష్‌లు పాల్గొన్నారు.



తోగూడెంలో 1/70కి తూట్లు

- క్వారీ వ్యవస్థతో కోట్ల వ్యాపారం
- సేవాలాల్ సేన

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

పాల్వంచ మండల పరిధి తోగూడెం ఏజెన్సీ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న క్వారీ వ్యవస్థ ప్రజల ప్రాణాలకు ముప్పుగా వాటిల్లిందని సేవాలాల్ సేన అభ్యంతరం వ్యక్తం చేసింది. శుక్రవారం పట్టణ పరిధి కేటీపీఎస్ తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ భవన్లో సేవాలాల్ సేన ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు పరమేష్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సేవాలాల్ సేన, యువసేన జిల్లా అధ్యక్షులు మాలోతు శివ నాయక్, బానోత్ భరత్ నాయక్‌లు మాట్లాడారు. ఏజెన్సీలో గిరిజనేతర పెత్తనం ఇటీవల కాలంలో తీవ్రతర మైందన్నారు. గిరిజనుల పేరుతో గిరిజనేతర బడా బాబులు అడ్డుకోలు దోపిడీకి పాల్పడటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. తోగ్గుడెం ఏజెన్సీలో 1/70 రూల్స్‌కి వ్యతిరేకంగా గిరిజనేతర వర్గాలు కోట్ల వ్యాపారం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బాంబులు పేల్చి, కంకరను సేకరించడం వెనుకున్న అధికార వర్గాల నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. ఒకడుగు ముందు కేసిన క్వారీ యాజమాన్యాలు తోగూడెం లోనే తారు ప్లాంట్లు ఏర్పాటు చేసి విచ్చలవిడి వ్యాపారానికి తెర లేపారని మండి పడ్డారు. పర్మిషన్ లేని ప్లాంట్లను తక్షణం సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. పర్మిషన్ ఇచ్చిన అధికారులను తక్షణం విధులోంచి తొలగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో కలెక్టరేట్ ముట్టడి చేపడతామని స్పష్టం చేశారు. సేవాలాల్ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రుక్మిణి బాయ్, జిల్లా, మండల భాద్యులు పాల్గొన్నారు.



మండల స్థాయి పోటీలో హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-దమ్మపేట

మండల స్థాయిలో జరిగిన క్రీడా పోటీలో దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. మండల పరిధిలోని పార్కెలగండి ఆశ్రమ పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీలలు దమ్మపేట హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. పాఠశాలలో క్రీడలకు సంబంధించిన కనీస మౌలిక వసతులు, క్రీడా మైదానం లేనప్పటికి అండర్ 14 కబడ్డీ విభాగంలో మొదటి బహుమతిని సాధించారు. వసతులు ఉంటే మరిన్ని పతకాలు గెలుస్తామని క్రీడాకారులు అన్నారు. కాగా విద్యార్థులను స్కూల్ ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

గ్రామాలలో ఫ్రైడే డ్రైడే

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని పర్ణశాల, దుమ్ముగూడెం, నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాలలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా నీరు ఉన్నచోట డి వాటర్ రింగ్ చేయడం, ఆయిల్ బాల్స్ వదలడం, తిమోఫాస్ చల్లడంతోపాటు ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని రాత్రిపూట దోమల కుట్టకుండా దోమతెరలు వాడాలని, జ్వరం వచ్చిన వెంటనే ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, లేక ఆరోగ్య కేంద్రాన్ని కానీ వెంటనే సంప్రదించాలని సూచించారు. లక్ష్మీ నగరం ఏకలవ్య పాఠశాలలో దోమలు వ్యాప్తి చెందకుండా ఫైరిత్రం స్ప్రేయింగ్ చేయించడం జరిగింది. లక్ష్మీనగరం గ్రామంలోని ఆర్ఎంపి క్లినిక్‌ను దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విద్యాధికారి పుల్లారెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గంగాధర్, ఏఎన్ఎమ్స్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలకు పరిష్కారమెప్పుడు..?

నవతెలంగాణ-జూలూరుపాడు

విద్యారంగ సమస్యలు పరిష్కారం ఇంకెప్పుడు చేస్తారని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ ప్రశ్నించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అఖిల భారత విద్యార్థి సమైక్య ముఖ్య కార్యకర్తల సమావేశంలో వంశీ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడే దాదాపు తొమ్మిది నెలలకు కావస్తున్నా ఇప్పటివరకు తెలంగాణకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం బాధాకర విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు శ్రీనివాసరావు, సాయి తేజ, రామ్ చరణ్ తేజ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యా, వైద్యం, మౌళిక సదుపాయాలకే ప్రథమ ప్రాధాన్యత : ఎమ్మెల్యే జారే

నవతెలంగాణ-అశ్వారావుపేట



తెలంగాణ ప్రభుత్వం విద్యా, వైద్యం మౌళిక సదుపాయాలకే అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఇందులో ప్రతీ పాఠశాలలోను ఆ విధమైన ఏర్పాట్లతో కూడిన సమీకృత పాఠశాలలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టబోతున్నామని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అశ్వారావుపేటలోని మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (గర్ల్స్) స్కూల్‌లో విద్యార్థినిలకు శుక్రవారం వ్యక్తిత్వ వికాస శిక్షణ ఇచ్చారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జారే విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పైర్ అండ్ ఇగ్నైట్ ఫౌండేషన్ డైరెక్టర్ దాసరి రంజిత్, దిండి సుధాకర్, ఉప్పపు రాము విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత చదువులపై అవగాహన వాటి ప్రాముఖ్యత, ఉపాధి అవకాశాలు మానవతా విలువలు, ఉపాధ్యాయులు తల్లిదండ్రుల గొప్పతనం, ఉత్తమ ఫలితాలు సాధించడానికి మెమరీ టెక్నిక్, క్రమశిక్షణ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి

నవతెలంగాణ-చండ్రుగొండ

ఉపాధ్యాయులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పీఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి చేశారు. శుక్రవారం పిఆర్‌టియు మండల నూతన కార్యవర్గ ఎన్నిక మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవి ఉపాధ్యాయుల సమస్యలనుద్దేశించి మాట్లాడుతూ కేవలం నెల జీతాలపై ఆధారపడి జీవిస్తున్న ఉపాధ్యాయులకు ప్రస్తుత పరిస్థితుల్లో సొంతింటి కల నెరవేరడం లేదని, ఇక్కడి ప్రత్యేక పరిస్థితులు, ప్రత్యేక చట్టాల దృష్ట్యా భద్రాద్రి జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ ప్రభుత్వ నామినల్ ధరతో ఇళ్ల స్థలాలు కేటాయించాలని, దసరా కానుకగా కనీసం 3% డీఏలతో పాటు 40% ఫిట్మెంట్తో కూడిన పిఆర్‌సిను ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చంద్రుగొండ మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, సహ అధ్యక్షులు సక్రు కార్యదర్శి నరేష్, మహిళా కార్యదర్శులుగా సుకన్య, బేబీ రాణి, మండల గౌరవ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎన్నికల అధికారిగా మాజీ మండల అధ్యక్షులు ఆరీఫ్ హుస్సేన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భాద్యులు వెంకటేశ్వర్లు మూర్తి, వారణాసి వెంకటేశ్వర్లు, వాజిద్, చంద్రశేఖర్, స్వామి సతీష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టిజన్స్ కు ఒకే సర్వీసు రూల్స్ వచ్చేవరకూ పోరాటం

- కేటీపీఎస్ టీవీఏసి జేఏసీ చైర్మెన్ ఎం.నరసింహారెడ్డి, కన్వీనర్ తోట త్రినాథ్

నవతెలంగాణ-పాల్వంచ

ఆర్టిజన్స్‌కు ఒకే సర్వీసు రూల్స్ వచ్చేవరకు మరో పోరాటం చేస్తామని కేటీపీఎస్ (టీవీఏసి-జేఏసీ) తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ జాయింట్ కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రకటించింది. శుక్రవారం స్థానిక 1535 కార్యాలయంలో కలిసివచ్చిన అన్ని యూనియన్లతో చైర్మెన్ తోట త్రినాథ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ జేఏసీ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ సంస్థలో 23,667 మంది ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ సమస్య చాలా ఉందన్నారు. అనేక పోరాటాలు చేసిన తర్వాత కాంట్రాక్ట్ కార్మికులందరికీ రెగ్యులర్ చేస్తామని గత ప్రభుత్వం చెప్పింది, కానీ చివరి క్షణంలో ఆర్టిజన్ అనే పేరుతో ఒక ప్రత్యేకమైన స్టాండింగ్ ఆర్డర్స్‌ను తయారుచేసి 23,667 మందిని మోసం చేశారని చెప్పారు. .ఇప్పుడు ఉన్న ప్రభుత్వం ఎన్నికలకు ముందు పాదయాత్రలోనూ, అసెంబ్లీలో ప్రభుత్వం రాగానే ఆర్టిజన్స్ అందరినీ ఒకే సంస్థ ఒకే రూల్స్‌గా పాత విధానం చట్టంలోకి మారుస్తామని చెప్పారు. కానీ ఇప్పటివరకు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర జేఏసీ కో చైర్మెన్ బి.శంకర్, కేటీపీఎస్ టీవీఏసీ జేఏసీ కమిటీకి చైర్మెన్‌గా ఎం.నరసింహారెడ్డి, కన్వీనర్‌గా తోట త్రినాథ్, కో చైర్మన్ గా బి రాములు, ఎన్ రమేష్, కో కన్వీనర్స్ గా బి మంగీలాల్, ఎస్.రజినిబాబు మిగతా కమిటీ సభ్యులు ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు.

అణు వర్ణపటమాపక శాస్త్రంపై అవగాహన

నవతెలంగాణ-పాల్వంచ

రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అణు వర్ణపట మాపక శాస్త్రంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా డాక్టర్ బి.చంద్రమౌళి, రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ మాట్లాడుతూ అణు వర్ణపటం అనేది రసాయన శాస్త్ర మెటీరియల్ సైన్స్, భౌతిక శాస్త్రాల్లో ఒక ప్రాథమిక అన్వేషణ సాధనం, ఇది పదార్థం కూర్పు, భౌతిక నిర్మాణం, ఎలక్ట్రానిక్ నిర్మాణాన్ని కనుగొనడానికి ఉపయోగపడుతుందని విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జే.మాధవి, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ అరుణ కుమారి, డాక్టర్ నాగేశ్వరరావు, తేజస్విని, కావ్య, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న కమ్యూనిస్టులు

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి





బీజేపీ, మతోన్మాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు మాత్రమే పోరాడుతున్నారనిసీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ అన్నారు. మండలంలోని గట్టు మల్ల శాఖ సీపీఐ(ఎం) మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దేశంలో బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం, ఒకే భాష, ఒకే ఎన్నిక పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ అధ్యక్ష తరహా పాలనకు కుట్రలు చేస్తుందన్నారు. దేశంలో ఉన్న ప్రజలు వివిధ జాతులు, భాషలు, కులాలు, మతాలు కలిగిన దేశం ఒకే భాష పేరుతో కులాల మధ్యన మతాల మధ్యన ఘర్షణలు సృష్టిస్తూ తన కుట్రపూరిత ఆలోచనలు ప్రజలపై ఘర్షణలకు తెరలేపుతుందని అన్నారు. దీనిని దేశంలో ఉన్న మేధావులు, కార్మికులు, ప్రజలు బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉన్నదన్నారు. అనంతరం శాఖ పరిధిలో నూతన కార్యదర్శి ఎన్నిక జరిగింది. మొదటి శాఖ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, రెండో శాఖ కార్యదర్శిగా పాషా ఎన్నికయ్యారు. ఈ మహాసభల్లో పార్టీ మండల కార్యదర్శి యు.నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు వాంకుడోత్ కోబల్, కరణ వీరభద్రం, బట్టు వెంకటేశ్వర్లు, ఎస్కే పాషా, కీసరి కృష్ణ, బండి రమణయ్య పాల్గొన్నారు.

కడవరకు పేద ప్రజల కోసమే శ్రమించిన ఏచూరి

నవతెలంగాణ-కల్లూరు

పుట్టింది బ్రాహ్మణ కులమైన, అంతా ఉన్నత స్థాయిలో ఉన్న పేద ప్రజల కష్టాలు చూసి వారి సేవ కోసమే చివరివరకు పోరాడిన మహా వ్యక్తి సీతారాం ఏచూరి అని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ అన్నారు. మండల పరిధిలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి ఏచూరి సంతాప సభ ముదిగొండ అంజయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాదినేని రమేష్ మాట్లాడుతూ నిత్యం సిపిఎం పార్టీ పేద ప్రజల కోసం పోరాడుతుందని అన్నారు. ఆ పోరాటాలకు విద్యార్థి దశ నుండే వామపక్ష భావజాలకు ఏచూరి ఆకర్షితుడయ్యారు. ఢిల్లీ యూనివర్సిటీ వీసీగా ఉన్న ప్రధానమంత్రి ఇందిరాగాంధీని రాజీనామా చేయాలని ఆమె ఎదుట డిమాండ్ చేసి రాజీనామా చేయించిన ఘనత ఏచూరికే దక్కిందన్నారు. ఆ విధంగా పార్టీకి అంకితమై అంచలంచెలుగా ఎదిగి సిపిఎం ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి పార్టీని నడిపించిన ఏచూరి మరణం పార్టీకి దేశానికి తీరని లోటు అన్నారు. ఏచూరి ఆశయ సాధన కోసం సమిష్టిగా కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు తన్నీరు కృష్ణార్జునరావు, తల్లాడ మండల సిపిఎం నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి, గ్రామ నాయకులు నాయుడు చందర్రావు, స్వామి భక్తి కృష్ణ, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వపు మాయమాటలు

అంగన్‌వాడీలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మచారి, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.పద్మ
- కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా
- అప్ గ్రేడ్ అయిన టీచర్లకు పూర్తి జీతం చెల్లించాలి
- హెల్పర్లను నియమించాలి
- ఐసీడీఎస్ డీడబ్ల్యూఓ విజేతకు వినతి



నవతెలంగాణ-పాల్వంచ

అంగన్వాడీ టీచర్లను రాష్ట్రం ప్రభుత్వం మాయమాటలతో మోసం చేస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మచారి, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.పద్మ అన్నారు. మినీ టీచర్స్ నుంచి మెయిన్ టీచర్‌గా అప్ గ్రేడ్ అయిన అంగన్వాడీ టీచర్లకు పూర్తి జీతం 13,650 చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అప్ గ్రేడ్ అయిన అంగన్వాడీ కేంద్రాలకు హెల్పర్లను నియమించాలని అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచర్, హెల్పర్ పోస్టులను భర్తీ చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం మాయమాటలు చెప్పి అంగన్వాడీ టీచర్లను మోసం చేస్తుందని విమర్శించారు. మినీ టీచర్స్‌ను మెయిన్ టీచర్స్‌గా అప్ గ్రేడ్ చేసి 9 నెలలు పూర్తిఅయిందన్నారు. ఐదు నెలలు మెయిన్ టీచర్‌తోసమాన జీతం చెల్లించారు. నాలుగు నెలలు మినీ జీతం వచ్చినది. ఒకసారి మినీ జీతం ఒకసారి మెయిన్ జీతం వస్తుంది. ఇలా రావడం వల్ల అప్ గ్రేడ్ అయిన టీచర్స్ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అప్ గ్రేడ్ చేసిన టీచర్స్ అందరికీ సక్రమంగా ప్రతి నెలా జీతం రూ.13650 రూపాయలు ఇవ్వాలని తెలంగాణ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ ధర్నా కార్యక్రమానికి తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ అధ్యక్షత వహించగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎజే రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవి కుమార్, సహాయ కార్యదర్శి కే.సత్య, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు కృష్ణవేణి, రాణి, బానుశ్రీ, ఆదిలక్ష్మి, కృష్ణవేణి, సావిత్రి, అరుణ, జయ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఐసీడీఎస్ డీడబ్ల్యూఓ విజేతకి అందజేశారు. సమస్యలపై స్పందిస్తూ ఆమె మాట్లాడుతూ సమస్యలన్నింటిని ఐసిడిఎస్ కమిషనర్‌కు తెలియజేస్తామని పూర్తి జీతం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. హెల్పర్లు లేని, అనారోగ్యంగా ఉన్నటువంటి వారికి బీఎల్ఓ డ్యూటీలు మినహాయించే విధంగా కలెక్టర్ నుంచి అనుమతి తీసుకుంటామని హామీ ఇచ్చారు



పెండింగ్ వేతనాలు తక్షణమే ఇవ్వాలి

- కలెక్టరేట్‌ను ముట్టడించిన ఏఐటీయూసీ
- సమస్య పరిష్కరిస్తామని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి విజేత హామీ

నవతెలంగాణ-పాల్వంచ

రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్వాడీ టీచర్స్‌కు గత నాలుగుగా సగం వేతనం ఇస్తున్నందున ఏఐటీయూసీ అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున తరలి వచ్చి జిల్లా కలెక్టరేట్ ఎదుట 2 గంటల పాటు బైఠాయించి నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చెరుకూరి సీతమహాలక్ష్మి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్, మంత్రి సీతక్క మినీ టీచర్స్‌కు పదోన్నతి కల్పించి జీవితాలకు వెలుగులు నివ్వాలన్నారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ మినీ అంగన్వాడీలకు ఎన్నికల డ్యూటీలు రద్దు చెయ్యాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్స్, ఆరోగ్యలక్ష్మి బిల్స్, ఈవెంట్ బిల్స్ ఇవ్వాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పాటిల్‌కి, జిల్లా సంక్షేమ అధికారి విజేతకి వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరిస్తామని జిల్లా సంక్షేమ అధికారి విజేత హామీ ఇవ్వగా ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచెర్ల జమలయ్య, వేల్పుల మల్లికార్జన్, మోహన్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు గోనే మణి పాల్గొన్నారు.

బాణాపురంలో ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-ముదిగొండ



మండలపరిధిలో బాణాపురం గ్రామానికి చెందిన మాదాసు నరేష్ (35) మానసిక స్థితి బాగలేక శుక్రవారం తన ఇంట్లోనే ఎవరూ లేని సమయంలో ఉరి పెట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు నరేష్ కు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

నవతెలంగాణ -కూసుమంచి

మండలంలోని మల్లాయిగూడెం పంచాయతీ పరిధిలోని హట్యతండాకు చెందిన బాదావత్ తులసమ్మ(65) శుక్రవారం పొలం పనులకు పోగా అక్కడ పాము కాటేవేసింది. ఆమె కుమారులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. డాక్టర్ పరీక్షించగా మృతి చెందినట్లు తెలిపారని తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాతృమూర్తి పేరిట మొక్క నాటండి

- సీఆర్పీఎఫ్ 151 బెటాలియన్ కమాండర్ రాజీవ్ కుమార్

నవతెలంగాణ-చర్ల



ప్రతి ఒక్కరూ తమ తమ తల్లి పేరిట (ఏక్ పౌధా అప్నే మా కే నామ్') మొక్కలు నాటాలని సీఆర్పిఎఫ్ 151వ బెటాలియన్ కమాండర్ రాజీవ్ కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన తన సిబ్బందితో కలిసి సత్యనారాయణపురంలో మొక్కలు నాటి మాట్లాడారు. "ఏక్ పౌధా అప్నే మా కే నామ్" ప్రచారంలో 151సీ ఆర్పీయాఫ్ ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో గత కొన్నేళ్లుగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఇంటెన్సివ్ యాంటీ-నక్సల్ ఆపరేషన్లలో మోహరించిన జవాన్లు ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారని, వారు ఈ ప్రాంతం భద్రత, మానవ సేవలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని బీజాపూర్ జిల్లా కేంద్రంలోని 151 సీఆర్పీఎఫ్ ప్రధాన కార్యాలయం కలివేరు, చర్మేలా, తెలంగాణ బోర్డర్‌లో ఉన్నాయి. మిగతా బలగాలు తిప్పపురం, తొంగుడ, పేడ్డ్, చింతవాగు క్యాంప్, ధర్మవరం వంటి పరిసర ప్రాంతాలలో ఈ కార్యక్రమం నిర్వహించబడిందన్నారు. సీఆర్పీఎఫ్ కమాండెంట్, డిప్యూటీ కమాండెంట్ రంజన్ ప్రకాశ్, డాక్టర్ నీరజ్ పాండే, సుబేదార్ మేజర్ అభిషేక్ చౌదరి, ఇతర సైనికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జామ, మామిడి, ఉసిరి, వేప తదితర మొక్కలు నాటారు. కమాండెంట్ రాజీవ్ కుమార్ చెట్ల ఉపయోగం, ఆవశ్యకత గురించి సైనికులకు వివరించారు. అలాగే 151వ బెటాలియన్లో 5000 మొక్కలు నాటేందుకు తీర్మానం చేశామని, అందులో ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో 3500 మొక్కలు నాటామని, వాటిని 151 సీఆర్పీఎఫ్‌లోని సైనికులు సంరక్షిస్తున్నారని తెలిపారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు
- ధర్నాకు సంఘీభావం

నవతెలంగాణ-పాల్వంచ

భద్రాద్రి కలెక్టరేట్ ధర్నా



ఆరోగ్యశ్రీ సేవలందిస్తున్న ఉద్యోగస్తుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు చేపట్టిన ధర్నా కార్యక్రమానికి ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 60 ప్రకారం 17 సంవత్సరాలు దాటిన ఉద్యోగస్తులను డీపీఓలుగా గుర్తించాలని కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆరోగ్యశ్రీ ఉద్యోగులు చేస్తున్న పోరాటం న్యాయమైనదని ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. వారు చేస్తున్న ఆందోళన ఉధృతమైతే హాస్పిటల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయే ప్రమాదం ఉందని, అందుకని ప్రభుత్వం తాత్సారం చేయకుండా తక్షణమే చర్చలు జరిపి సానుకూలంగా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ ఉద్యోగస్తులు చేస్తున్న పోరాటానికి సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ వారికి అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు పొందుతున్న ప్రజల మద్దతు కూడా కూడగట్టి భవిష్యత్తు పోరాటాల్లో భాగస్వామ్యం అవుతామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాలంగి హరికృష్ణ, నాయకులు చప్పిడి శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జెండా మూసిన ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్

నవతెలంగాణ-వేంసూరు



కష్టకాలంలో పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శంభుని గూడెం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా రెప రెప లాడాలని రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సముష్టిగా కార్యకర్తలు కృషిచేసి మంచి ఫలితాలు తీసుకొచ్చేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, గడిపర్తి శ్రీనివాసరావు, రాంబాబు కృష్ణమాచారి, సుధీర్ కరుణాకర్ రెడ్డి, ఫైజుద్దీన్, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మందపాటి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలపై అవగాహన

నవ తెలంగాణ - బోనకల్



భారత ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా ఖమ్మం రైల్వే రక్షక దళం ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి ఇంటిని, పరిసరాలను, గ్రామాలను శుభ్రంగా వుంచుకోవాలన్నారు. పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండటం వల్ల మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చునన్నారు. అదే విధంగా వ్యర్థ పదార్థాలను, చెత్తను రైల్వే పరిసరాలలో వేయవద్దని ప్రజలను కోరారు. ఇందుకు ఎవరూ విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటమే కాక జరిమానా విధిస్తామని తెలిపారు. వెళ్తున్న రైలు బండ్ల పై రాళ్ళు విసరడం, రైలు పట్టాలపై రాళ్ళు, ఇనుప వస్తువులు పెట్టడం చట్టప్రకారం నేరమన్నారు. అలాంటి వారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ స్వచ్ఛతపై హాజరైన ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యమంలో ఏఎస్ఐలు మొదింసా, ప్రసన్న కుమార్, హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి సంతాప సభ

నవతెలంగాణ-ఇల్లందు

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవం, సీతారాం ఏచూరి సంతాప సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో అమరవీరుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి, మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుల్తానా పాల్గొని ప్రసంగించారు. తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో సంఘం మండల కార్యదర్శి కుమారి, ఐలమ్మ, కనకమ్మ, స్వరూప, అనసుర్య జయ శాంతమ్మ వెంకటమ్మ పగడమ్మా తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కర్షక నేత కారం సంజీవయ్య

- ఘనంగా ద్వితీయ వర్ధంతి

నవతెలంగాణ-ఇల్లందు

21 ఏరియా సీపీఐ(ఎం) సీనియర్, కార్మిక కర్షక నేత కారం సంజీవయ్య ద్వితీయ వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక లాల్ మహ్మద్ నగర్ 21పిట్‌లో ద్వితీయ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి నబీ మాట్లాడుతూ స్థానిక సీనియర్ నేత కారం సంజీవయ్య ద్వితీయ వర్ధంతి, సీతారాం ఏచూరి సంతాపం తెలుపుతున్నట్లు వారి అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం సుల్తానా అధ్యక్షతన జరుగగా వీ రాజ మొగిలి, మొలుగు శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, రోజా, కారం వనమాల, ఉమాదేవి, రాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.



శ్రమకు తగిన గుర్తింపు దక్కింది...

- గ్రామపంచాయతీ అభివృద్ధి లక్ష్యంగా పనిచేశాం
- భూపాలపట్నం మాజీ సర్పంచ్ కృష్ణంరాజు

నవతెలంగాణ-పినపాక

మండల పరిధిలోగల భూపాలపట్నం గ్రామపంచాయతీకి జాతీయస్థాయి ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు రావడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణంరాజు హర్షం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ అభివృద్ధిలో వార్డు మెంబర్ల సహకారం, గ్రామస్తుల సహకారంతోనే ఈ అవార్డు సాధించామని తెలిపారు. గ్రామపంచాయతీలో మారుమూల గ్రామాలకు సైతం రహదారులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎంబీఏ చదివి ఉన్నత ఉద్యోగాల కోసం ప్రిపేర్ అయ్యే సమయంలో గ్రామస్తుల తనను గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. అలాగే ఉప సర్పంచ్ నిట్ట వెంకటేశ్వర్లు డిగ్రీ తోపాటు టీచర్ ట్రైనింగ్ చేసిన అనుభవం ఉండడంతో తను కూడా ఉప సర్పంచిగా ఎన్నికైనట్లుగా తెలిపారు. వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్ సహకారం అభివృద్ధిలో ఎంతగానో ఉందని చెప్పారు. ఏకగ్రీవమైన పంచాయతీలకు ప్రభుత్వం ప్రకటించినట్లుగా గతంలో డబ్బులు మంజూరు చేసి ఉంటే గ్రామపంచాయతీని మరింతగా అభివృద్ధి చేసే వారమని తెలిపారు. ఎంపీఓ వెంకటేశ్వరరావు వచ్చినప్పటి నుండి ఆయన సలహాలు సూచనలతో గ్రామపంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలు సైతం ఇంకా మెరుగ్గా కొనసాగించామని తెలిపారు. సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

దళితుల సమస్యలపై కుంచపర్తిలో ధర్నా

- పంచాయతీ కార్యదర్శికి వినతి

నవతెలంగాణ-వేంసూరు.

కుంచపర్తి దళిత కాలనీ సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి కార్యదర్శి రవీంద్రకి వినతి పత్రాన్ని అందజేశారు. కాలనీలో ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, గత పది సంవత్సరాలుగా నివాస గృహాల కోసం ఎదురుచూపులు చూస్తున్నామని, సైడ్ కాలువలు లేక వర్షపు నీరు ఇళ్లలో చేరి అనారోగ్యాలకు గురవుతున్నారని నాయకులు తెలిపారు. శిథిలమైన ఇళ్లను అధికారులు గుర్తించి వెంటనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కొన్ని ఇంటి కప్పు పెచ్చులు పడిపోవడం వల్ల బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అరవపల్లి జగన్మోహన్రావు, మల్లూరు చంద్రశేఖర్, ఆరంపుల మల్లయ్య, హరిబాబు, రత్నకుమార్‌తో పాటు 50 మంది స్థానికులు పాల్గొన్నారు.



గంజాయి పట్టివేత

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఖమ్మం డీసీ జనార్దన్ రెడ్డి, ఏసీ గణేష్ ఆదేశాల మేరకు కూనవరం రోడ్డులోని ఆర్టీఏ చెక్ పోస్ట్ వద్ద ఖమ్మం ఎన్ఫోర్స్మెంట్ బృందం వాహన తనిఖీలలో ఒరిస్సా నుంచి రాజస్థాన్‌కి కారులో ముఖేష్ మిర్ధ, గుజ్జర్ శ్రీరామ అను వ్యక్తులు 45.170 కేజీల ఎండు గంజాయిని తరలిస్తుండగా శుక్రవారం పట్టుకున్నారు. వారి నుంచి రెండు సెల్ ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నట్టు వారు తెలిపారు. ఈ తనిఖీలలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస్, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ బాలు, కానిస్టేబుల్స్ సుధీర్, హరీష్, హనుమంతరావు, వెంకట్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పేద ఆర్యవైశ్యులు విద్య, వివాహాల సహాయం కోసం దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-దమ్మపేట

పేద ఆర్యవైశ్యులు చదువులు, వివాహాలకు సహాయం కోసం వాసవి ఆర్యవైశ్య విద్యా, వివాహ సహాయ ట్రస్టు అధ్యక్షులు దేవి ప్రసాద్ దరఖాస్తులకు ఆహ్వానించడం జరిగిందని దమ్మపేట మాజీ వైస్ ఎంపీపీ, ఆర్యవైశ్య నాయకులు దారా మల్లికార్జునరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పేద ఆర్యవైశ్యులకు సహాయం అందించడమే లక్ష్యంగా వాసవి ఆర్యవైశ్య విద్యా, వివాహ సహాయ ట్రస్టు పనిచేస్తుందని తెలిపారు. ఎంతో మంచి ఉద్దేశ్యంతో 2012లో ఈ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ట్రస్ట్ ద్వారా ఇప్పటి వరకూ సుమారు 290 మంది విద్యార్థులకు విద్య కోసం, 15 మంది మహిళల వివాహ నిమిత్తం సుమారు రూ.15లక్షలకు పైగా ఆర్థిక సహాయం అందించినట్టు తెలపారు. జిల్లాలోని పాల్వంచ, కొత్తగూడెం, చంద్రుగొండ, ములకలపల్లి, దమ్మపేట, బూర్గంపాడు, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, అన్నపురెడ్డిపల్లి మండలాలకు చెందిన పేద ఆర్యవైశ్య విద్యార్థులు ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9848183504, 9848723131, 9848071423, 9440991682 నెంబర్‌లకు సంప్రదించాలని కోరారు.

తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించాలి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-టేకులపల్లి



తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. మండలంలోని దాసుతండ గ్రామపంచాయతీ బీటీ మెయిన్ రోడ్ మరమత్తులు మధ్యలో ఆగిపోవడంతో లారీలు నడవడం వలన దుమ్ము దూళి ఆ గ్రామాల్లో నివసిస్తున్న ప్రజల ఇండ్లలో పోవడం వలన అట్టి విషయాన్ని ఎమ్మెల్యే గమనించి సదరు అధికారులతో మాట్లాడారు. పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులకు శుక్రవారం తెలిపారు.

పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

నవతెలంగాణ-ములకలపల్లి

పీఆర్టీయూ మండల కార్యవర్గ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు ఈ సమావేశానికి హాజరవ్వగా ఆయన సమక్షంలో మండల నూతన కార్యవర్గం ఏర్పాటైంది. మండల పీఆర్టీయూ అధ్యక్షునిగా పూర్ణ, ప్రధాన కార్యదర్శిగా జి.సీతారాంలతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ నూతన పీఆర్సీని వెంటనే అమలుచేయాలని, సీపీఎస్ను రద్దు చేయాలని, డీఏలు వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, ఏడుకొండలు, ఆనందరావు, రామస్వామి, దశ్రు, భూక్యా శంకర్, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రవీందర్, కష్ణ, శ్రీదేవి, జయసుధ, స్వరూప భవానీ, వసంత, ఆదిలక్ష్మి, వెంకటనరసమ్మ, నాగమణి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

విద్వేశాలులేని సమాజ నిర్మాణం కోసం సమిష్టిగా కృషి చేద్దాం

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా
- ఘనంగా మిలాద్-ఉన్-నభి జులూస్ నిర్వహించిన ముస్లిం సోదరులు

నవతెలంగాణ-కొత్తగూడెం



శాంతి, సౌభ్రాతృత్వంతో కూడిన మార్గంలో పయనించి శాంతిని నెలకొల్పేందుకు మహమ్మద్ ప్రభక్త బోధనలు ఎంతగానో దోహదపడతాయని, తద్వారా విద్వేశాలు లేని నిర్మించుకోవచ్చని, అందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా అన్నారు. మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజైన మిలాద్-ఉన్-నభి పండుగను పురస్కరించుకొని శుక్రవారం కొత్తగూడెం ఆర్టీసీ పాత డిపో మజీద్ నుంచి రైల్వే స్టేషన్, బస్టాండు మీదుగా రైల్వేస్టేషన్ వరకు, రామవరం మదీనా మజీద్ నుంచి రామవరం సెంటర్ వరకు వేర్వేరుగా జూలూస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు ముస్లీం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం వారు మాట్లాడారు. శ్రమ జీవికి తన చెమటచుక్క ఆరక ముందే తన కష్టార్జితాన్ని అందించాలని మహ్మద్ ప్రవక్త సూచనను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ సంఘాల రాష్ట్ర నాయకులు, షాదీఖానా, ఉర్దూఘం ఆరాధ్యక్షులు నయీమ్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే సమగ్రంగా నిర్వహించాలి

నవతెలంగాణ - బోనకల్

ఇంటింటి సర్వేను సమగ్రంగా నిర్వహించాలని డిప్యూటీ కలెక్టర్ ప్రసూనాంబ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని కలకోట గ్రామంలో జరుగుతున్న ఇంటింటి సర్వేను శుక్రవారం ఆమె ఖమ్మం ఆర్డిఓ గుంటుపల్లి గణేష్‌తో కలిసి పరిశీలించారు. సిబ్బంది ఇంటింటి సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటరు జాబితాలో మృతి చెందిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లను తొలగించాలని ఆదేశించారు. అర్హత కలిగిన వారికి ఓటు నమోదు చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితులలోనూ ఓటరు జాబితాలో అక్రమాలు గాని అసమగ్రంగా సర్వే కాని చేయవద్దని సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట మండల తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్, గిర్దావర్లు గుగులోతు లక్ష్మణ్, చీరల రమాదేవి, అంగనవాడి టీచర్ షేక్ యాకూబ్ బి తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

నవతెలంగాణ-వేంసూరు

మండల పరిధిలోని చౌడవరం తండా సమీపంలో గుగులోతు నాగమణి రోడ్డుపై వస్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం నుండి మెడలో బంగారు గొలుసు లాక్కొని వెళ్లారు. దీంతో మండలంలో చైన్ స్నాచర్స్ భయంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఎస్సై వీరప్రసాద్‌ను వివరణ కోరగా సోలార్ కంపెనీ సమీపంలో గుగులోతు నాగమణికి చెందిన రూ.60 వేల విలువగల బంగారపు గొలుసు దొంగలించారని కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామని తెలిపారు. సరిహద్దు ప్రాంతాలలో నిఘా ఏర్పాటు చేసి నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బ్యాగ్స్, నోట్ బుక్స్ పంపిణీ

నవతెలంగాణ-చింతకాని

చిన్నమండవ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ వారు బుక్స్, బ్యాగులు, పలకలు శుక్రవారం తహసీల్దార్ కే.అనంతరాజు చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనంతరాజు మాట్లాడుతూ.. గ్రేస్ సర్వీస్ సొసైటీ వారిని అభినందించారు. రాబోయే రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని తాసిల్దార్ కోరారు. గ్రేస్ సర్వీస్ సొసైటీ వారిని తాసిల్దార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెట్టి రాంబాబు, వసంత పుల్లారావు, వీరభద్రం, సీజీఎం సూపర్వైజర్ ఎర్నెస్ట్ పాల్, చిన్న మండవ పాస్టర్ తంగిరాల దానియేలు బాబు, అంజయ్య పాల్గొన్నారు. వీటిని అందజేసిన బిషప్ జాకబ్‌కు పాఠశాల యాజమాన్యం, గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

విజయం కన్నా ప్రయత్నం గొప్పది

- ప్రిన్సిపల్ క్రాంతికుమార్

నవతెలంగాణ-కొత్తగూడెం



క్రీడల్లో విజయం కన్నా ప్రయత్నం చాలా గొప్పదని ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాల ప్రిన్సిపల్ క్రాంతి కుమార్ అన్నారు. శుక్రవారం చుంచుపల్లి, కొత్తగూడెం మండలం స్థాయి పాఠశాలల క్రీడా ఎంపికలు రామవరం, ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాల క్రీడా పాఠశాల ఆవరణం ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా తొలిరోజు బాలికల ఎంపికల ప్రక్రియ ప్రారంభిస్తూ ఎస్ఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.క్రాంతి కుమార్ పాల్గొని మాట్లాడుతూ క్రీడల్లో విజయం సాధించడం కన్న పోటీల్లో పాల్గొని చక్కని ప్రదర్శన కనపర్చడం చాలా గొప్ప విషయమన్నారు. అనంతరం అండర్ 14, 17 బాల, బాలికల వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, అథ్లెటిక్స్‌ల ఎంపికలను నిర్వహించారు. శనివారం చుంచుపల్లి, కొత్తగూడెంకు చెందిన మాండలాలకు చెందిన బాలురకు ఎంపికలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి జుమ్కిలాల్ తెలిపారు. ఈ కార్యక్రమాలో వివిధ పారిశాలలకు చెందిన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లెబర్ కోడ్ ప్రతులను దహనం చేయండి

- 23న బ్లాక్ డే....
- జయప్రదం చేయండి
- కార్మికసంఘాల పిలుపు

నవతెలంగాణ-కొత్తగూడెం



కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 23వ తారీకు రాష్ట్ర వ్యాప్తంగా లేబర్ కోడ్‌ల ప్రతులను దగ్ధం చేయాలని కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ పిలుపు నిచ్చింది. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సమావేశమైన కార్మిక సంఘాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. 23వ తేదీన కొత్తగూడెంలో కేంద్ర కార్మిక శాఖ కార్యాలయం ఎదుట, భద్రాచలం, మణుగూరు, ఇల్లందు ఏఎల్ఓ కార్యాలయాల ముందు, మిగిలిన మండలాలలో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేసి లేబర్ కోడ్ ప్రజలను దగ్గం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే.రమేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు జలీల్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్, ఇఫ్టూ నాయకులు ముధుసుదన్ రెడ్డి, ఇఫ్టూ నాయకులు సారంగపాణి, ఐఎఫ్‌టియూ నాయకులు సురేష్ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను 2021 సెప్టెంబర్ 23న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రోజును బ్లాక్ డే గా జరిపి కార్మిక పోరాటాలను ఉధృతం చేయాలని కోరారు. లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులకు ఉరితాళ్ళు అని పెర్కొన్నారు. పెట్టుబడిదారులకు, యాజమాన్యాలకు లాభాలు సమకూర్చటం కోసమే లేబర్ కోడ్‌లు బిజెపి తెచ్చిందని భాస్కర్ తెలిపారు. సమస్యల ఐక్య పోరాటాల ద్వారా కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక కార్పొరేట్ మతోన్మాద అనుకూల విధానాలను ప్రతిఘటించాలి విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్మిక సంఘాల సంయుక్త ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మచారి, జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న, ఇఫ్టూ నాయకులు ప్రసాద్, చంద్రశేఖర్, మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు. సమావేశ ప్రారంభంలో సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య ఐఎఫ్‌టీయూ నాయకులు ఎల్.విశ్వనాధం మరణం పట్ల సంతాపం ప్రకటించి నాయకులు మౌనం పాటించారు.

జిల్లా క్రీడాకారుల పతకాల పంట

- రాష్ట్ర జానియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ను 15 పతకాల గెలుపు

నవతెలంగాణ-కొత్తగూడెం



తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్, ఉస్మానియా యూనివర్శిటీ స్టేడియంలో ఈ నెల 19, 20వ తేదీలలో జరిగిన 10వ రాష్ట్ర జానియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు 30 మంది పాల్గొని మొత్తం15 పతకాలు సాధించారు. ఇందులో 9 బంగారు పతకాలు, 5 రజిత పతకాలు, 1 కాంశ్య పతకాలు, అంతేకాక 59 పాయింట్లుతో ఓవరాల్ చాంపియన్‌షిప్, బాలికల 14, 16, 20 సంవత్సరాల విభాగాలలో చాంపియన్‌షిప్ సాధించరాని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి కె.మహిధర్ తెలిపారు. విజేతల వివరాలు భద్రచలంకు చెందిన ఎస్‌కె.అమ్రీన్ జవెలిన్ త్రో బంగారు పతకం, సిహెచ్.వేదశ్రీ కిడ్స్ జవెలిన్, ట్రైయాతలాన్‌లో రెండు బంగారు పతకలు, ఎం.శ్రీవిద్య దొర 80 మీటర్ల హర్డిల్స్‌లో బంగారు పతకం, కొత్తగూడెంకు చెందిన జరుపుల దీక్షిత్ షాట్ పుట్ బంగారు పతకమ, ఎం.పవన్ హై జంపులో బంగారు పతకం, ఏ.వందన డిస్కస్ త్రోలో బంగారు పతకం, ఎం.సంగీత త్రీ కిలోమీటర్ల రేస్ వాకింగ్‌లో బంగారు పతకం, పి.కరుణ హై జంప్‌లో బంగారు పతకం, పాల్వంచకు చెందిన ఎం.టబు 800 మీటర్ల పరుగుపందెంలో రజిత పతకం,1500 మీటర్ల పరుగుపందెంలో కాంశ్య పతకం, పి.ఉషారాణి 5 కిలోమీటర్ల పరుగుపందెంలో రజిత పతకం, కొత్తగూడెంకు చెందిన ఎం.సింధు 400 మీటర్ల హర్డిల్స్‌లో రజిత పతకం, ఎం.ఇందు 3000 మీటర్ల పరుగుపందెంలో రజిత పతకం, భద్రచలంకు చెందిన టి.శ్రీతేజ 100 మీటర్ల హర్డిల్స్‌లో రజిత పతకం గెలుపొందారని తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు గెలుపొందిన క్రీడాకారులును, చీఫ్ కోచ్ పి.నాగేందర్, కోచ్‌లు ఎం.నరేశ్, డి.మల్లికార్జునరావు, జన్ను గిరిప్రసాద, ఎం.కృష్ణలను జిల్లా క్రీడల అధికారి ఎం.పరంధామరెడ్డి, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరి కె.సారంగపాణి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు గొట్టపు రాధాకృష్ణ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి రాజేంద్ర ప్రసాద్‌లు అభినందించారు.

ఎస్ఐగా యయాతి రాజు విధుల్లో చేరిక

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఇటీవల జరిగిన పోలీస్ శాఖ సాదారణ బదిలీల్లో ఖమ్మం ఒన్ టౌన్ ఎస్సైగా పని చేస్తున్న యయాతి రాజు అశ్వారావుపేట ఎస్సైగా నియమితులు అయ్యారు. ఆయన శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇక్కడ ఎస్సైగా పని చేసిన శ్రీరాముల శ్రీనివాస్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. నాటి నుంచి ఎస్సై పోస్టు ఖాళీగా ఉండగా, ఉన్నతాధికారులు యయాతి రాజును నియమించారు. దీంతో ఆయన విధుల్లో చేరారు. 2020 బ్యాచ్‌కు చెందిన యయాతి రాజు వరంగల్ జిల్లా నల్లబెల్లి వాసి. ఈయన మొదటి పోస్టింగ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కొణిజర్ల, తర్వాత ఖమ్మం ఒన్ టౌన్ ప్రస్తుతం అశ్వారావుపేటలో ఎస్‌హెచ్‌ఓ బాధ్యతలు చేపట్టిన ఆయనను అదనపు ఎస్సై శివరామకృష్ణ, ఏఎస్ఐ యాకూబ్ అలీతో పాటు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై బ్యాంకర్లు దృష్టి సారించాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం



ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై బ్యాంకర్లు దృష్టి సారించి, వాటిని విజయవంతం చేసేందుకు సహకరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి బ్యాంకర్లతో డీసీసీ, డిఎల్ఆర్‌సి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ రుణమాఫీ జరిగిన రైతులకు సదరు ఫలితం దక్కేలా రుణాలు రెన్యువల్ చేయడం, వరద బాధితులకు వస్తున్న సహాయ సొమ్ము లావాదేవీలు త్వరితగతిన పూర్తి చేయడంలో బ్యాంకర్ల పని తీరును కలెక్టర్ ప్రశంసించారు. బ్యాంకర్ల సహకారంతో వరద బాధితులకు ప్రభుత్వ సహాయం త్వరగా అందించామని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు బ్యాంకర్లు సహకరించాలని అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద యూనిట్ల గ్రౌండింగ్ విజయవంతంగా చేశామని, ప్రస్తుతం గ్రౌండ్ చేసిన యూనిట్లకు అవసరమైన సహాయ సహకారాలు, సలహాలు, ఆర్థిక అక్షరాస్యత అందించాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద యూనిట్లు ఏర్పాటు చేసిన స్వశక్తి మహిళా సంఘాలతో బ్యాంకర్లు అవగాహన కార్యక్రమం చేపట్టి ఖాతాల నిర్వహణ, ప్రభుత్వ పన్నులు, వ్యాపారం నిర్వహణ, విస్తరణకు చేయాల్సిన కృషి, మొదలగు వాటిపై ట్రెయినర్లు వివరించేలా చూడాలని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ రుణమాఫీకి సంబంధించి సాంకేతికత సమస్యలు ఉన్న బ్యాంకు ఖాతాల వివరాలను సంబంధిత బ్యాంకు మేనేజర్‌లు అప్‌డేట్ చేయాలని అన్నారు. రుణమాఫీ పూర్తయిన రైతులకు పంట రుణాలు జారీపై దృష్టి సారించాలన్నారు.

ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలి

జిల్లాలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2024-25 ధాన్యం పంట పక్కా ప్రణాళికతో కొనుగోలు చేసేందుకు అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై అదనపు కలెక్టర్‌లు డాక్టర్ పి. శ్రీజ, డి.మధుసూదన్ నాయక్‌లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 6 లక్షల 77 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా ఉందని, ఇందులో 4 లక్షల 29 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని, వీటి కొనుగోలుకు 236 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అంచనా వేశామని తెలిపారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తతంగా అవగాహన కల్పించాలని, నాణ్యమైన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలన్నారు.

ఏచూరి స్మృతిలో......

ఎస్ఎఫ్ఐ అఖిలభారత మాజీ అధ్యక్షుడు సీతారాం ఏచూరి జీవితం ఈనాటి తరానికి ఆదర్శమని ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎస్. వీరయ్య అన్నారు. అధ్యయనం పోరాటం అన్న సీతారాం స్ఫూర్తితో భావి పౌరులను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. నిరర్థకమైన జీవితాన్ని అర్థవంతమైనదిగా మలుచుకుంటూ చచ్చేంత వరకు ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న ఏచూరి మాటల స్ఫూర్తితో ముందుకు సాగడమే మన కర్తవ్యం అని ఉద్బోధించారు. ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక ఆధ్వర్యంలో ఖమ్మంలోని మంచికంటి హాల్లో వేదిక కన్వీనర్ ఎం. సుబ్బారావు అధ్యక్షతన శుక్రవారం రాత్రి ఏచూరి సంస్మరణ సభ జరిగింది. ఈ సంస్మరణ సభకు ముందు సీతారాం చిత్రపటానికి వీరయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఏచూరి మృతికి సంతాప సూచికగా సభ ప్రారంభానికి ముందు రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు.











ఆరోగ్యశ్రీ సిబ్బంది వేతనాలు పెంచాలి

- ఆరోగ్యమిత్రలకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలి
- సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్యాణ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు వై.విక్రమ్

నవతెలంగాణ- ఖమ్మం

ఆరోగ్యశ్రీ సిబ్బంది వేతనాల పెంచాలని, ఆరోగ్యమిత్రలకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కల్యాణం వేంకటేశ్వర రావు, జిల్లా ఉపాధ్యక్షులు వై.విక్రమ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం కలెక్టర్ వద్ద ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఆరోగ్యశ్రీ పథకం ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, ఆయుష్మాన్ భారత్, జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ పథకం, ప్రభుత్వ హాస్పిటల్, ప్రైవేట్ హాస్పిటల్ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎంబిఎ, పి.జి., డిగ్రీ అర్హతతో సుమారు 900 మంది సిబ్బంది రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కేటగిరీలలో జిల్లా మేనేజర్, టీమ్ లీడర్, ఆఫీస్ అసోసియేట్, ఆరోగ్యమిత్రలుగా 24 గంటలు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రజలకు ఆరోగ్యశ్రీ సేవలు అత్యంత చేరువ చేస్తూ 2007 నుండి గత 16 సంవత్సరాలుగా ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారని, ఈ మధ్యనే లక్షల మందికి ఆపరేషన్స్ ఈ పథకంలో జరిగాయని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభినందించిందని, రాష్ట్రంలో ఇప్పటివరకు ఎన్నో అవార్డులు సాధించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచి దేశవ్యాప్తంగా మంచి పేరు తీసుకురావడంలో ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ జిల్లా అధ్యక్షురాలు ఎం. శ్రీదేవి, ఉపాధ్యక్షులు మజీద్ మాట్లాడుతూ ఆరోగ్య మిత్రల జీతభత్యాలు చాలా తక్కువగా ఉన్నాయని, వీరిలో ఆరోగ్య మిత్రలు 2007 నుండి చేస్తున్న ఉద్యోగం చేస్తున్నారని, 17 సంవత్సరాలు సర్వీస్ చేసినా గత టిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, గతంలో ట్రస్ట్ యాజమాన్యం ఇచ్చిన హామీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత, యూనియన్ పరంగా జీతాలు పెంచాలని కోరుతూ 2023 డిసెంబర్ 8న ముఖ్యమంత్రిని కలిసి సమస్యను వివరించారని గుర్తు చేశారు. ఫిబ్రవరి 3న ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ సిఇఓకి సమస్యలను చెప్పడం జరిగిందని, జూన్ 24న వైద్యారోగ్య శాఖామంత్రిని కలిసి సమస్య వివరించామని తెలిపారు. మే 10న ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కని కలిసి సమస్యలను తెలియజేయడం జరిగిందన్నారు. అయినప్పటికి న్యాయం జరగడం లేదని అన్నారు. ధర్నాకు తెలంగాణ రైతు సంఘం మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ ఆరోగ్య శ్రీ కోశాధికారి ప్రసన్న, కృష్ణవేణి, దుర్గాప్రసాద్, రమ కుమారి, శ్రీలత, మరియు ఖమ్మం జిల్లా ఆరోగ్య మిత్రులు అందరూ పాల్గొన్నారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు)జిల్లా అధ్యక్షులు జాల ఏడుకొండలు, నాయకులు రుక్మిణి, భాస్కర్, రాఘవ, పున్నారావు, శ్రీనివాసరావు, మోహన్, పవిత్ర, తదితరులు పాల్గొన్నారు.

కెనాల్ బెడ్ పనులు పూర్తి చేసి నీళ్ళందించాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-కూసుమంచి

యుద్ధ ప్రాతిపదికన పాలేరు ఎడమ కాల్వ కెనాల్ బెడ్ పనులు రాత్రి వరకు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందజేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం పాలేరు ఎడమ కాల్వ కెనాల్ బెడ్ పనులు జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. కెనాల్ బెడ్ 6 మీటర్ ల మేరకు పనులు చేయాల్సి ఉండగా, మూడు మీటర్ లకు పైగా పనులు పూర్తి అయినట్లు ఇరిగేషన్ సిఇ విద్యాసాగర్ కలెక్టర్ కు తెలిపారు. కెనాల్ బెడ్ పనులు రాత్రి వరకు పూర్తి చేసి వెంటనే రైతులకు సాగునీరు వదలాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ అనన్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఢిల్లీ సీఎంగా అతిశి

- ఐదుగురు మంత్రులు సహా ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత, ఢిల్లీ ముఖ్యమంత్రిగా నియమితులైన అతిశి మర్లెనా నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అలాగే ఆమెతో పాటు ఐదుగురు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ముఖ్యమంత్రిగా అతిశి, మంత్రులుగా సౌరభ్ భరద్వాజ్, గోపాల్ రాయ్, ఇమ్రాన్ హుస్సేన్, కైలాష్ గహ్లోట్, ముఖేష్ అహ్లావత్‌లు ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు లెఫ్టినెంట్ గవర్నర్ అధికారక నివాస అధికారి వెల్లడించారు. అయితే, ఏడో మంత్రి ఎవరనేది అస్పష్టంగానే ఉందని తెలిపారు. ఆప్ నేత ఒక క్యాబినెట్ స్థానం ఖాళీగా ఉంటుందని ధృవీకరించారని, దాని వెనుక కారణాలను ఆయన వెల్లడించలేదన్నారు.

అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న ఆప్ నేతలు గోపాల్ రాయ్, కైలాష్ గెహ్లాట్, సౌరభ్ భరద్వాజ్, ఇమ్రాన్ హుస్సేన్‌లను కొనసాగించడంతో పాటు కొత్తగా కొత్త సుల్తాన్‌పూర్ మజ్రా ఎమ్మెల్యే ముఖేష్ అహ్లావత్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించారు. ఢిల్లీ కేబినెట్‌లో ఏకైక మహిళా మంత్రి అతిశి మర్లెనాను ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆప్ శాసనసభ్యులు సెప్టెంబర్ 17న ఏకగ్రీవంగా ఎన్నుకున్నది తెలిసిందే.

ఆప్ ప్రభుత్వంలో ఎక్కువ శాఖలను కలిగి ఉన్న కల్కాజీ ఎమ్మెల్యే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు కేవలం నెలరోజులు మిగిలి ఉండగానే పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు బెయిల్‌పై కేజ్రీవాల్ తన రాజీనామాను ప్రకటించిన తరువాత ఢిల్లీ ప్రభుత్వానికి నాయకత్వం వహించడానికి అనేక పేర్లు ప్రతిపాదనలోకి వచ్చినప్పటికీ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా అరెస్టుల తరువాత పార్టీలో ప్రధాన పాత్ర పోషించిన అతిశికి సీఎం పదవి దక్కింది.మరోవైపు ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్‌కు ప్రభుత్వ వసతిని అభ్యర్థిస్తూ సంబంధిత మంత్రిత్వ శాఖకు లేఖ రాస్తామని ఆప్ రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా విలేకరుల సమావేశంలో ప్రకటించారు. కేజ్రీవాల్ తన సూత్రాల ఆధారంగా రాజీనామా చేయాలని ఎంచుకున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే అధికారిక నివాసాన్ని ఖాళీ చేయనున్నారని తెలిపారు. ఆయనకు ఎటువంటి ఆస్తి, సొంత ఇల్లు లేదని, ఒక జాతీయ పార్టీ కన్వీనర్‌గా ఆయన ప్రభుత్వ వసతికి అర్హులని, దానిని అందించాలని కేంద్రాన్ని కోరుతున్నామని ఆయన వెల్లడించారు.

భారత్‌లో తక్కువ నేరనిరూపణ రేటుపై ఎఫ్ఏటీఎఫ్ ఆందోళన



న్యూఢిల్లీ : మనీలాండరింగ్ కేసుల్లో పెండింగ్ ట్రయల్స్ సంఖ్యను తగ్గించాలని భారత్‌ను ప్యారిస్ కేంద్రంగా పని చేసే ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) కోరింది. భారత్‌లో తక్కువ నేర నిరూపణ రేటుపై ఆందోళన వ్యక్తం చేసింది. మనీలాండరింగ్, టెర్రర్ ఫైనాన్సింగ్ వాచ్‌డాగ్ అయిన ఎఫ్ఏటీఎఫ్ తన నివేదికను ఇటీవల విడుదల చేసింది. భారత్ తప్పనిసరిగా నేరారోపణ ఆధారిత జప్తులను పెంచాలని వివరించింది.

ఎఫ్ఏటీఎఫ్ నివేదిక సమాచారం ప్రకారం.. 2019 ఆర్థిక సంవత్సరం నుంచి 2023 ఆర్థిక సంవత్సరం వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నేర నిరూపణ లేని జప్తులను రూ.16,497 కోట్ల మేర చేసింది. నేర నిరూపణ ఆధారంగా జరిగిన జప్తులు రూ.39 కోట్లుగా ఉన్నది. ఐదేండ్ల కాలంలో ఈడీ 4163 దర్యాప్తులను ప్రారంభించింది. ఇందులో 28 కేసులు శిక్షతో ముగిశాయి. 132 కేసుల్లో తదుపరి విచారణ జరపొద్దని ఈడీ నిర్ణయించింది. విచారణల సంఖ్య పెరుగుతున్నది కానీ ప్రాసిక్యూషన్ ఫిర్యాదుల సంఖ్య వేగంగా లేదు. నేర నిరూపణ రేటు పెంచటానికి ఈడీ, ప్రత్యేక న్యాయస్థానాలకు వనరులను మెరుగుపర్చాలని ఎఫ్ఏటీఎఫ్ సూచించింది.

వృద్ధురాలిపై సామూహిక లైంగికదాడి

- మద్యం మత్తులో ముగ్గురు యువకుల ఘాతుకం



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో దారుణ ఘటన జరిగింది. మద్యం మత్తులో ముగ్గురు యువకులు వృద్ధురాలిపై సామూహిక లైంగికదాడికి ఒడిగట్టారు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మండలం బండమాదారం గ్రామంలో ఓ వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. గురువారం రాత్రి ఆమె ఇంటికి వెంకట్‌రావుతో పాటు మరో ఇద్దరు యువకులు వెళ్లారు. అక్కడ ఆమెతో పాటే వారు మద్యం సేవించారు. అనంతరం మద్యం మత్తులో వృద్ధురాలిపై లైంగిక దాడి చేశారు. శుక్రవారం ఉదయం విషయం వెలుగులోకి రాగా.. గ్రామస్తులు వెంకట్‌రావును పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న సీఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది వృద్ధురాలు ఫిర్యాదును తీసుకున్నారు. ఆమెను వైద్య పరీక్షల నిమిత్తం మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకట్‌రావును అదుపులోకి తీసుకొని మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇక హైడ్రా దూకుడే

- ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంటు కోసం 12 మందితో కమిటీ
- ఖరీఫ్ సీజన్ నుంచే సన్నాలకు రూ.500 బోనస్
- ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గానికి అదనంగా రూ.4637 కోట్లు
- వచ్చే నెల నుంచి కొత్త రేషన్‌కార్డులు...జనవరి నుంచి అన్ని కార్డులకు సన్నబియ్యం
- 51 గ్రామాలు సెమీ అర్బన్‌లో విలీనం : రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు



చట్టబద్ధత, సిబ్బంది కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైడ్రా ఇక ముందు మరింత దూకుడుగా వ్యవహరించనుంది. దానికి చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. అందుకోసం 169 మంది అధికారులను, వివిధ విభాగాల నుంచి 946 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కేటాయించింది. చెరువులు, రిజర్వాయర్లు, కుంటలు, నాలాలను రక్షించేందుకు హైడ్రాకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. దీంతోపాటు రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగానికి సంబంధించిన అలాట్ మెంటుపై ప్రత్యేక దృష్టి సారించింది. భూసేకరణ కోసం ఆయా కీలక శాఖలకు సంబంధించిన 12 మంది ఉన్నతాధి కారులతో ప్రత్యేక కమిటీని నియమించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశమైంది. ఇందులో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ వివరాలను సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రులు ఎన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి మీడియాకు వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల ఉన్న 51 గ్రామాలను సెమీ అర్బన్‌లో విలీనం చేస్తూ క్యాబినెట్ నిర్ణయించిందని చెప్పారు. వీటితోపాటు పోలీసు ఆరోగ్య భద్రతా కార్డులను ఎస్‌పీఎల్ కింద మార్చినట్టు తెలిపారు. మనోహరాబాద్‌లో మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కు కోసం భూమిని బదిలీ చేసినట్టు చెప్పారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో ఇండస్ట్రీయల్ పార్కు కోసం 88 ఎకరాలు, ములుగు జిల్లాలోని ఏటూరు నాగారం ఫైర్‌స్టేషన్లకు భూమిని కేటాయించిందన్నారు. ఎనిమిది కొత్త మెడికల్ కళాశాలలకు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది కోసం మూడువేల మంది సిబ్బందిని కేటాయించినట్టు తెలిపారు. నోటిఫికేషన్ ద్వారా వారిని నియమిస్తామన్నారు. కోస్గి ఇంజినీరింగ్ కళాశాల, హకీంపేటకు జూనియర్ కళాశాల మంజూరు చేసినట్టు తెలిపారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం నల్లగొండ జిల్లా ప్రజల దశాబ్దాల కల అని చెప్పారు. ఆ ప్రాజెక్టు సాధన కోసం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చాలా కాలంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ.4636 కోట్లు అదనంగా కేటాయించిందన్నారు. రెండేండ్లలో ప్రాజెక్టును పూర్తి చేస్తామని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీ నుంచి గ్రావిటీ ద్వారా నాలుగు లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నదని చెప్పారు. డిండి ప్రాజెక్టు అనుమతుల కోసం ప్రత్యేకంగా ఒక అధికారిని కేటాయించినట్టు తెలిపారు. ఖరీఫ్ సీజన్ నుంచే సన్నాలకు రూ.500 బోనస్ కల్పిస్తామన్నారు. ఈసారి రికార్డు స్థాయిలో 4.40 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు, సన్న వడ్లు వస్తాయని అంచనా వేసినట్టు తెలిపారు. వచ్చే నెల నుంచి కొత్త రేషన్‌కార్డులు ఇస్తామన్నారు. అన్ని రకాల రేషన్‌కార్డులకు సన్న బియ్యం ఇస్తామని చెప్పారు. తాను భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న ప్రస్తుత సమయంలో ఎస్-ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి కాబోతుండటం సంతోషాన్ని కలిగిస్తున్నదని ఉత్తమ్ ఈ సందర్భంగా చెప్పారు. బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం వల్లే ఎస్ఎల్‌బీసీ ముందుకు సాగలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేసుకోవడం ఆనందాన్ని ఇస్తున్నదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. నల్లగొండ జిల్లాలో ఇంకా ఫ్లోరైడ్ సమస్య ఉందనీ, ఈ ప్రాజెక్టు పూర్తయితే అది పూర్తిగా పోతుందని చెప్పారు.

వర్సిటీలకు పేర్లు ఖరారు

- చిట్యాల ఐలమ్మ మహిళా యూనివర్సిటీగా మార్పు (కోఠి మహిళా కళాశాలకు)
- సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం (పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం)
- కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ

గత ప్రభుత్వ బాటలోనే.. భూ సేకరణ

- 2017 సవరణ చట్టాన్నే అమలుచేస్తున్న కాంగ్రెస్
- ఎన్నికల ముందు 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేస్తామని హామీ
- కొడంగల్, యాచారంలో ఫార్మాసిటీ కోసం భూ సేకరణ
- రైతులకు నోటీసులు జారీ, ఆందోళనలో రైతులు
- ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రైతుల వినతి

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో ప్రధాన కారణం.. 2013 భూ సేకరణ చట్టం అమలు చేస్తామని ఇచ్చిన హామీ. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టానికి తూట్లు పొడిచి 2017లో సవరణలు చేసి రైతులను ఆగం జేసింది. ఇదే విషయంపై కాంగ్రెస్ తీవ్ర ఆందోళనలు చేసింది. తాము అధికారంలోకి వస్తే మళ్లీ యథావిధిగా 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కూడా బీఆర్ఎస్ అమలు చేసిన చట్టాన్నే ప్రస్తుతం అమలు చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ గతంలో తమకు ఇచ్చిన హామీ మేరకు 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేసి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



రాష్ట్రంలో గత పదేండ్ల కాలంలో ప్రభుత్వం అత్యధికంగా భూ సేకరణ చేపట్టింది ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే. ఫార్మాసిటీ పేరుతో గత ప్రభుత్వం సుమారు 19,333 ఎకరాలు భూ సేకరణ చేసింది. ఇందులో సుమారు 13,500 ఎకరాలకు పరిహారం చెల్లించింది. ఆ భూములను ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుంది. మరో 5,833 ఎకరాలకు సంబంధించి కేసు కోర్టులో ఉంది. ఇదిలా ఉండగా ప్రస్తుత ప్రభుత్వం వికారాబాద్ జిల్లాలో ఫార్మాసిటీకి సంబంధించి మరో మూడు వేల ఎకరాల భూ సేకరణ చేసేందుకు రైతులకు నోటీసులు జారీ చేసింది.

2013 భూసేకరణ చట్టంలో ఏముంది..?

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వాలు చేపడుతున్న భూ సేకరణలో భాగంగా.. ఆ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు, రైతు కూలీలు, సబ్బండ వర్గాలకు పునరావాసం కల్పించాలి. దీన్ని దృష్టిలో పెట్టుకుని నాటి యూపీఏ ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టంలో భూ సేకరణకు విధి విధానాలను స్పష్టంగా పొందుపరిచింది. బహుళ పంటలు సాగు అయ్యే భూములను రైతుల నుంచి స్వాధీనం చేసుకోవద్దని స్పష్టం చేసింది. ఆ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రతి కుటుంబానికీ పునరావాసం కల్పించాలని చెప్పింది. పరిహారం విషయంలో కూడా మార్కెట్ ధరకు మూడు రెట్లు ఇవ్వాలని 2013 భూ సేకరణ చట్టంలో ఉంది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టాన్ని సవరణ చేస్తూ 2017 భూ సేకరణ చట్టాన్ని తీసుకువచ్చింది. రైతులకు అనుకూలంగా ఉన్న సెక్షన్లను తొలగించి తమకు అనుకూలంగా మార్చుకుంది. దాంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

అటకెక్కిన కాంగ్రెస్ హామీ..

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన చట్టాన్ని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ చట్టాన్నే కొనసాగిస్తున్నారు. రైతులకు అందాల్సిన ఫలాలపై దృష్టి సారించకుండా తమకు స్వలాభం జరిగితే చాలనే విధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లాలోని యాచారం, కందుకూరు మండలాల పరిధిలో భూ సేకరణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూనుకుంది. అయితే 2013 భూ సేకరణ చట్టాన్ని సవరణ చేస్తూ రైతుల హక్కులను కాలరాసింది. దీన్ని వ్యతిరేకించిన నాటి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎందుకు ఆ చట్టాన్ని సవరణ చేయడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలో ప్రభుత్వం ఫార్మాసిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీని కోసం సుమారు 3వేల ఎకరాల భూమిని సేకరించాలని భావిస్తోంది. ఇందుకు రైతులకు 2017 భూ సేకరణ చట్టం ప్రకారం నోటీసులు జారీ చేసింది. ఇప్పుడు దీనిపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు ఇలా చేయడం ఏంటనీ రైతులు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 2013 చట్టం ప్రకారమే భూ సేకరణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఏచూరి ఆశయ సాధనే కర్తవ్యం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎఫ్ఐ అఖిల భారత మాజీ అధ్యక్షులు సీతారాం ఏచూరి జీవితం నేటి తరానికి ఆదర్శమని ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఎస్. వీరయ్య అన్నారు. అధ్యయనం-పోరాటం అన్న సీతారాం స్ఫూర్తితో భావిపౌరులను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక ఆధ్వర్యంలో ఖమ్మంలోని మంచికంటి హాల్‌లో వేదిక కన్వీనర్ ఎం.సుబ్బారావు అధ్యక్షతన శుక్రవారం రాత్రి ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి వీరయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఏచూరి మృతికి సంతాప సూచికగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి ఇచ్చిన 'అధ్యయనం- పోరాటం' నినాదం ఈనాటి విద్యార్థి ఉద్యమానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. 'చదువుతూ పోరాడు-చదువుకై పోరాడు' నినాదంతో పాటు 'అందరికీ విద్య-అందరికీ ఉద్యోగం' లక్ష్యంతో నినాదం అన్ని వర్గాల మన్ననలు అందుకుందన్నారు. విద్యార్థి సమ్మెలపై ఏచూరి చేసిన దిశా నిర్దేశం విద్యార్థి సంఘాలకు మార్గదర్శకంగా నిలిచిందని తెలిపారు. వరుసగా మూడుసార్లు ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) ప్రెసిడెంట్‌గా ఎన్నికైన ఏకైక నాయకులు సీతారాం ఏచూరి మాత్రమేనని చెప్పారు. యూనివర్సిటీ మొదలు నేటి వరకూ ఏచూరి, ప్రకాష్ కరత్ ద్వయం బంధం విడదీయ లేనిదన్నారు. ఏచూరి తన తెలివితేటలను అట్టడుగు వర్గాల జీవితాల్లో మార్పు కోసం వినియోగించారని గుర్తు చేశారు. సుందరయ్య చెప్పినట్టుగా భారతదేశ తత్వశాస్త్రాన్ని అధ్యయనం చేసి వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా కమ్యూనిస్టులకు దిశానిర్దేశం చేశారన్నారు. మహాభారతం, రామాయణం అధ్యయనం చేసి ఇతిహాసాలను ఉదాహరణలుగా తీసుకొని మతోన్మాదాన్ని తిప్పికొట్టిన కమ్యూనిస్టు సీతారాం ఏచూరి అని కొనియాడారు. రాజకీయ, రాష్ట్ర, ఆల్ ఇండియా నాయకులంటే ఎలా ఉండాలో నిరూపించిన నేత సీతారాం ఏచూరి అని కొనియాడారు.

ప్రపంచీకరణ, సరళీకరణ ఆర్థిక విధానాల ప్రభావంతో మేధావులు తమ మేధస్సును బూర్జువా సిద్ధాంతాన్ని బలోపేతం చేసేందుకు వినియోగిస్తున్నారని సీతారాం ఏచూరి చెప్పిన మాటలను ఉటంకించారు. ప్రజా అసంతృప్తిని మతోన్మాద, ఛాందస భావాల వైపు మళ్లించి పెట్టుబడిదారులు తమ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నారని తెలిపారు. సంపన్న కుటుంబంలో పుట్టిన అపర మేధావి అయిన సీతారాం ఏచూరి తన తెలివితేటలను ఎర్రజెండా సిద్ధాంతం కోసం వినియోగించారని గుర్తు చేశారు. శ్రామికులను గుప్పిట్లో ఉంచుకునేందుకు అంబానీ, అదానీలు మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నారని తెలిపారు. కులం, మతం పెడధోరణులపై పోరాటమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. నిరర్థకమైన జీవితాన్ని అర్థవంతమైనదిగా మలుచుకొని.. చచ్చేంత వరకు ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న సీతారాం మాటల స్ఫూర్తితో ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులు భావి పౌరులను తీర్చిదిద్దేందుకు సమయాన్ని వెచ్చించాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థి అద్దంకి విప్లవ కుమార్ వందన సమర్పణతో సదస్సు ముగిసింది.

భవిష్యత్తు సవాళ్లకు ఐపీఎస్‌లు సిద్ధంగా ఉండాలి

- సైబర్, డిజిటల్ నేరాలపై సమగ్ర అవగాహన అవసరం
- మీ భుజస్కందాలపై భారత భవిష్యత్తు
- ఎన్‌పీఏలో యువ ఐపీఎస్‌ల దీక్షాంత్ పరేడ్‌లో : కేంద్ర సహాయ మంత్రి నిత్యానంద రాయ్ పిలుపు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

దేశ అంతర్గత భద్రతలో ఎదురయ్యే భవిష్యత్తు సవాళ్లను దీటుగా ఎదుర్కోవటానికి ఐపీఎస్ అధికారులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని కేంద్ర హెూం శాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ పిలుపునిచ్చారు. శుక్రవారం శివరాంపల్లిలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీ (ఎన్‌పీఏ)లో జరిగిన 76వ బ్యాచ్ ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారుల శిక్షణానంతర ముగింపు కవాతు నుంచి ఆయన గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ అంతర్గత వ్యవస్థను సుభిక్షంగా ఉంచే గురుతర బాధ్యత ఐపీఎస్ అధికారులపై ఉన్నదన్నారు.

దేశ ప్రతిష్టను కాపాడటంలో పోలీసు వ్యవస్థది కీలకపాత్ర అని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, ఉగ్రవాదులు, తీవ్రవాదుల పీచమణచటంలో పోలీసుల పాత్ర ఎనలేనిదనీ, సాంకేతిక నేరాలకు అనుగుణంగా పోలీసు వ్యవస్థ మరింతగా మెరుగుపడాలని అన్నారు. ఈ విషయంలో టెక్నాలజీని వాడాలని సూచించారు. దేశం అత్యున్నతంగా ఉండటానికి ఐపీఎస్‌లు పాటుపడాలని కోరారు. సామాన్యులు, పీడిత ప్రజల అభ్యున్నతి, వారి భద్రత కోసం ఐపీఎస్‌లు మరింత నిబద్ధతో కృషి చేయాలని కేంద్ర మంత్రి సూచించారు. మావోయిజం, టెర్రరిజంను అంతమొందించటంలో ఐపీఎస్ అధికారులు ఇప్పటికే సుశిక్షితులయ్యారని ఆయన అన్నారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని ఆయన సూచించారు. మావోయిస్టుల విషయంలో దేశవ్యాప్తంగా పోలీసు శాఖ ఇటీవల కాలంలో మంచి ఫలితాలను సాధించటంపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. సైబర్, డిజిటల్ నేరాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

దేశంలో వ్యవస్థీకృత నేరాలు పోలీసులకు సవాళ్లు విసురుతున్నాయనీ, వీటి నివారణలో పోలీసులు మరింతగా రాటుదేలాల్సిన అవసరం ఉన్నదని కేంద్ర మంత్రి తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందిగా మారిన పలు రకాల నేరాల విషయంలో మరింత పరిణతి సాధించాలని ఆయన కోరారు. మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ విషయంలో పోలీసులు పురోగతి సాధించాల్సిన అవసరమున్నదనీ, డ్రగ్స్‌ను సమూలంగా అంతం చేయాలని ఆయన చెప్పారు. న్యాయవ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా క్రిమినల్ జస్టిస్ విషయంలో ఐపీఎస్‌లు పట్టు సాధించాలనీ, కొత్త చట్టాలను మరింతగా అవపోసన పట్టాలని కేంద్ర మంత్రి కోరారు.

'దీక్షాంత్ పరేడ్'లో 207 మంది అధికారులు

207 మంది అధికారులు పాల్గొన్న ఈ దీక్షాంత్ పరేడ్‌లో 188 మంది ఐపీఎస్ అధికారులు కాగా 19 మంది విదేశీ అధికారులున్నారు. వీరిలో 54 మంది మహిళలు ఉన్నారు. దీక్షాంత్ పరేడ్‌కు కేరళ క్యాడర్‌కు చెందిన అచ్యుత్ అశోక్ నాయకత్వం వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో నిత్యానందరాయ్.. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచిన పరేడ్ కమాండర్ అచ్యుత్ అశోక్‌కు బెస్ట్ క్యాడర్ అవార్డుతో పాటు కత్తిని బహూకరించారు. ఆయనతో పాటు శిక్షణలో ప్రతిభ కనబర్చిన మరికొందరు ఐపీఎస్ అధికారులకు ఆయన ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీజీపీ జితేందర్‌తో పాటు సీబీఐ, ఐబీ డైరెక్టర్లు, త్రివిధ దళాలలకు చెందిన అధిపతులు, విశ్రాంత పోలీసు, రక్షణ బలగాల అధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో ఐపీఎస్‌ల దీక్షాంత్‌పరేడ్ ఆహూతులను అలరించింది.

పెద్దమ్మగడ్డలో దళితుల ధర్నా

- సమాధులు కూల్చిన వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్
- కుటుంబీకుల సమాధులు కూల్చడంతో గొంతు కోసుకున్న యువకుడు : దళితులకు అండగా నిలిచిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

దళితుల సమాధులను కూల్చివేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హనుమకొండ-ములుగు జాతీయ రహదారిపై పెద్దమ్మగడ్డకు చెందిన దళితులు ధర్నా నిర్వహించారు. వందల సంఖ్యలో రోడ్డు పైకి వచ్చిన రహదారిపై బైటాయించారు. ఏడు దశాబ్దాలకుపైగా తమ బంధువులు, కుటుంబ సభ్యులను అక్కడే సమాధి చేస్తున్నామని, ఇప్పుడు కొందరు అక్రమార్కులు ఆ స్థలం తమదేనంటూ రావడం, అందుకు అధికారులు వత్తాసు పలకడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో బాధిత కుటుంబానికి చెందిన యువకుడు గొంతుకోసుకున్నాడు. దాంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తతగా మారింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని న్యాయం చేస్తామని చెప్పినా ఆందోళనకారులు వినకుండా ధర్నా కొనసాగించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ధర్నా స్థలానికి చేరుకుని దళితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సమాధులను కూల్చుతుంటే అధికారులు చోద్యం చూస్తుండటం దుర్మార్గమైన చర్య అన్నారు. దళితుల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకుని తప్పుడు పత్రాలను సృష్టించి కబ్జా చేయాలనుకుంటున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నగరంలో లా అండ్ ఆర్డర్ సమస్య లేకుండా సమస్యను పరిష్కరించాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను కోరారు. దళితుల సమాధుల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని బాధితులకు భరోసా కల్పించారు.

గొంతు కోసుకున్న యువకుడు..

పెద్దమ్మగడ్డ ప్రాంతానికి చెందిన హన్మకొండ మెల్‌గిబ్సన్ కుటుంబీకుల సమాధులు కొందరు జేసీబీతో తొలగించడంతో మనస్తాపానికి గురైన బాధిత కుటుంబసభ్యుడు ఆందోళన చేస్తున్న స్థలం వద్ద బ్లేడ్‌తో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దాంతో ఆందోళన మరింత ఉద్రిక్తంగా మారింది. ధర్నా వద్ద పెద్ద సంఖ్యలో ఉన్న స్థానికులు యువకుడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. అనంతరం సమాధులను తొలగించిన వారిని గుర్తించి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

'ఓటుకు నోటు' కేసులో సీఎంకు ఊరట

- మరో రాష్ట్రానికి విచారణ బదిలీ కుదరదు
- ఈ దర్యాప్తులో జోక్యం చేసుకోవద్దు : సుప్రీం

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

స్పష్టమైన ఆధారాలు లేకుండా కేవలం ఊహాజనితమైన అంశాలతో కోర్టును ఆశ్రయించారని 'ఓటుకు నోటు' కేసులో పిటిషనర్లను ఉద్దేశించి అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ కేసులో పిటిషనర్లకు ప్రాసిక్యూషన్‌పై పూర్తి నమ్మకం కల్పించినందుకు, విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. అలాగే సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో పర్యవేక్షించాలన్న పిటిషనర్ల అభ్యర్థననూ తోసిపుచ్చుతున్నట్టు స్పష్టం చేసింది. ప్రస్తుత స్టేజ్‌లో ఈ పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్టు వెల్లడించింది. ఒకవేళ ప్రతివాది అయిన సీఎం ఈ కేసు విచారణలో జోక్యం చేసుకుంటే కోర్టును ఆశ్రయించే అవకాశం కల్పిస్తున్నట్టు ఆదేశాల్లో పేర్కొంది. ఇదే సందర్భంలో ట్రయల్ కోర్టు కేసు విచారణను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించింది. ఏసీబీ డీజీ ప్రత్యేక ప్రాసిక్యూషన్‌కు పూర్తిగా సహకరించాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది.

ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బీఆర్ఎస్ నేతలు జగదీశ్ రెడ్డి, మహమ్మద్ అలీ, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, సిద్ధార్థ్ లూత్రా, మేనకా గురుస్వామీలు వాదించగా, పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు ఆర్యమా సుందరం, దామా శేషాద్రి నాయుడు, మోహిత్ రావులు వాదించారు.

హోం కాదు... అన్ని శాఖలూ సీఎం పరిధిలోనే..

తొలుత సుందరం వాదనలు వినిపిస్తూ నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి పరిధిలోనే హోం మంత్రిత్వ శాఖ ఉందని సుందరం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఏసీబీ, ఏసీబీ ప్రాసిక్యూషన్, అలాగే అధికారులు ఆయనకే రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఏసీబీ ఎవరిని ఇన్వెస్టిగేషన్ చేయాలనేది హోం మంత్రిత్వ శాఖనే నిర్ణయిస్తుందని వాదనలు వినిపించారు. ఈ వాదనలపై జోక్యం చేసుకున్న ధర్మాసనం 'ఒకవేళ మరోచోటుకు కేసు విచారణ మార్చితే, అప్పుడు కూడా హోం మంత్రిగా అధికారులు ఆయనకు చెప్పిన తరువాతే కోర్టుకు వెళతారు కదా? అని ప్రశ్నించింది. ఒకవేళ హోం మంత్రిత్వ శాఖ ఆయన పరిధిలో లేకపోయినా, సీఎంగా అన్ని శాఖలు ఆయన కిందే పని చేస్తాయని కోర్టు వ్యాఖ్యానించింది. ఇందుకు సుందరం బదులిస్తూ ప్రాసిక్యూషన్ అనేది స్వతంత్రంగా జరగాలని కోర్టును కోరుతున్నట్టు తెలిపారు. అలాగే రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జితో పర్యవేక్షణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులు, అధికారులను విచారించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విచారణ అధికారులు చెప్పిందే, ప్రాసిక్యూషన్ వింటుందన్నారు. అయితే ఈ వాదనలపై తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది ముకుల్ రోహిత్గి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసులో చాలా మందిని విచారణాధికారులు విచారించినట్టు తెలిపారు. కానీ పిటిషనర్లు కేవలం రాజకీయంలో భాగంగా కోర్టును ఆశ్రయించారని అన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, గతంలో ఈ కేసును విచారిస్తోన్న విచారణాధికారి కొనసాగింపు సమ్మతమేనా? అని పిటిషనర్ తరపు న్యాయవాది సుందరాన్ని అడిగింది. ఇందుకు ఆయన అభ్యంతరం తెలపకపోవడంతో, గతంలో ఇదే ప్రాసిక్యూషన్‌పై అనుమానం ఎందుకు వ్యక్తం చేశారని అసంతృప్తి వ్యక్తం చేసింది.

కేసులో జోక్యం చేసుకోవద్దు

ఇరువైపు వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఈ కేసు విచారణను ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయలేమని స్పష్టం చేసింది. అయితే కేసు విచారణలో జోక్యం చేసుకోవద్దని ధర్మాసనం ప్రతివాది రేవంత్ రెడ్డిని ఆదేశించింది. ఏసీబీ డీజీపీ కేసు విచారణను సీఎంకు నివేదించవద్దని, ట్రయల్ కోర్టు పారదర్శకంగా కేసు విచారణ చేపట్టాలని స్పష్టం చేసింది. ఒకవేళ సీఎంగా రేవంత్ రెడ్డి కేసు విచారణలో జోక్యం చేసుకుంటే పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించే వెసులుబాటు కల్పించింది.

క్షమాపణలను స్వీకరిస్తున్నాం

కవిత బెయిల్ ఆర్డర్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణలను ద్విసభ్య ధర్మాసనం స్వీకరించింది. రాజ్యాంగబద్ధ హోదాలో ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. 'కార్యనిర్వహణ, శాసన న్యాయ వ్యవస్థ ఏదైనా తమ పరిధిలోని రాజ్యాంగ విధులు నిర్వర్తించాలి. ఇటువంటి అనవసర మైన వ్యాఖ్యలు ఘర్షణకు దారితీస్తాయి. క్షమాపణలు స్వాగతించినప్పటికీ... కోర్టు ఆదేశాలపై వ్యాఖ్యలు చేసేటప్పుడు తగినంత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నాం' అని పేర్కొంది. కాగా బీఆర్ఎస్, బీజేపీకి మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగానే కవితకు బెయిల్ వచ్చిందని రెడ్డి చేసిన వ్యాఖ్యలను గతంలో కోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యవహారంలో సీఎం బహిరంగంగా రెండు సార్లు క్షమాపణలు చెప్పారని, కోర్టు నోటీసులకు సమాధానం ఇచ్చారని తెలిపింది.

తెలంగాణ విద్యార్థుల కౌన్సెలింగ్‌కు ఓకే...

- రాష్ట్ర ప్రభుత్వ అంగీకారంతో ఒక్కసారి మినహాయింపునకు అవకాశం
- నీట్ కౌన్సెలింగ్ స్థానికత వ్యవహారంలో సుప్రీం ఉత్తర్వులు

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

స్థానికత వ్యవహారంలో హైకోర్టును ఆశ్రయించిన 135 మంది విద్యార్థులు నీట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు తెలంగాణ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. సమయం తక్కువగా ఉండడంతో ఈ ఒక్కసారి మినహాయింపు (వన్ టైం ఎక్సెప్షన్) కల్పించాలని నిర్ణయించినట్టు సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ ఏడాదికి గాను కోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు ఊరట కల్పిస్తూ ఉత్తర్వులు వెలువరించింది. అలాగే ఈ కేసులో హైకోర్టు ఆదేశాలపై స్టే విధిస్తున్నట్టు తెలిపింది.

వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికతకు సంబంధించి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం జీవో 33ని తీసుకు వచ్చింది. నీట్‌కు ముందు నాలుగేండ్లు లోకల్‌గా చదవాలని, లేదా ఉండాలని జీవో 33 లోని నిబంధన 3 (ఏ) కింద చేర్చింది. అయితే ఈ నిబంధనను సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కల్లూరి నాగ నరసింహ, అభిరామ్‌తో పాటు మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ విచారించిన హైకోర్టు విద్యార్థులకు సానుకూలంగా తీర్పు వెలువరించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ... తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 11న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను శుక్రవారం సీజేఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది.



తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, ప్రతివాదుల తరపున సీనియర్ న్యాయవాదులు మురళీధర్, నిరంజన్ రెడ్డి, పలువురు వాదనలు వినిపించారు.

ఈ ఒక్కసారికి మినహాయింపు

తొలుత నీట్ పరీక్షలో స్థానికతకు సంబంధించి ప్రతి విద్యార్థి స్థానికుడై, 9, 10, 11 తరగతులు రాష్ట్రంలో చేసి ఉండాలని తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఈ వ్యవహారంలో రాజ్యాంగ ధర్మాసనంతో పాటు నాలుగు తీర్పులు తమకు అనుకూలం గా ఉన్నాయని కోర్టుకు నివేదించారు.

తెలుగు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు తమ స్కూల్, కాలేజీ, పై చదువులు విదేశాల్లో చేసి, నీట్ పరీక్షకు తెలంగాణలో హాజరయ్యారని తెలిపారు. దీంతో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని వివరించారు.ఏపీకి చెందిన విద్యార్థులు తెలంగాణలో నీట్ తీసుకోవచ్చని, కానీ ఏపీలో ఈ రాష్ట్రం వారికి అవకాశం లేదని కోర్టుకు నివేదించారు. స్థానికతపై తెలంగాణ తీసుకువచ్చిన కొత్త జీవోను హైకోర్టు స్ట్రక్ డౌన్ చేసిందన్నారు. దీనిపై విద్యార్థుల తరపు న్యాయవాది మురళీధర్ అభ్యంతరం తెలిపారు. కేవలం నీట్ ఫలితాలకు వారం ముందు తెలంగాణ ప్రభుత్వం కొత్త జీవో తెచ్చిందన్నారు.

ఆగస్టు 26న నీట్ ఫలితాలు వస్తే, 19న జీవో తెచ్చారని వివరించారు. ఆ తరువాత ఈ జీవోను రాష్ట్ర హైకోర్టు ఆగస్టులో స్ట్రక్ డౌన్ చేసిందన్నారు. ఈ వాదనలపై సింఘ్వీ జోక్యం చేసుకొని, ఉమ్మడి ప్రాంతానికి సంబంధించిన 371 (డి) పదేండ్ల తరువాత ఎక్స్‌పైర్ అయిందన్నారు.

మరలా పదేండ్ల తరువాత ఈ కొత్త నిబంధనను ప్రభుత్వం తెచ్చిందని గుర్తు చేశారు. అయితే వన్ టైం ఎక్సెప్షన్ (ఒకసారి మినహాయింపు) కింద సెప్టెంబర్ చివరి వారంలో తొలి, అక్టోబర్ మొదటి వారంలో రెండో విడత కౌన్సెలింగ్ ఉన్నందున విద్యార్థుల మేలు కోరి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఇరువైపు వాదనల అనంతరం... రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిన నేపథ్యంలో హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులు నీట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో సమాధానం చెప్పాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా వచ్చే నెల 13న ఈ పిటిషన్ మరోసారి కోర్టు ముందుకు రానుంది.

కేసు పూర్వాపరాలు

రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 33తో తమకు అన్యాయం జరుగుతోందని నీట్ అభ్యర్థులు కొందరు పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై సుదీర్ఘ వాదనల అనంతరం సెప్టెంబర్ 5న హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తీర్పు చెప్పింది. ఒక విద్యార్థి తెలంగాణలో నివాసం లేదా శాశ్వత నివాసి అని నిర్ధారించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలేవీ రూపొందించలేదని హైకోర్టు అభిప్రాయ పడింది. తొలుత మార్గదర్శకాలు, నిబంధనలను రూపొందిం చాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం రూపొందించే మార్గదర్శకాల మేరకు ప్రతీ విద్యార్థికి స్థానిక కోటా వర్తింపజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే స్థానికత వ్యవహారంపై హైకోర్టు తీర్పును ఈ నెల 11న రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. తరువాత రోజు తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాదులు సుప్రీకోర్టు సీజేఐ ధర్మాసనం ముందు కేసును మెన్షన్ చేయడంతో, పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్నట్టు వెల్లడించింది.

లడ్డూ పాలిట్రిక్స్

(మొదటిపేజీ తరువాయి)

నిరూపించలేదని వివరించింది.

చంద్రబాబు దర్టీ పాలిటిక్స్ : వైసీపీ

చంద్రబాబు ఆరోపణలపై వైసీపీ ఘాటుగానే స్పందించింది. తిరుమల పుణ్యక్షేత్రం పవిత్రత దెబ్బతీసేలా ఆయన 'దర్టీ పాలిటిక్స్' చేస్తున్నారని వైసీపీ నేతలు ఆరోపించారు. టీటీడీ మాజీ చైర్‌పర్సన్ వై.వి సుబ్బారెడ్డి ఏపీ సీఎం వ్యాఖ్యలను ఖండించారు. ఆయన ఆరోపణలు దురుద్దేశపూరితమైనవనీ, లక్షలాది మంది హిందువుల విశ్వాసానికి ప్రమాదకరమని అన్నారు. దేవుడి ముందు తాను ప్రమాణానికి సిద్ధమనీ, చంద్రబాబు తాను చేసిన ఆరోపణలను నిజమని నమ్మితే ఆయన కూడా ప్రమాణం చేయాలని సుబ్బారెడ్డి సవాలు విసిరారు. చంద్రబాబు వ్యాఖ్యలు హిందూ సమాజంపై దాడి అని టీటీడీ మరో మాజీ చైర్‌పర్సన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి లడ్డూలను టీటీడీ అధికారుల జోక్యం లేకుండా శ్రీవైష్ణవ అర్చకులు తయారు చేస్తారనీ, సుదీర్ఘ ఆలయ ఆచారాలను రక్షిస్తున్నారని ఆయన ఉద్ఘాటించారు. గత వైసీపీ ప్రభుత్వాన్ని కించపర్చి, రాష్ట్రంలో మత సామరస్యాన్ని అస్థిరపర్చే ప్రయత్నంలో భాగమే ఈ ఆరోపణలని ఈ ఇద్దరు వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీపై గతంలో ఫిర్యాదులు వచ్చాయనీ, జంతువుల కొవ్వు ఉనికి పరీక్షలో తేలిందని టీడీపీ అధికార ప్రతినిధి బి. పట్టాబి వివరించారు. అందుకే, ముఖ్యమంత్రి సీరియస్‌గా ప్రకటన చేశారని అన్నారు.

గతంలోనూ కల్తీ

తిరుపతి లడ్డూలలో కల్తీ జరగటంపై ఆందోళనలు రావటం ఇదే తొలిసారి కాదు. అయితే, గతంలో ఇది జంతువుల కొవ్వు కాకుండా వనస్పతి (ప్రత్యేకించి డాల్డా బ్రాండ్)తో తయారు చేశారనే ఆరోపణలు వచ్చాయి. అయితే కల్తీకి సంబంధించిన సమాచారం అందిన తర్వాత అధికారులు సరఫరాదారులను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టినట్టు అధికారులు చెప్తున్నారు. 68 వేల కిలోల నెయ్యి సరుకులో 20వేల కిలోలు నాసిరకం అని గుర్తించిన తర్వాత టీటీడీ ఒక విక్రేతను బ్లాక్‌లిస్ట్ చేయటం ఒక ముఖ్యమైన ఘటన.

శ్రీవారి లడ్డూ

తిరుపతి లడ్డూను శ్రీవారి లడ్డూ అని కూడా అంటారు. ఇది 1920ల నాటిదని టీటీడీ అధికారి ఒకరు తెలిపారు. ఈ లడ్డూలు ఆలయ ప్రాంగణంలో, వెలుపల నిర్దిష్ట కౌంటర్లలో అందుబాటులో ఉంటాయి. ఇవి సాధారణంగా ప్యాకేజింగ్‌లలో 15 రోజుల వరకు నిలువ ఉంటాయి. 40 గ్రాములు, 175 గ్రాములు(రూ.50), 750 గ్రాములు (రూ.200) ఇలా చిన్న, మధ్యస్థ, పెద్దగా మూడు పరిమాణాలలో లడ్డూలు లభిస్తాయి. చిన్న లడ్డూలు వెంకటేశ్వర ఆలయంలో భక్తులందరికీ ఉచితంగా అందిస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో డెయిరీలు నెయ్యి సరఫరా చేయలేవా..?

తిరుపతిలో లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యి విషయం రచ్చగా మారింది. ఇపుడు కర్నాటకకు చెందిన నందిని డెయిరీ నుంచి నెయ్యి దిగుమతి చేసుకుంటామని చంద్రబాబు సర్కార్ అంటోంది. అటు ఏపీలో ఉన్న సంగం డెయిరీ నుంచి కానీ, ఇటు తెలంగాణలో ఉన్న విజయ డెయిరీల నుంచిగానీ లడ్డూ తయారీకి అవసరమైన నెయ్యిను ఎందుకని కొనుగోలు చేయటంలేదన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న డెయిరీలు కనుక నెయ్యిని సరఫరా చేయలేకపోతే, అప్పుడు నందిని డెయిరీనుంచి నెయ్యి తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ముందుగా ఇక్కడి డెయిరీలనుంచి అన్ని తనిఖీలు చేసి నెయ్యిని తీసుకుని, మిగతా నెయ్యిని వేరే చోట సేకరించాలని సూచిస్తున్నారు.

కాంట్రిబ్యూషన్ లేకుండా వైద్య సదుపాయాలు కల్పించాలి

- టాప్ర రాష్ట్ర అధ్యక్షులు నారాయణరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ లేకుండానే వైద్య సదుపాయాలను కల్పించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్ర) రాష్ట్ర అధ్యక్షులు పి నారాయణరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆ సంఘం ఆఫీసు బేరర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు, ఉద్యోగులకు, పెన్షనర్లందరికీ అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. సాధారణ ప్రజానీకం నుంచి ఏ విధమైన కాంట్రిబ్యూషన్ లేకుండానే ఆరోగ్యశ్రీ లాంటి పథకాన్ని అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. అలాంటప్పుడు ప్రభుత్వ నిర్ణయాలను ప్రజల వద్దకు చేరుస్తున్నది, నిత్యం సేవలు అందిస్తున్న ఉద్యోగుల నుంచి దాదాపు 30 ఏండ్లు సర్వీసు చేసి ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల నుంచి కాంట్రిబ్యూషన్ తీసుకోవాలని ప్రభుత్వం భావించడం న్యాయం కాదని చెప్పారు. ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి కాంట్రిబ్యూషన్ లేకుండానే వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈపీఎస్ పెన్షనర్లకు వారి పెన్షన్‌ను బట్టి ఆసరా పెన్షన్లను మంజూరు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎనిమిదో వేతన సవరణ కమిషన్‌ను నియమించాలని సూచించారు. సీజీహెచ్ఎస్ ఉద్యోగుల వైద్య సదుపాయాలను కుదించే ప్రయత్నాలను విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.15 వేలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టాప్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రిష్ణ మూర్తి, కోశాధికారి నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులు రంగయ్య, అరుణ, కార్యదర్శులు సీతారాం, బ్రహ్మచారి, కృష్ణారావు, వి. క్రిష్ణ మోహన్, జగదీశ్వర్, బాలరాజు, రాజయ్య, గడ్డం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను ఛాలెంజ్‌గా స్వీకరిస్తేనే గెలుపు

మహిళలపై వివక్ష బాధాకరం

- అభివృద్ధి వికేంద్రీకరణ కోసం పారిశ్రామిక వేత్తలు సహకరించాలి
- గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పాలి
- గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం : సీఐఐ, ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ సదస్సులో మంత్రి డాక్టర్ సీతక్క



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సమాజంలో మహిళల పట్ల నేటికీ వివక్ష కొనసాగుతుండటం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నా పురుషులే గొప్ప అన భావన సమాజంలో నాటుకుపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. తాము తక్కువ అనే ఆలోచన నుంచి మహిళలు బయటపడాలని సూచించారు. జీవితంలో, వృత్తిలో ఎదురయ్యే సవాళ్లను చాలెంజ్‌గా స్వీకరిస్తేనే గెలుపు సాధ్యమని నొక్కి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని టెక్ మహీంద్రా క్యాంపస్‌లో సీఐఐ, ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్(ఐడబ్ల్యూఎన్) ఆధ్వర్యంలో తెలంగాణ పదో లీడర్‌షిప్ సదస్సును మంత్రి సీతక్క ప్రారంభించారు. మహిళా సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తున్నదని చెప్పారు. పనిప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలని పరిశ్రమల యజమానులను కోరారు. ప్రయాణాలు, పని ప్రాంతాల్లో మహిళా భద్రత కోసం తమ ప్రభుత్వం అమలు చేస్తున్న టి సేఫ్ యాప్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నదని చెప్పారు. పనిప్రదేశాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని మహిళలకు సూచించారు. వర్కింగ్ ఉమెన్‌కు ఎదురవుతున్న సవాళ్లను, సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారం కోసం చట్టాలు చేస్తామని హామీనిచ్చారు. వ్యాపారాలు, పరిశ్రమలు పట్టణాలకే పరిమితం కావడం పట్ల మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ పరిశ్రమలను నెలకొల్పాలనీ, అభివృద్ధి వికేంద్రీకరణలో సహకరించాలని పారిశ్రామిక వేత్తలను కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్య శిక్షణపై సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు దృష్టి సాధించారనీ, గ్రామీణ యువతకు ఉపాధి కల్పించే దిశలో పరిశ్రమలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని హామీనిచ్చారు. లింగసమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మహిళలకు మానవత్వం ఎక్కువ వుంటుందనీ, సమస్యల్లో ఉన్నవారికి అక్కలా, చెల్లెలా, తల్లిలా చేయూత నివ్వాలని కోరారు. యంగ్ ఇండియాలో నిరుద్యోగం పెద్ద సమస్యగా మారటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచితే కాస్తయినా నిరుద్యోగ సమస్య తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు తమ ప్రభుత్వం శిక్షణ ఇస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో ఐడబ్ల్యూఎన్ తెలంగాణ చైర్‌పర్సన్ పి. అనుపమ, సీఐఐ తెలంగాణ చైర్మెన్ సాయి ప్రసాద్, యూఎస్ కాన్సులేట్ హైదరాబాద్ పబ్లిక్ డిప్లమా ఆఫీసర్ ఏమిలియ స్మిత్, సీఐఐ మాజీ చైర్మెన్ బీవీఆర్ మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో నేడు మంత్రి పొంగులేటి భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని సచివాలయంలో భేటీ కానున్నారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెవెన్యూ ఉద్యోగుల సమస్యలతోపాటు ఆ శాఖ బలోపేతానికి కృషి జరుగుతున్నది. అందులో భాగంగానే శనివారం మంత్రి భేటీ కానున్నారు. మంత్రితో ఉద్యోగ సంఘాల నాయకులు భేటీ కావడం చరిత్రలో ఇదే మొదటి సారి కావడం విశేషం.

నాలుగు డీఏలు విడుదల చేయాలి : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగులకు బకాయిపడిన నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులకు గత ప్రభుత్వంలోనే మూడు డీఏలు పెండింగ్‌లో ఉంటే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మరో రెండు డీఏలు బకాయి పడిందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు పూర్తయినా నేటికీ డీఏలు ప్రకటించలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం వేసిన పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకునే ఆలోచన చేయడం లేదని తెలిపారు. మంత్రివర్గంలో ఉద్యోగులకు కనీసం రెండు డీఏ ప్రకటిస్తుందంటూ ఆశించిన వారికి నిరాశే కలిగించిందని పేర్కొన్నారు.

లక్ష్మీ పారాబాయిల్డ్ రైస్ మిల్లుపై విజిలెన్స్ దాడులు

- సివిల్ సప్లయ్‌కు సరఫరా కానీ 18వేల క్వింటాళ్ల బియ్యం
- సుమారు రూ.6.49కోట్ల ధాన్యం నిల్వలు శూన్యం
- మిల్లు యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు : రాష్ట్ర సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ ఎం. ప్రభాకర్



నవతెలంగాణ -మరిపెడ

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం యల్లంపేట శివారులోని లక్ష్మి పారాబాయిల్డ్ రైస్ మిల్లుపై శుక్రవారం రాష్ట్ర సివిల్ సప్లయ్ విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. రాష్ట్ర సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ ఎం. ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2022-23 రబీ సీజన్‌కు సంబంధించి లక్ష్మి పారాబాయిల్డ్ రైస్ మిల్లుకు ఎఫ్‌సీఐ నుంచి 62,578 క్వింటాళ్ల ధాన్యం కోటా కేటాయించారు. ఆ ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి మిల్లులో పట్టించి 42,553 క్వింటాళ్లు సివిల్ సప్లయ్ కోటా కింద ఎఫ్‌సీఐకు సరఫరా చేయాలి. కానీ 24,336 క్వింటాళ్ల బియ్యం మాత్రమే సరఫరా చేశారు. మిగతా కోటా బియ్యం పంపకపోవటంతో ఎఫ్‌సీఐ నుంచి అనుమతి నిలిపివేశారు. మిగతా 18,217 క్వింటాళ్ల బియ్యం సరఫరాకు సంబంధించి మిల్లులో 26,784 క్వింటాళ్ల ధాన్యం స్టాక్ ఉండాలి.. కానీ మిల్లులో ధాన్యం నిల్వలు లేకపోవటంతో ఆ ఏడాది ఆర్థిక సమీకరణాలను అనుసరించి రూ.6.49కోట్లు అవకతవకలు జరిగినట్టు గుర్తించామని అధికారి వెల్లడించారు. దీనికి సంబంధించి మిల్లు యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకుంటున్నామని, స్థానిక పోలీసులకు సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో డీఎం కృష్ణవేణి, ఎస్ఐ జంగయ్య, డీఎస్పీ ప్రేమ్ కుమార్, ఏఎస్ఓ రమేష్, టీఏ శంకరయ్య, మరిపెడ తహసీల్దార్ డి. సైదులు, ఎస్ఐ బొలగాని సతీష్ గౌడ్ తదితరులున్నారు.

నేటి నుంచి జిల్లాల వారీగా సమీక్షలు

- టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ కార్యాచరణ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మహేష్‌కుమార్‌గౌడ్ తన కార్యాచరణను సిద్ధం చేశారు. శనివారం నుంచి ఆయా జిల్లాల వారీగా సమీక్షలకు శ్రీకారం చుట్టారు. పార్టీ బలోపేతం, ప్రభుత్వం పథకాలపై విస్తృత ప్రచారం చేయడం, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నేతలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు పార్టీని సిద్ధం చేయడంలో భాగంగా సమీక్షలు చేపట్టారు. నాయకుల పని తీరు ప్రాతిపదికన పార్టీ పదవులు ఇచ్చేందుకు సమావేశా లను ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. ప్రభుత్వ పదవులు పొందని నేతలకు పార్టీలో కీలక పదవులు ఇచ్చేందుకు ఆయన ప్లాన్ రెడీ చేస్తున్నారు. ఈనేపథ్యంలో వరంగల్, కరీంనగర్ జిల్లాలకు చెందిన నాయకులతో శనివారం సమీక్షలు ప్రారంభించనున్నారు.ఈ సమీక్షలో ఏఐసీసీ ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షి, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథం, విష్ణునాథ్ జిల్లాల సమీక్షల్లో పాల్గొంటారు. ఈ సమీక్షలో డీసీసీ అధ్యక్షులు, సీసీసీ అధ్యక్షులు, మంత్రులు, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పోటీ చేసిన ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ అభ్యర్థులు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లు, కార్పొరేషన్ చైర్మెన్లు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు,అనుబంధ సంఘాల చైర్మెన్లు, ఇతర ముఖ్యనాయకులు పాల్గొంటారు. షెడ్యూల్ ఉదయం 11 గంటలకు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వరంగల్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు కరీంనగర్ జిల్లా, 4 గంటల నుంచి 6 గంటల వరకు నిజామాబాద్ జిల్లాల సమీక్షా సమావేశాలు జరుగుతాయి.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఎగిరేది గులాబీ జెండానే

- త్వరలో ఆ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

త్వరలో జరగబోయే ఉప ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ప్రజలు బుద్ధి చెప్పబోతున్నారనీ, ఆ నియోజకవర్గంలో ఎగిరేది గులాబీ జెండానే అని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మారిన ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హత వేటు ఖాయమని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే తాటికొండ రాజయ్యను బీఆర్ఎస్ అభ్యర్థిగా తమ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు స్టేషన్ ఘన్‌పూర్‌లో పార్టీ శ్రేణులతో త్వరలోనే విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు. మండల పార్టీ నాయకులతో మాట్లాడి తేదీలను నిర్ణయించాలని రాజయ్యకు సూచించారు.

అనేక అవకాశాలు ఇచ్చి మూడుచట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పించిన తర్వాత కూడా కేవలం రాజకీయ స్వార్థంతో పార్టీని వీడిన కడియం శ్రీహరికి బీఆర్ఎస్ శ్రేణులు ప్రజాక్షేత్రంలో బుద్ధి చెప్తాయని కేటీఆర్ అన్నారు.

వేవ్స్ 'క్రియేట్ ఇన్ ఇండియా' ఛాలెంజ్ షురూ

- కేంద్ర సమాచార, ప్రసారశాఖ కార్యదర్శి సంజయ్ జాజు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రపంచ ఆడియో విజువల్, ఎంటర్‌టైన్‌మెంట్ (వేవ్స్) సదస్సును ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు నిర్వహించనున్నట్టు కేంద్ర సమాచార, ప్రసారశాఖ కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. వేవ్స్ ప్రచారం కోసం శుక్రవారం హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ) వద్ద రోడ్‌షో నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మీడియా, వినోద రంగంలోని మొత్తం విభాగాలకు స్థానం కల్పించనున్నట్టు చెప్పారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. వేవ్స్ 'క్రియేట్ ఇన్ ఇండియా' ఛాలెంజ్ సీజన్ 1 ప్రారంభమైనట్టు తెలిపారు. రాష్ట్ర ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ ఈ రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి రాష్ట్రంలో తగిన పరిస్థితులు ఇప్పటికే ఉన్నాయనీ, దీనిని ఇపుడు జాతీయ స్థాయికి తీసుకెళ్లడం ఆనందంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఎన్ఎఫ్‌డీసీ జనరల్ మేనేజర్, వేవ్స్ సీఈఓ అజయ్ ధోక్, సీబీఎఫ్‌సీ సీఈఓ రాజేంద్ర సింగ్, సీబీఎఫ్‌సీ హైదరాబాద్ ఆర్ఓ షిఫాలీ కుమార్, ఈఓ రాహుల్ గౌలికర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ట్రిపుల్ ఆర్ దక్షిణభాగం అలైన్‌మెంట్ మార్పుతో వెనుక సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూదందాలకు తెరలేపిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. దీనిపై కేంద్రంలోని బీజేపీ సర్కార్ సీబీఐ విచారణ జరిపించాలనీ, లేకపోతే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఒక్కటిగానే భావించాల్సి ఉంటుందని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతల భూములు ఉన్నవైపు అలైన్‌మెంట్ మార్చారని ఆరోపించారు. ఫోర్త్ సిటీ సౌలభ్యం కోసమంటూ పాత అలైన్‌మెంట్ 10 కిలోమీటర్ల దూరం ఉంటే కొత్త అలైన్‌మెంట్ మధ్య దూరం 12 కిలోమీటర్లకు పెంచారని తెలిపారు. మాడుగుల గ్రామంలో సీఎం బంధువుల కోసమే అలైన్‌మెంట్ మారుస్తున్నట్టు స్పష్టంగా అర్థమవుతున్నదని చెప్పారు. దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేదలు, గిరిజనుల బాధలను అర్థం చేసుకోవాలని కోరారు.

మహిళా డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ గడువు పొడిగింపు

- సంస్థ కార్యదర్శి బడుగు సైదులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం గడువును వచ్చే నెల పది వరకు పెంచామని ఎంజేపి కార్యదర్శి బడుగు సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరుస సెలవుల కారణంగా విద్యార్థుల వినతి మేరకు గడువును పెంచామని పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వ ఇఎపిసెట్- 2024ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థినీలు ఆన్‌లైన్ https://mjptbcwreis.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్షలో సాధించిన ర్యాంకు, రిజర్వేషన్ ప్రాతిపదికన విద్యార్థినీలను ఎంపిక చేస్తామని తెలిపారు. దరఖాస్తు చేయటంలో ఏమైనా సందేహాలు ఉంటే కార్యాలయ పనివేళల్లో 040-23328266 సంప్రదించాలని సూచించారు.

23న బ్లాక్ డే విజయవంతం చేయాలి

- టీజీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు, రాష్ట్ర కార్మిక సంఘాలు 23న తలపెట్టిన బ్లాక్ డేను టీజీఎస్ఆర్టీసీలోనూ పాటించాలని నిర్ణయించినట్టు టీజీఎస్ఆర్టీసి ఎస్‌డబ్ల్యూయూ (ఐఎన్టీయూసీ అనుబంధం) తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ ఒక ప్రకటన విడుదల చేసింది. నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది.

పేస్ దెబ్బకు బంగ్లా బేజారు

- నిప్పులు చెరిగిన బుమ్రా,ఆకాశ్, సిరాజ్
- 149 పరుగులకు కుప్పకూలిన బంగ్లాదేశ్
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 81/3
- ప్రస్తుత ఆధిక్యం 308 పరుగులు





చెపాక్‌లో వికెట్ల జాతర. చెపాక్ చరిత్రలోనే ఒక్కరోజు ఆటలోనే ఏకంగా 17 వికెట్లు కుప్పకూలాయి. ఎర్రమట్టి పిచ్‌పై పదునైన పేస్, మంచి బౌన్స్ రాబట్టిన సీమర్లు వికెట్ల వేటలో విజృంభించారు. 2006 తర్వాత భారత్‌లో ఓ టెస్టులో పేసర్లు ఒక్కరోజు 14 వికెట్లు పడగొట్టడం ఇదే ప్రథమం.

బుమ్రా బూమ్ బూమ్ ముంగిట బంగ్లాదేశ్ బేజారైంది. కొత్త బంతితో నిప్పులు చెరిగిన బుమ్రా బంగ్లాదేశ్ టాప్ లేపాడు. అరంగ్రేట సీమర్ ఆకాశ్ దీప్, హైదరాబాదీ మహ్మద్ సిరాజ్ సైతం బుమ్రాకు జతకలవటంతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 227 పరుగుల భారీ ఆధిక్యం సొంతం చేసుకుంది.

తొలి టెస్టుపై టీమ్ ఇండియా పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో 376 పరుగులు చేసిన రోహిత్‌సేన.. రెండో ఇన్నింగ్స్‌లో 81/3తో దూసుకెళ్తోంది. ప్రస్తుతం ఆతిథ్య జట్టు ఆధిక్యం 308 పరుగులు. నేడు రెండు సెషన్ల పాటు పరుగుల వేట సాగించినా బంగ్లాదేశ్ ముంగిట కొండంత లక్ష్యం ఉండనుంది

నవతెలంగాణ-చెన్నై

చెపాక్ పేస్ పిచ్‌పై భారత పేసర్లు బంగ్లాదేశ్ భరతం పట్టారు. పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా (4/50), హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ (2/19), అరంగ్రేట సీమర్ ఆకాశ్ దీప్ (2/30) నిప్పులు చెరగటంతో 47.1 ఓవర్లలోనే బంగ్లాదేశ్ 149 పరుగులకు కుప్పకూలింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 227 పరుగుల భారీ ఆధిక్యం సొంతం చేసుకుంది. బంగ్లాదేశ్ బ్యాటర్లలో షకిబ్ అల్ హసన్ (32, 64 బంతుల్లో 5 ఫోర్లు), మెహిది హసన్ మిరాజ్ (27 నాటౌట్, 52 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), లిటన్ దాస్ (22, 42 బంతుల్లో 3 ఫోర్లు), నజ్ముల్ శాంటో (20, 30 బంతుల్లో 3 ఫోర్లు) మాత్రమే 20 ప్లస్ పరుగులు చేయగలిగారు. యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ (33 నాటౌట్, 64 బంతుల్లో 4 ఫోర్లు), రిషబ్ పంత్ (12 నాటౌట్, 13 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) మెరుపులతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 81/3తో ఆడుతోంది. రోహిత్ శర్మ (5), యశస్వి జైస్వాల్ (10), విరాట్ కోహ్లి (17) నిరాశపరిచారు. అంతకముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 376 పరుగులకు ఆలౌటైంది. రవిచంద్రన్ అశ్విన్ (113, 133 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలువగా.. బంగ్లా పేసర్ హసన్ మహ్మద్ (5/83) ఐదు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. తొలి టెస్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి టీమ్ ఇండియా 308 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతుంది.

పేస్ త్రయం నిప్పులు

భారత పేసర్లు చెపాక్ పిచ్‌పై నిప్పులు చెరిగారు. ఇన్నింగ్స్ తొలి ఓవర్ నుంచే బుమ్రా బూమ్ బూమ్ మొదలెట్టాడు. షాద్‌మాన్ ఇస్లాం (2)ను క్లీన్‌బౌల్డ్ చేసి వికెట్ల పతనానికి తెర తీశాడు. తొలి సెషన్ ఆఖర్లో బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లాదేశ్ లంచ్ విరామ సమయానికి 9 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసింది. 54 బంతుల్లో 26 పరుగులు చేసి మూడు వికెట్లు కోల్పోయింది. అరంగ్రేట సీమర్ ఆకాశ్ దీప్ కొత్త బంతితో ఖతర్నాక్ ప్రదర్శన చేశాడు. జాకిర్ హసన్ (3), మోమినుల్ హాక్ (0)లను అవుట్ చేసి బంగ్లాదేశ్‌ను కష్టాల్లోకి నెట్టాడు. లంచ్ విరామం తర్వాత బంగ్లాదేశ్ మరో ఐదు వికెట్లు కోల్పోయింది. బుమ్రా, ఆకాశ్‌లకు సిరాజ్ సైతం జతకలిశాడు. ముష్ఫికర్ రహీమ్ (8), హసన్ మహ్మద్ (9), టస్కిన్ అహ్మద్ (11)లను బుమ్రా అవుట్ చేయగా.. నజ్ముల్ శాంటో (20), నహిద్ రానా (11) కథ సిరాజ్ ముగించాడు. పిచ్ నుంచి పేస్‌కు సహకారం లభించిన సమయంలో సీమర్లు చెలరేగగా.. ఆ తర్వాత స్పిన్నర్ రవీంద్ర జడేజా మాయజాలం చూపించాడు. షకిబ్ అల్ హసన్ (32) వికెట్‌తో బంగ్లాదేశ్ కీలక భాగస్వామ్యాన్ని విడదీశాడు. లిటన్ దాస్ (27)ను సైతం జడేజా తన ఉచ్చులో పడేయగా.. మెహిది హసన్ మిరాజ్ (27 నాటౌట్) అజేయంగా నిలిచాడు. 47.1 ఓవర్లలో 149 పరుగులకే బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ ముగిసింది. 227 పరుగుల తొలి ఇన్నింగ్స్ లోటుతో బంగ్లాదేశ్ ఫాలోఆన్ ప్రమాదంలో పడింది. కానీ భారత కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి బ్యాటింగ్ చేసేందుకు మొగ్గు చూపాడు.

ఆ ముగ్గురు విఫలం

తొలి ఇన్నింగ్స్‌లో 227 పరుగుల భారీ ఆధిక్యం సాధించిన ఆనందం భారత శిబిరంలో ఎంతోసేపు నిలువలేదు. తొలి ఇన్నింగ్స్ అర్థ సెంచరీ హీరో యశస్వి జైస్వాల్ (10) సహా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ (5), విరాట్ కోహ్లి (17, 37 బంతుల్లో 2 ఫోర్లు) వేగంగా పెవిలియన్‌కు చేరుకున్నారు. టస్కిన్ అహ్మద్ ఓవర్లో రోహిత్ నిష్క్రమించగా.. యశస్విని నహిద్ రానా సాగనంపాడు. రెండు బౌండరీలతో దూకుడుగా ఆడిన విరాట్ కోహ్లి స్పిన్నర్ మెహిది హసన్‌కు చిక్కాడు. మెహిది ఓవర్లో ఎల్బీగా నిష్క్రమించాడు. నిజానికి బంతి కోహ్లి బ్యాట్‌కు ఎడ్జ్ అయినా.. విరాట్ సమీక్ష కోరలేదు. డీఆర్ఎస్ తీసుకుని ఉంటే విరాట్ కోహ్లి క్రీజులో కొనసాగేవాడు. యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ (33 నాటౌట్), రిషబ్ పంత్ (12 నాటౌట్) నాల్గో వికెట్‌కు అజేయంగా 14 పరుగులు జోడించారు. రెండో ఇన్నింగ్స్‌లో 81 పరుగులతో కలిపి భారత్ ప్రస్తుతం 308 పరుగుల ముందంజలో కొనసాగుతుంది.

తొలి గంటలోనే..

అంతకుముందు రెండో రోజు ఉదయం సెషన్లో భారత తొలి ఇన్నింగ్స్ గంటలోపే ముగిసింది. ఓవర్‌నైట్ స్కోరు 339/6తో వచ్చిన భారత్ మరో 37 పరుగులకే చివరి నాలుగు వికెట్లు చేజార్చుకుంది. రవీంద్ర జడేజా (86) ఓవర్‌నైట్ స్కోరుకే వెనుదిరగగా.. అశ్విన్ (113) టస్కిన్ అహ్మద్ ఓవర్లో అవుటయ్యాడు. ఆకాశ్ దీప్ (17) విలువైన జరుగులు జోడించాడు. సిరాజ్ (0) అజేయంగా నిలిచాడు. 91.2 ఓవర్లలో భారత్ 376 పరుగులకు ఆలౌటైంది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ : 376/10 (అశ్విన్ 113, జడేజా 86, జైస్వాల్ 56, హసన్ మహ్మద్ 5/83, టస్కిన్ అహ్మద్ 3/55)

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ : షాద్‌మాన్ ఇస్లాం (బి) బుమ్రా 2, జాకిర్ హసన్ (బి) ఆకాశ్ దీప్ 3, నజ్ముల్ శాంటో (సి) కోహ్లి (బి) సిరాజ్ 20, మోమినుల్ హాక్ (బి) ఆకాశ్ దీప్ 0, ముష్ఫికర్ రహీమ్ (సి) రాహుల్ (బి) బుమ్రా 8, షకిబ్ అల్ హసన్ (సి) పంత్ (బి) జడేజా 32, లిటన్ దాస్ (సి) జురెల్ (బి) జడేజా 22, మెహిది హసన్ మిరాజ్ నాటౌట్ 27, హసన్ మహ్మద్ (బి) బుమ్రా 11, నహిద్ రానా (బి) సిరాజ్ 11, ఎక్స్‌ట్రాలు : 4, **మొత్తం :** (47.1 ఓవర్లలో ఆలౌట్) 149.

వికెట్ల పతనం : 1-2, 2-22, 3-22, 4-36, 5-40, 6-91, 7-92, 8-112, 9-130, 10-149.

బౌలింగ్ : జశ్‌ప్రీత్ బుమ్రా 11-1-50-4, మహ్మద్ సిరాజ్ 10.1-1-30-2, ఆకాశ్ దీప్ 5-0-19-2, రవిచంద్రన్ అశ్విన్ 13-4-29-0, రవీంద్ర జడేజా 8-2-19-2.

భారత్ రెండో ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి) లిటన్ దాస్ (బి) నహిద్ రానా 10, రోహిత్ శర్మ (సి) జాకిర్ హసన్ (బి) టస్కిన్ అహ్మద్ 5, శుభ్‌మన్ గిల్ నాటౌట్ 33, విరాట్ కోహ్లి (ఎల్బీ) మెహిది హసన్ మిరాజ్ 17, రిషబ్ పంత్ నాటౌట్ 12, ఎక్స్‌ట్రాలు : 4, **మొత్తం :** (23 ఓవర్లలో 3 వికెట్లకు) 81.

వికెట్ల పతనం : 1-15, 2-28, 3-67.

బౌలింగ్ : టస్కిన్ అహ్మద్ 3-0-17-1, హసన్ మహ్మద్ 5-1-12-0, నహిద్ రానా 3-0-12-1, షకిబ్ అల్ హసన్ 6-0-20-0, మెహిది హసన్ మిరాజ్ 6-0-16-1.



2036 ఒలింపిక్స్‌కు సిద్ధం కావాలి!

అథ్లెట్లతో క్రీడామంత్రి మన్‌సుఖ్ మాండవియ

నవతెలంగాణ-హైదరాబాద్ : 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం అందించేందుకు భారత్ సంకల్పంగా ఉంది. ఒలింపిక్స్ స్థాయిలో పతకాలు సాధించేలా మన క్రీడాకారులను తీర్చిదిద్దాలని కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ పర్యటనలో భాగంగా గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంతో పాటు సాయ్ సెంటర్‌ను కేంద్ర మంత్రి సందర్శించారు. జీఎంసీబీ స్టేడియం, సాయ్ సెంటర్‌లో క్రీడా వసతులను పరిశీలించి, క్రీడాకారులతో ముచ్చటించారు. పారా ఒలింపిక్స్ మెడలిస్ట్ దీప్తి జీవాంజి సహా పలువురు అథ్లెట్లను మాండవియ సత్కరించారు. ఇండోర్ స్టేడియంలో అగ్రశ్రేణి షట్లర్ పి.వి సింధుతో కలిసి బ్యాడ్మింటన్ ఆడారు. హాకీ, కబడ్డీ, అథ్లెటిక్స్ క్రీడాకారులతో కేంద్రమంత్రి మాట్లాడారు.

క్రీడాభివృద్ధికి సహకరించండి :

తెలంగాణ రాష్ట్ర క్రీడాభివృద్ధికి సహకారం అందించాలని శాట్ చైర్మన్ కే. శివసేనా రెడ్డి కేంద్ర మంత్రి మాండవియను కోరారు. ఖేలో ఇండియా నిధులను కేటాయించటంతో పాటు రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ యూనివర్శిటీకి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ప్రపంచ శ్రేణి క్రీడా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని.. జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు ఆతిథ్య వేదికగా హైదరాబాద్‌ను పరిశీలించాలని శివసేనారెడ్డి కోరారు.

మాళవిక పరాజయం

చైనా ఓపెన్ సూపర్ సిరీస్ 2024



చెంగ్డూ (చైనా) : చైనా ఓపెన్ సూపర్ సిరీస్ 1000 టోర్నమెంట్‌లో భారత పోరాటానికి తెరపడింది. భారత్ నుంచి బరిలోకి దిగిన షట్లర్లు అందరూ తొలి రౌండ్లోనే ఓటమి చెందగా.. మాళవిక బాన్సోద్ మాత్రమే మహిళల సింగిల్స్‌లో సంచలన విజయాలతో ముందుకెళ్లింది. కానీ శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో పరాజయం పాలైన మాళవిక బాన్సోద్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. నాల్గో సీడ్, జపాన్ స్టార్ అకానె యమగూచి 21-10, 21-16తో వరుస గేముల్లో మాళవిక బాన్సోద్‌పై విజయం సాధించింది. 35 నిమిషాల క్వార్టర్‌ఫైనల్లో తొలి గేమ్‌లో తడబడినా.. రెండో గేమ్‌లో మాళవిక గొప్ప పోరాట స్ఫూర్తి చూపించింది. బిడబ్ల్యూఎఫ్ సూపర్ సిరీస్ 1000 టోర్నమెంట్‌లో మాళవికకు ఇదే కెరీర్ తొలి క్వార్టర్‌ఫైనల్ కావటం విశేషం.



హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఏ పోటీలు

హైదరాబాద్ : స్పోర్ట్స్ ఫర్ ఆల్ (ఎస్ఎఫ్ఏ) ప్రొ 2024-2025 చాంపియన్‌షిప్స్‌లో భాగంగా తొలి ఎడిషన్ పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. అక్టోబర్ 15-30 వరకు ఎనిమిది క్రీడాంశాల్లో పోటీలు జరుగనున్నాయి. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, చెస్, స్విమ్మింగ్, టెన్నిస్ పోటీలు హైదరాబాద్‌లో ఉంటాయని ఎస్ఎఫ్ఏ సీఓఓ రాజన్ జోషి తెలిపారు. ఎస్ఎఫ్ఏ ప్రొ పోటీల్లో పోటీపడేందుకు అధికారిక వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.



సుశాంత్, నాగచైతన్య, నాగార్జున, అఖిల్, సుమంత్

అత్యంత వైభవంగా ఏఎన్ఆర్ శత జయంతి ఉత్సవాలు

- ఏఎన్ఆర్ పోస్టల్ స్టాంప్ ఆవిష్కరణ
- చిరంజీవికి ఏఎన్ఆర్ జాతీయ అవార్డ్
- 31 సిటీల్లో ఏఎన్ఆర్ 100 ఫిల్మ్ ఫెస్టివల్ సెలబ్రేషన్స్



'నాన్న (ఏఎన్ఆర్) నవ్వుతూ మాకు జీవితాన్ని నేర్పించారు. అందుకే ఆయన పేరు తలచుకుంటే నవ్వుతూనే ఉంటాం. ఈ ఏడాది ఏఎన్ఆర్ జాతీయ అవార్డును చిరంజీవికి అందజేస్తున్నాం' అని అక్కినేని నాగార్జున అన్నారు.

ఏఎన్ఆర్ శతజయంతి సందర్భంగా ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్ ఎన్ఎఫ్‌డిసి -నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియాతో కలిసి 'ఏఎన్ఆర్ 100 - కింగ్ ఆఫ్ ది సిల్వర్ స్క్రీన్' ఫిల్మ్ ఫెస్టివల్‌ని నిర్వహిస్తోంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫెస్టివల్ 'దేవదాసు' స్క్రీనింగ్‌తో శుక్రవారం గ్రాండ్‌గా ప్రారంభమైంది.

ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'దేవదాసు', 'మిస్సమ్మ' 'మాయాబజార్', 'భార్య భర్తలు', 'గుండమ్మ కథ', 'డాక్టర్ చక్రవర్తి', 'సుడిగుండాలు', 'ప్రేమ్ నగర్', 'ప్రేమాభిషేకం', 'మనం' వీటితోపాటు ఏఎన్ఆర్ ల్యాండ్‌మార్క్ సినిమాలను దేశవ్యాప్తంగా ప్రదర్శించనున్నారు. ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా ఈ 10 మాస్టర్ పీస్ మూవీ ప్రింట్‌లను 4కెలో పునరుద్ధరించడానికి చొరవ తీసుకున్నాయి.

ఈ సందర్భంగా మీడియాతో నాగార్జున మాట్లాడుతూ, 'నాన్నగారి శతజయంతి సందర్భంగా దేవదాస్‌తో పాటు మరికొన్ని సినిమాలు ప్రేక్షకులు, అక్కినేని అభిమానులు చూడబోతున్నారు. నాన్న నటించిన క్లాసిక్స్ 4కె బ్లాక్ అండ్ వైట్ ప్రింట్స్ అద్భుతంగా ఉన్నాయి. ఆడియన్స్‌కి ఇవి వండర్‌ఫుల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తాయి. 31 సిటీల్లో ఈ ఫెస్టివల్ చేస్తున్నాం. గోవా ఇంటర్ నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ నాన్న పేరు మీద ఒక చాప్టర్ చేయటం చాలా హ్యాపీగా ఉంది. పోస్ట్ మాస్టర్ జనరల్ బీఎస్ రెడ్డికి థ్యాంక్స్. ఈ శత జయంతి రోజున నాన్న స్టాంప్ రిలీజ్ చేశారు. శత జయంతిని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల్లోని నాన్న సీనియర్ అభిమానులు రక్తదానం, అన్నదానం లాంటి మంచి కార్యక్రమలు చేశారు. మీ ప్రేమ, అభిమానం మర్చిపోలేనిది. ఈ ఏడాది ఏఎన్ఆర్ అవార్డ్ చిరంజీవికి ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. ఈ విషయం చెప్పగానే చిరంజీవి చాలా ఎమోషనల్‌గా హగ్ చేసుకున్నారు. ఏఎన్ఆర్ శత జయంతి ఏడాదిలో ఈ అవార్డు తనకి ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. దీనికి కంటే పెద్ద అవార్డ్ లేదన్నారు. అక్టోబర్ 28న జరిగే వేడుకలో ఈ అవార్డును అమితాబ్ బచ్చన్ చేతుల మీదుగా చిరంజీవికి అందజేస్తాం' అని తెలిపారు.

ఈ సమావేశంలో అక్కినేని కుటుంబ సభ్యులతో పాటు మురళీమోహన్, కె.రాఘవేంద్రరావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, జాయింట్ కలెక్టర్ సంజయ్, శివేంద్ర సింగ్ దుంగార్పూర్ తదితరులు పాల్గొన్నారు.

అక్కినేని శత జయంతి సందర్భంగా పలువురు ప్రముఖులు సోషల్‌మీడియా వేదికగా ఘన నివాళి అర్పించారు.



ఎఎన్ఆర్ అలనాటి గొప్ప నటులలో ఒకరు. నటనలో మేధావి. వారు పోషించిన పాత్రలతో తెలుగు ప్రేక్షకుల హృదయాలలో, మనసుల్లో చిర స్మరణీయంగా ఉన్నారు. సినిమా రంగానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివి. 'మెకానిక్ అల్లుడు' సినిమాలో ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం, అదృష్టం నాకు దక్కింది. ఆ క్షణాలను, అద్భుతమైన జ్ఞాపకాలను ఎప్పటికీ గౌరవిస్తాను. **- చిరంజీవి**

తెలుగు సినిమా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన ఏఎన్ఆర్ శతజయంతి సందర్భంగా ఆయన్ని స్మరించుకోవడం గర్వ కారణం. మన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన పాత్రలు, తెలుగు సినిమాకు ఆయన చేసిన అమూల్యమైన సేవలు చిరస్మర ణీయాలు. ఆయన కృషి, కీర్తి, స్ఫూర్తి ప్రతి నటునికి మార్గదర్శకం. నాటకరంగం నుండి చిత్రరంగం వరకు ఆయన చేసిన ప్రయాణం ప్రతి ఒక్కరికి ప్రేరణ. **- బాలకృష్ణ**

నవచిత్రం

పవర్‌స్టార్ ఈజ్ బ్యాక్..



పవన్ కళ్యాణ్

ఏపీ ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ ప్రజాసేవకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో 'హరి హర వీర మల్లు' సినిమా షూటింగ్‌కి తగిన సమయం కేటాయించలేకపోయిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఈ సినిమా మొదటి భాగంలో మిగిలిన షూటింగ్‌ను పూర్తి చేసేందుకు మేకర్స్‌కి పవన్‌కళ్యాణ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఈనెల 23వ తేదీ నుంచి విజయవాడలో ఈ సినిమా కొత్త షెడ్యూల్‌ని ప్రారంభించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. హాలీవుడ్ దిగ్గజ యాక్షన్ దర్శకుడు నిక్ పావెల్ ఆధ్వర్యంలో భారీ యుద్ధ సన్నివేశాన్ని చిత్రీకరించ బోతున్నామని నిర్మాతలు తెలిపారు.

ఈ భారీ యుద్ధ సన్నివేశాలను 400 మంది సిబ్బందితో పాటు భారీ సంఖ్యలో జూనియర్ ఆర్టిస్టులు, ఫైటర్లతో షూట్ చేయనున్నారు. వీరితోపాటు నాజర్, రఘుబాబు, సునీల్, అభిమన్యు సింగ్, అయ్యప్ప వంటి నటులు కూడా ఈ చిత్రీకరణలో భాగం కానున్నారు. బాలీవుడ్ నటులు బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈచిత్రానికి ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు. నిర్మాత ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పవన్ కళ్యాణ్ చారిత్రాత్మక యోధుడుగా నటిస్తున్న 'హరి హర వీర మల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో విడుదల కానుంది.



వేదిక, అరవింద్ కృష్ణ

భయపడితే పర్యవసానం ఏంటి?

హీరోయిన్ వేదిక లీడ్ రోల్‌లో నటిస్తున్న సినిమా 'ఫియర్'. ఈ సినిమాను దత్తాత్రేయ మీడియా బ్యానర్ పై ప్రొడ్యూసర్ ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. సుజాత రెడ్డి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. దర్శకురాలు డా. హరిత గోగినేని రూపొందిస్తున్న ఈ చిత్రంలో అరవింద్ కృష్ణ ఓ స్పెషల్ రోల్‌లో కనిపించనున్నారు.

ఈ సినిమా విడుదలకు ముందే వివిధ అంతర్జాతీయ ప్రతిష్టాత్మక ఫిలిం ఫెస్టివల్స్‌లో 60కి పైగా అవార్డ్సలను గెల్చుకుని కొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఈ సినిమాకి సంబంధించి తెలుగు టీజర్‌ను హీరో రానా, తమిళ టీజర్‌ను విజయ్ సేతుపతి, కన్నడ టీజర్‌ను కిచ్చా సుదీప్, మలయాళ టీజర్‌ను దిలీప్, హిందీ టీజర్‌ను ఇమ్రాన్ హష్మి సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ ల్యాబ్స్‌లో ఈ చిత్ర టీజర్ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు.

నిర్మాత ఏఆర్ అభి మాట్లాడుతూ,'మా ఆవిడ హరిత చెప్పిన సస్పెన్స్ థ్రిల్లర్ కథ నాకు బాగా నచ్చింది. ఇంట్లో నన్ను భయపెట్టే ఆవిడ "ఫియర్" సినిమాతో ప్రేక్షకుల్ని కూడా ఈజీగా భయపెడుతుందని నమ్మాను (నవ్వుతూ). మా మొదటి సినిమా 'లక్కీ లక్ష్మణ్'కి ఎలా సపోర్ట్ చేశారో ఈ సినిమాకు కూడా అలాగే సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నా' అని అన్నారు.

'తన జీవితంలో కొన్ని అనుకోని సందర్భాల్లో ఒక అమ్మాయి భయపడితే ఆ పర్యావసనాలు ఎలా ఉంటాయి అనేది ఈ మూవీ కథ. ఈ సినిమాను మీరు థియేటర్‌లోనే ఎంజాయ్ చేయాలి. ఈ సినిమా తప్పకుండా మిమ్మల్ని ఆకట్టుకుంటుంది' అని డైరెక్టర్ డా.హరిత గోగినేని చెప్పారు.

హీరోయిన్ వేదిక మాట్లాడుతూ, 'టీజర్ చూశాక నా స్ట్రెస్ మొత్తం పోయింది. నేను ఈ సినిమాలో చేసిన రోల్ చాలా సంతృప్తిని ఇచ్చింది' అని తెలిపారు.

కన్యకకు అనూహ్య స్పందన



మమత

ప్రముఖ ఓటీటీల్లో స్ట్రీమింగ్ అవుతూ మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటోంది 'కన్యక' మూవీ. ఈ చిత్రాన్ని బి సినీ ఈటి సమర్పణలో శ్రీ కాశీ విశ్వనాథ్ పిక్చర్స్ బ్యానర్స్ పై కేవీ అమర లింగేశ్వరరావు, ఆతుకూరి సాంబశివరావు, కూరపాటి పూర్ణచంద్రరావు నిర్మించారు. ఈ సినిమా ప్రస్తుతం ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్, హంగామా, టాటా ప్లే బింగే, వాచో, వి మూవీస్ టీవీ ఇంకా ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.

ఈ సినిమాకి వస్తున్న అనూహ్య స్పందన నేపథ్యంలో నిర్మాతలు మాట్లాడుతూ, 'మా సినిమాకు అన్ని ప్రముఖ ఓటీటీల్లో మంచి రెస్పాన్స్ వస్తోంది. మా మొదటి సినిమానే ఒక మంచి మెసేజ్ ఓరియంటెడ్ సినిమా చేసినందుకు ఆనందంగా ఉంది. నకరికల్లు వాసవి కన్యక టెంపుల్‌లో అమ్మవారి మీద చిత్రీకరించిన పాట హైలెట్‌గా నిలిచింది' అని తెలిపారు.

దర్శకుడు రాఘవ మాట్లాడుతూ, 'ఆడవారి పట్ల అమానుషంగా ప్రవర్తిస్తే ఎవరు క్షమించిన అమ్మవారు క్షమించదు, శిక్షిస్తుందని ఈ చిత్రం ద్వారా తెలియజేశాం. చాలా తక్కువ రోజుల్లో, తక్కువ బడ్జెట్‌లో ఫినిష్ చేశాం. షూటింగ్‌కు నకరికల్లు, చాగంటివారి పాలెం వాసులు ఎంతో సహకరించారు. విశ్వనాథ శాస్త్రి అనే ఒక బ్రాహ్మణోత్తముని కూతురు కన్యక కనిపించకుండా పోతుంది. ఆమె కోసం శ్రావ్య అనే అమ్మాయి ఇన్వెస్టిగేట్ చేస్తుంది. కన్యక ఏమైంది?, వచ్చిన శ్రావ్య ఎవరు?, చివరి వరకు అసలు ఏం జరిగింది అని సస్పెన్స్ కథాంశంతో, మనం చేసిన తప్పులను ఒక కన్ను గమనిస్తుంది అని మెసేజ్‌తో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది' అని అన్నారు.

వణుకుతున్నాయా?

చేతులు వణకడం సర్వసాధారణమైన విషయం. మనలో చాలా మందికి ఏదో ఒక సమయంలో ఇలాంటి సమస్య ఎదురయ్యే ఉంటుంది. అయితే వయసు మళ్లిన తర్వాత ఈ సమస్య కనిపించడం కామనే అయినా చిన్నతనంలో కూడా చేతులు వణుకుతుంటే మాత్రం జాగ్రత్తపడాలని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ చేతులు వణకడానికి



అసలు కారణం ఏంటి.? ఇది దేనికి సంకేతమో ఇప్పుడు తెలుసుకుందాం..

చేతులతో పాటు.. తల, గొంతు వణకడాన్ని ఎసెన్షియల్ ట్రెమర్‌గా పిలుస్తుంటారు. సాధారణంగా ఈ సమస్య వయసు మళ్లిన వారిలో ఎక్కువగా కనిపిస్తుంది. ఇది జన్యుపరమైన సమస్యగా చెబుతుంటారు. అయితే కుటుంబంలో అంతకుముందు ఎవరికైనా ఈ సమస్య ఉంటే ఇతరులకు కూడా వచ్చే అవకాశం ఉంటుంది.

పార్కిన్సన్స్ వల్ల కూడా చేతులు, కాళ్ళ వణుకుతుంటాయి. ఈ వ్యాధి సోకిన వారిలో శరీర కదలికలపై నియంత్రణ తగ్గుతుంది. దీనికి సకాలంలో చికిత్స అందించాల్సి ఉంటుంది. సరైన చికిత్సతో ఈ సమస్యకు చెక్ పెట్టొచ్చు.

చేతులు వణకడానికి హైపర్ థైరాయిడిజం కూడా ఒక కారణమని నిపుణులు చెబుతున్నారు. చేతుల్లో వణుకు, వేగవంతమైన హృదయ స్పందన, ఉన్నట్టుండి బరువు తగ్గడం వంటివి హైపర్ థైరాయిడిజం లక్షణాలుగా చెప్పొచ్చు.

కొన్ని సందర్భాల్లో తీవ్రమైన ఒత్తిడి, ఆందోళన కారణంగా కూడా చేతులు వణుకుతాయని నిపుణులు చెబుతున్నారు. విపరీతమైన ఒత్తిడితో ఉన్న సమయంలో శరీరంలోని నరాలు, కండరాలపై ప్రభావం పడుతుంది. దీంతో చేతుల్లో వణుకు మొదలవుతుంది. ఈ సమస్య నుంచి బయటపడాలంటే యోగా, ధ్యానం వంటి అలవాట్లను చేసుకోవాలి.

ఆల్కహాల్ ఎక్కువగా తీసుకునే వారితోపాటు, డ్రగ్స్ అలవాటు ఉన్న వారిలో కూడా చేతులు వణకడం సాధారణంగా కనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇవి నరాలతో పాటు కండరాలను ప్రభావితం చేస్తాయి. ఈ కారణంగానే చేతులు వణుకుతాయి. మద్యం అలవాటు ఉన్న వారిలో ఈ సమస్య కనిపిస్తే వెంటనే మద్యం తీసుకోవడం ఆపేయాలి. ■

అదేమీ తప్పు కాదు

భాగస్వామితో ఎంత ప్రేమగా ఉంటే ఇద్దరి మధ్య రిలేషన్ అంత చక్కగా ఉంటుంది. మనం వారిని ఎంత ఇష్టపడుతున్నామో తెలియజేసేది కూడా ఇదే. ప్రేమ జంటల మధ్య బంధాన్ని దృఢంగా ఉంచుతుంది. శారీరకంగా ఇద్దరూ సంతోషంగా ఉంటే మానసికంగా కూడా ఆనందంగా ఉంటారు. ఆనందం అంటే కేవలం శారీక కోర్కెలు తీర్చుకోవడం మాత్రమే కాదు. ఇద్దరూ ప్రేమగా మాట్లాడుకోవడం, అక్కున చేర్చుకోవడం, ఒకరినొకరు పొగుడుకోవడం, కౌగిలించుకోవడం, సున్నితంగా తాకడం వంటివి కూడా ఇందులో భాగమే. ప్రేమగా ఉండటానికి, శారీక కోర్కెలు తీర్చుకోడానికి మధ్య చాలా తేడా ఉంది. ఆ తేడా తెలియక గందరగోళ పడే జంట కథే ఈ వారం ఐద్వా అదాలత్‌లో...



కమల్‌కు సుమారు 28 ఏండ్లు ఉంటాయి. లక్ష్మితో వివాహమై మూడేండ్లు అవుతుంది. తల్లిదండ్రులు ఊళ్లో ఉంటారు. వీరిద్దరే ఉద్యోగరీత్యా సిటీలో ఉంటున్నారు. పిల్లలు లేరు. పెండ్లప్పుడు రెండేండ్ల తర్వాత పిల్లల కోసం ఆలోచించాలని అనుకున్నారు. అయితే ఇప్పటికీ మూడేండ్లు గడుస్తున్నా పిల్లలు పుట్టలేదు. కానీ దీని గురించి వారికి పెద్దగా ఆలోచనలేదు. పెద్దవాళ్ల ఒత్తిడి మాత్రం పెరిగింది. ఈ ఒక్క సమస్యే కాదు ఇద్దరి మధ్య మరో సమస్య కూడా ఉంది. లక్ష్మికి రొమాంటిక్‌గా మాట్లాడితే నచ్చదు. అదేదో బూతుపదంగా అనుకుంటుంది. కమల్ ఏదైనా సరదాగా ఆమెతో అంటే 'ఏంటి బూతులు మాట్లాడతావు, ఎక్కడి నుండి నేర్చుకున్నావు' అని కోప్పడుతుంది.

కమల్‌కి మాత్రం తన భార్యతో ప్రేమగా మాట్లాడటమంటే చాలా ఇష్టం. తన చేత్తో ఐస్‌క్రీం తినిపించమన్నా ఏదో తప్పు చేస్తున్నట్టు అనుకుంటుంది. 'నువ్వు ఇలా రెడీ అయితే బాగుంటావు' అని ప్రేమగా అన్నా అది కూడా తప్పుగా భావిస్తుంది. ప్రేమగా 'ఏమైనా తీసుకురమ్మంటావా' అన్నా తిడుతుంది. ఇలా అతను మాట్లాడినా, మాట్లాడకపోయినా కోపగించుకుంటుంది. దాంతో కమల్ అసలు ఆమెతో మాట్లాడటమే తగ్గించేశాడు. ఎప్పుడైనా పగటి పూట అతను ఆమెను దగ్గరకు తీసుకుంటే ఇలాంటి పనులు రాత్రిపూటే చేయాలి అంటుంది. కనీసం ముద్దు కూడా పెట్టుకోనివ్వదు, కౌగిలించుకోనివ్వదు. అతను కాస్త గట్టిగా అడిగితే 'మీకెప్పుడూ ఇదే పిచ్చా' అంటూ చిరాగ్గా చూస్తుంది. ఈ విషయాలన్నీ ఎవరితో పంచుకోవాలో తెలియక కమల్ లోలోపలే సతమతమవుతున్నాడు.

ఎప్పుడైనా వాళ్ళ పుట్టింటికి వెళ్లినా ఫోన్ చేసి ప్రేమగా పలకరించదు. ఎప్పుడో ఒకసారి ఫోన్ చేసి 'తిన్నారా? ఏం చేస్తున్నారు?' అంటుంది. ఇంకో మాట మాట్లాడే అవకాశమే ఇవ్వదు. ఇద్దరం కలిసి సరదాగా బయటకో, సినిమాకో వెళదామంటే ఒప్పుకోదు. 'నీతో బయటకు వస్తే నాకు అదో రకంగా ఉంటుంది' అంటుంది. పక్కన భార్యను పెట్టుకొని చూడకుండా, మాట్లాడకుండా ఎలా ఉండాలనేది అతని బాధ. ఇలాంటి సమస్యతోనే అతను మా దగ్గరకు వచ్చి తన భార్యకు అర్థమయ్యే విధంగా చెప్పమన్నాడు.

> **లక్ష్మికి రొమాంటిక్‌గా మాట్లాడితే నచ్చదు. అదేదో బూతుపదంగా అనుకుంటుంది. కమల్ ఏదైనా సరదాగా ఆమెతో అంటే 'ఏంటి బూతులు మాట్లాడతావు, ఎక్కడి నుండి నేర్చుకున్నావు' అని కోప్పడుతుంది.**

మేము ఫోన్ చేసి లక్ష్మిని పిలిపించి కమల్ చెప్పిన విషయాల గురించి ఆమెతో మాట్లాడితే 'రొమాన్స్, సెక్స్ వంటి బూతు పదాల గురించి మీరెలా మాట్లాడుతున్నారు. మా ఇంట్లో ఇలాంటి పద్ధతి లేదు. బహిరంగంగా సెక్స్ గురించి మాట్లాడుతున్నారు. కమల్ మీ దగ్గరకు వచ్చి చాలా పెద్ద తప్పు చేశాడు' అని చెప్పుకొచ్చింది.

దాంతో మేము 'సెక్స్‌కి, రొమాన్స్‌కి చాలా తేడా ఉంది. భార్యాభర్తలిద్దరూ కలిసి ప్రేమగా ఉండటం రొమాన్స్. అయినా ఇవేవీ బూతు పదాలు కావు. మనిషి జీవితంలో సహజం. గాలి, నీరు, ఆహారం, నిద్ర మన జీవితానికి ఎంత అవసరమో ఇది కూడా అంతే. ముందు దీన్ని అర్థం చేసుకో. స్త్రీపురుషులు శారీరకంగా కలవడాన్ని సెక్స్ అంటారు. మీ మధ్య రొమాటింగ్ రిలేషన్ ఉంటే మీ జీవితం సంతోషంగా ఉంటుంది. లేదంటే యాంత్రికంగా గడిచిపోతుంది. జీవితం పట్ల బోర్ కొడుతుంది. ఇలాంటి బంధం మీ ఇద్దరి జీవితానికి చాలా అవసరం.

ఇద్దరూ మనసు విప్పి మాట్లాడుకోవాలన్నా, ఏ విషయమైనా కంగారు లేకుండా, మోహమాటం లేకుండా మాట్లాడుకోవాలంటే ఇలాంటి రొమాంటిక్ రిలేషన్ భార్యాభర్తల మధ్య కచ్చితంగా ఉండాలి. ఈ రిలేషన్ లేకపోతే సహజంగానే కోపం, చిరాకు, ఆందోళన పెరుగుతాయి. అందుకే మీ మధ్య గొడవలు జరుగుతున్నాయి. కమల్‌కు నువ్వంటే చాలా ఇష్టం. నీతో ఎంతో ప్రేమగా ఉండాలని కోరుకుంటున్నాడు. నువ్వేమో బూతు అంటూ పక్కన పెడుతున్నావు. ఇలాంటి విషయాల గురించి మాట్లాడుకోవడం తప్పేం కాదు. భార్యాభర్తల మధ్య ఇలాంటి చర్చలు జరగాలి. అప్పుడే ఇద్దరూ జీవితాంతం సంతోషంగా ఉండగలరు. కానీ మన సమాజంలో దీన్ని తప్పుగా భావిస్తున్నారు. నువ్వు ఇలాగే ప్రవర్తిస్తే కమల్ నీకు తెలియకుండా ఏదైనా పొరపాటు చేస్తే ఏం చేస్తావు. అనవసరంగా నీ జీవితంలో నువ్వే సమస్యలు తెచ్చుకుంటున్నావు. పరిస్థితి అంత దూరం తెచ్చుకోకు.

అతని ప్రవర్తనలో ఏదైనా ఇబ్బంది కరంగా ఉంటే సున్నితంగా చెప్పు. మరీ కష్టంగా ఉంటే మాతో అయినా చెప్పొచ్చు. అంతే కాని అతను దగ్గరకు వస్తున్నపుడు నువ్వు దూరం పెట్టడం సరైనది కాదు. మీకు ఇంకా పిల్లలు లేరు. కాబట్టి ఇప్పుడే జీవితాన్ని సరదాగా గడపాలి. రేపు పిల్లలు పుట్టిన తర్వాత ఎలాగో ఆ అవకాశం పెద్దగా ఉండదు' అని సర్ది చెప్పే ప్రయత్నం చేశాము.

> **ఇద్దరూ మనసు విప్పి మాట్లాడుకోవాలన్నా, ఏ విషయమైనా కంగారు లేకుండా, మోహమాటం లేకుండా మాట్లాడుకోవాలంటే ఇలాంటి రొమాంటిక్ రిలేషన్ భార్యాభర్తల మధ్య కచ్చితంగా ఉండాలి.**

మేము మాట్లాడిన తర్వాత ఆమె కాస్త ఆలోచనలో పడింది. మాట్లాడే విధానంలో కూడా కొద్దిగా మార్పు వచ్చింది. రెండు వారాల తర్వాత లక్ష్మిని తీసుకొని కమల్ వచ్చి 'మేడమ్ చాలా సంతోషంగా ఉంది. లక్ష్మి అంతకు ముందులా లేదు. నాతో ప్రేమగా ఉంటుంది' అని చెప్పాడు. లక్ష్మి కూడా 'ఇప్పుడు నాకూ మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది మేడమ్. కమల్ చాలా సంతోషంగా ఉంటున్నాడు. ఇద్దరి మధ్య అంతకు ముందులా గొడవలు కూడా లేవు. పిల్లల కోసం కూడా ప్లాన్ చేసుకుంటున్నాం' అని సంతోషంగా చెప్పింది.

- వై వరలక్ష్మి
9948794051

నేడు రవీంద్రభారతిలో ఏచూరి సంస్మరణ సభ

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఎం కోదండరాం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా, ఆర్ఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మురహరి, ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి కె తేజ్‌దీప్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగిస్తారు. ఈ సంస్మరణ సభను జయప్రదం చేయాలనీ, ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, వామపక్ష మేధావులు పెద్దఎత్తున పాల్గొనాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.

కాళేశ్వరం కొట్టుకుపోతే.. ప్రాజెక్టుల్లోకి నీళ్లెలా వచ్చాయి?

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. బీఆర్ఎస్‌వి కిసాన్ పాలిటిక్స్ అయితే కాంగ్రెస్‌వి డైవర్షన్ పాలిటిక్స్ అంటూ అధికార పార్టీని విమర్శించారు. దుబ్బాక, నర్సాపూర్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, వాకిటి సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు పి.వెంకట్రామారెడ్డి, దేశపతి శ్రీనివాస్, డా.వంటేరు యాదవరెడ్డి, మాజీ ఎఫ్డీసీ చైర్మెన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్‌ను హరీశ్‌రావు శుక్రవారం సందర్శించారు. గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు పని అయిపోయిందని, రూ.93 వేల కోట్లతో పనులు జరిగితే లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఎన్నికల సమయంలో దుష్ప్రచారం చేశారన్నారు. కాళేశ్వరంలో అవినీతి జరిగితే ఎల్లంపల్లి నుంచి లక్ష్మి బ్యారేజ్, అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌కు నేడు నీళ్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. నేడు అన్ని ప్రాజెక్ట్‌లు నిండుకుండలా ఉన్నాయంటే అది ప్రాజెక్ట్ ఫలితమేనన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రాజెక్టుల నిర్మాణంను అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు, అధికారంలో ఉన్నప్పుడు కూడా బుద్ధి మారడం లేదని ఆరోపించారు. 21 టీఎంసీల నీటితో కళకళలాడుతున్న మల్లన్నసాగర్‌లో పూజలు నిర్వహిస్తామని వస్తే అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. గతంలో ఆగస్టు నెలలో చేపపిల్లలు వేశామని, నేడు సెప్టెంబర్ 20, ఇప్పటికీ చేప పిల్లలు వేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి చేపలు, రొయ్యలు వేసి మత్స్యకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. చెరువులు, కుంటలను ప్రాజెక్టులతో అనుసంధానం చేసుకోవడంతో మత్స్యకారులకు మేలు జరిగిందన్నారు. మెదక్, యాదాద్రి, సిద్దిపేట జిల్లాల్లో పంటలు పండటం ఇష్టం లేదా అని ప్రశ్నించారు. మల్లన్నసాగర్ పూర్తి అయిందని, అసంపూర్తిగా ఉన్న కాలువలు పూర్తి చేయాలన్నారు. రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌కు, మూసీకి నీళ్లు తీసుకెళ్తా అంటున్నారని.. దానికి కేసీఆర్ నిర్మించిన మల్లన్నసాగర్‌తోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, సొసైటీ చైర్మెన్ కె. హరికృష్ణా రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు గో బ్యాక్..

నాడు పోలీసులతో కలిసి రైతు ఉద్యమాన్ని అణగతొక్కిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు మల్లన్నసాగర్‌ను సందర్శించే నైతిక హక్కు లేదని తుక్కాపూర్ గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మల్లన్నసాగర్ ప్రాజెక్టును సందర్శించేందుకు వస్తున్న విషయం తెలుసుని మల్లన్నసాగర్ కట్టపై వారు బైటాయించారు. గతంలో మల్లన్నసాగర్ భూనిర్వాసితులను నట్టేట ముంచిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. నిర్వాసితుల సమస్యలు పట్టించుకోని హరీశ్‌రావు గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు భారీగా చేరుకుని.. వారికి సర్దిచెప్పడంతో ధర్నా విరమించి అక్కడినుండి వెళ్లిపోయారు. కాగా ధర్నా సందర్భంగా వారు మాట్లాడుతూ.. తుక్కాపూర్ గ్రామ ప్రజలకు ముందు క్షమాపణ చెప్పి.. ఆ తర్వాత ప్రాజెక్టును సందర్శించాలని డిమాండ్ చేశారు. తుక్కాపూర్ గ్రామస్తులందరికి 250 గజాల స్థలం, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇప్పిస్తామని గ్రామస్తులను మోసం చేశారని మండిపడ్డారు. సిద్దిపేట నిర్వాసితులకు రూ.15 లక్షలు, తుక్కాపూర్ భూనిర్వాసితులకు రూ.5.50 లక్షల పరిహారం ఇచ్చి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎస్ఎల్బీసీ మూడేండ్లలో పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడే రాష్ట్రస్థాయి ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులతో ఉమ్మడి నల్లగొండ జిల్లా నీటిపారుదల ప్రాజెక్టులపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. ఎస్ఎల్బీసీ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ.4400 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. 2027 సెప్టెంబర్ 20 నాటికి ప్రాజెక్టును పూర్తి చేసే విధంగా క్యాలెండర్ రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. నెలవారీగా నిధులు కేటాయిస్తామన్నారు. నెలకు 400 మీటర్ల చొప్పున సొరంగం తవ్వితే రూ.14 కోట్లు అవసరమవుతాయని, 20 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అవకాశం ఉందని చెప్పారు. నెలకు 400 మీటర్లకన్నా ఎక్కువ తవ్వినా ఆ మేరకు బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మూడేండ్లలో ప్రాజెక్టును పూర్తి చేసి ఉమ్మడి నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాలను సస్యశ్యామలం చేస్తామన్నారు. గత పాలకులు పదేండ్లలో ఒక్క కిలోమీటర్ కూడా తవ్వకుండా శ్రీశైలం సొరంగ మార్గాన్ని గాలికి వదిలేయడం వల్ల ప్రభుత్వానికి ఖర్చు పెరిగిందని, రైతులకు నష్టం జరిగిందని అన్నారు. రూ.1000 కోట్ల బడ్జెట్‌తో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు.. గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా రూ.4వేల కోట్లకు పెరిగి రాష్ట్ర ఖజానాపై పెను భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో సీఎల్పీ నేతగా తాను, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్, తర్వాత టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్, కోమటిరెడ్డి ఆనాటి ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెచ్చినా, పోరాటం చేసినా ఫలితం లేకుండా పోయిందని చెప్పారు.

గోదావరిపై లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కడితే కుంగిపోయిందన్నారు. కృష్ణానదిపై దృష్టి పెట్టకపోవడంతో పాలమూరు ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైందన్నారు. ప్రగతిలో ఉన్న ప్రాజెక్టును వదిలేసి రీడిజైన్ల పేరిట గత ప్రభుత్వం లక్షల కోట్లు దోపిడీ చేసిందని ఆరోపించారు. ఫలితంగా రాష్ట్ర ఖజానా దివాలా తీసి ఏడు లక్షల కోట్ల మేర అప్పులు పేరుకుపోయాయన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక విధాన నిర్ణయం తీసుకొని.. ప్రాధాన్యత ప్రకారం నిధులు కేటాయించాలని నిర్ణయించినట్టు తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీ ఉన్నా ఎస్ఎల్బీసీ పూర్తయితే నాగర్ కర్నూల్, ఉమ్మడి నల్లగొండ జిల్లాలకు సాగు, తాగునీరు అందుతాయన్నారు. నక్కలగండి, ఉదయసముద్రం, బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టులను ప్రాధాన్యతాక్రమంలో నిధులు కేటాయించి పూర్తి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, చేస్తున్న పనులను నాయకులు, కార్యకర్తలు గడపగడపకూ తీసుకెళ్లాలని సూచించారు.

సబ్ స్టేషన్లు, ఇతర విద్యుత్ అవసరాలకు సంబంధించి ఎమ్మెల్యేలు ఇచ్చే ప్రతిపాదనలను పరిశీలించి వెంటనే అనుమతులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. సమీక్షా సమావేశంలో నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎమ్మెల్సీలు నర్సిరెడ్డి, కోటిరెడ్డి, నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

జానీ మాస్టర్‌కు రిమాండ్

నవతెలంగాణ-రాజేంద్రనగర్

మహిళా కొరియోగ్రాఫర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో జానీ మాస్టర్‌ను నార్సింగ్ పోలీసులు శుక్రవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి జానీ మాస్టర్‌కు 14 రోజుల రిమాండ్ విధించారు. దాంతో పోలీసుల ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. గురువారం జానీ మాస్టర్‌ను గోవాలో నార్సింగ్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అక్కడి న్యాయస్థానంలో హాజరు పరిచి అక్కడి నుంచి శుక్రవారం హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. ఆ తర్వాత ఒక రహస్య ప్రదేశంలో ఉంచిన పోలీసులు సుదీర్ఘంగా విచారించారు. అనంతరం అతనికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎదుట తాను ఎవరిపై లైంగికదాడికి పాల్పడలేదని జానీ మాస్టర్ కన్నీరు పెట్టుకున్నట్టు సమాచారం. జానీ మాస్టర్ భార్య సుమలత కూడా ఉప్పరపల్లి కోర్టుకు వచ్చారు. న్యాయపరంగా పోరాడుతామని, తమకు కోర్టులో న్యాయం జరుగుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది.

అమ్మకానికి స్టార్‌హెల్త్ కస్టమర్ల డేటా

(మొదటిపేజీ తరువాయి)

గమనార్హం. ఈ విషయాన్ని చాట్‌బాట్ సృష్టికర్త ఓ సెక్యూరిటీ రీసెర్చర్‌కు చెప్పగా.. ఆయన మీడియా దృష్టికి ఈ అంశాన్ని తీసుకువచ్చాడు. మిలియన్ల కొద్దీ కస్టమర్ల వ్యక్తిగత సమాచారాన్ని అమ్మకానికి పెట్టినట్లు.. చాట్‌బాట్లను అడగడం ద్వారా వినియోగదారుల సమాచారాన్ని చూడవచ్చని చెప్పాడు.

ఈ విషయంపై స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ సంస్థ స్పందించింది. అనధికార డేటా యాక్సెస్ ఆరోపణలకు సంబంధించి స్థానిక అధికారులకు సమాచారమందించినట్టు తెలిపింది. ఇలాంటి విషయాల్లో ఎలాంటి రాజీ లేదని.. సున్నితమైన కస్టమర్ల డేటా సురక్షితంగా ఉంటుందని స్పష్టం చేసింది. మరోవైపు చాట్‌బాట్లను ఉపయోగించి పాలసీ, క్లెయిమ్ డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆ మీడియా సంస్థ తెలిపింది. కస్టమర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామాలు, ట్యాక్స్ సమాచారం, ఐడీ కార్డులు, టెస్టుల ఫలితాలలాంటి సమాచారాన్ని పొందవచ్చని చెప్పింది.

కాగా టెలిగ్రామ్ ఫౌండర్, సీఈవో పావెల్ దురోవ్‌ను పారిస్‌లో పోలీసులు గత నెలలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అజర్‌బైజాన్ నుంచి లే బోర్గట్ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఆయనపై మోసం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ నేరాలు, వ్యవస్థీకత నేరాల్ని ప్రోత్సహించడం వంటి ఆరోపణలున్నాయి. అప్పటినుంచి టెలిగ్రామ్ కంటెంట్‌పై పరిశీలన పెరిగింది.

సింగరేణి కార్మికులకు రూ.796 కోట్ల బోనస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సింగరేణి కార్మికులకు రూ.796 కోట్లు బోనస్ ప్రకటిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తీపి కబురు అందించారు. గతేడాది సింగరేణి సంస్థ ఉత్పత్తి, లాభాల ఆధారంగా బోనస్‌ను ప్రకటించినట్టు తెలిపారు. ఒక్కో కార్మికునికి రూ.1.90 లక్షలు, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5 వేలు చొప్పున బోనస్ ప్రకటించారు. దసరా పండుగకు ముందే ఈ బోనస్‌ను అందిస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఎం మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ప్రక్రియలో సింగరేణి కార్మికులు అగ్రభాగాన నిలిచారనీ, ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లడంలో గని కార్మికుల పాత్ర మరువలేనిదని కొనియాడారు. అనంతరం సింగరేణి లాభాలు, విస్తరణ.. బోనస్‌కు సంబంధించిన వివరాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. 'రాష్ట్రానికే తలమానికంగా ఉన్న సింగరేణి సంస్థ రాష్ట్రంలోని విద్యుదుత్పత్తి కేంద్రాలతో పాటు ఇతర సంస్థలకు బొగ్గు సరఫరా చేయడంతో పాటు ఇతర రాష్ట్రాలకు బొగ్గు ఎగుమతి చేస్తోంది. సింగరేణి కార్మికుల శ్రమతో 2023-24లో సంస్థకు మొత్తంగా రూ.4,701 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో సంస్థ విస్తరణ, పెట్టుబడులకు రూ.2,289 కోట్లు కేటాయించగా మిగిలినవి రూ.2,412 కోట్లు. ఇందులో మూడో వంతు రూ.796 కోట్లను కార్మికులకు బోనస్‌గా ప్రకటిస్తున్నాం. సింగరేణిలో మొత్తం 41,387 మంది శాశ్వత కార్మికులు, ఉద్యోగులున్నారు. ఒక్కొక్కరికి బోనస్ కింద రూ.1.90 లక్షలు అందించనున్నాం. గతేడాది సింగరేణి కార్మికులకు అందిన బోనస్ రూ.1.70 లక్షలు మాత్రమే. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఒక్కొక్కరికి అదనంగా అందుతున్న మొత్తం రూ.20 వేలు' అని భట్టి వివరించారు.

సింగరేణి సంస్థ చరిత్రలోనే తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకూ రూ.5 వేల బోనస్ అందజేస్తున్నట్టు డిప్యూటీ సీఎం వెల్లడించారు. రాష్ట్రంలోని 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు ఇది వర్తిస్తుందని తెలిపారు. సింగరేణి సంస్థ ఆర్జించిన లాభాలను భవిష్యత్ అవసరాలకు తగినట్టు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించామని తెలిపారు. సోలార్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని 1000 మెగావాట్లకు విస్తరించడం, రామగుండంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్ నిర్మాణం, జైపూర్‌లోని ప్రస్తుత థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రంలో మరో 1800 మెగావాట్ల సామర్థ్యం కల మరో థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం, రామగుండంలో టీఎస్ జెన్ కో ఆధ్వర్యంలో మరో 1800 మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం, ఒడిశాలోని నైనీ బ్లాక్‌పై (పిట్‌హెడ్) 2,400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించామని వివరించారు. సంస్థ పరిధిలోని వీకే ఓపెన్ కాస్ట్, గోలేటీ, నైనీ ఓసీలను ప్రారంభిస్తామనీ, సింగరేణి కార్మికులు, ఉద్యోగుల పిల్లల కోసం నూతన రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ఏరియాస్పత్రుల ఆధునీకరణతో పాటు హైదరాబాద్‌లో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. విలేకర్ల సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనరసింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క), పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ప్రేమ్‌సాగర్‌రావు, సింగరేణి ఎమ్‌డీ బలరాం, కార్మిక సంఘాల నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, జనక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పలుచోట్ల మోస్తరు వర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు మోస్తరు వర్షం పడింది. మొత్తం 517 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. నల్లగొండ జిల్లా చందంపేటలో అత్యధికంగా 8.53 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. నల్లగొండ, నాగర్‌కర్నూల్, జనగాం, సంగారెడ్డి, సూర్యాపేట, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఒకటెండ్రు చోట్ల భారీ వర్షం పడింది. రాష్ట్రంలో వచ్చే రెండ్రోజులు అన్ని జిల్లాల్లోనూ పలుచోట్ల వర్షాలు పడే సూచనలున్నాయనీ, అక్కడక్కడా భారీ వర్షాలు పడొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న ప్రకటించారు.

సవరించిన ఐటీ నిబంధనలు రాజ్యాంగ విరుద్ధం!

(మొదటిపేజీ తరువాయి)

ఉల్లంఘిస్తున్నాయని శుక్రవారం తీర్పు చెప్పారు. "ఈ విషయాన్ని విస్తృతంగా పరిశీలించాను. ఈ నిబంధనలు రాజ్యాంగంలోని 14వ అధికరణ (సమానత్వం హక్కు), 19వ అధికరణ (భావ ప్రకటనా స్వేచ్ఛ), 19(1)(జి) (స్వేచ్ఛ, వృత్తి హక్కు)లను తీవ్రంగా ఉల్లంఘిస్తున్నాయి." అని ఆయన పేర్కొన్నారు. నిబంధనల్లోని "బూటకం, తప్పు, తప్పుదారి పట్టించే" వ్యక్తీకరణ అనేది అస్పష్టంగా వుంది. ఏ నిర్వచనం లేనందున ఇది తప్పు. అని ఆయన పేర్కొన్నారు.

కొత్త ఐటీ నిబంధనలను సవాలుచేస్తూ స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా ప్రభృతులు వేసిన పిటిషన్లను హైకోర్టు విచారణకు స్వీకరించిన నేపథ్యంలో ఈ రూలింగ్ వెలువడింది.

ప్రభుత్వం గురించి వచ్చిన సమాచారం బూటకమైనదా లేక అబద్ధమైనదా అని గుర్తించేందుకు నిజ నిర్ధారణ బృందాన్ని (ఎఫ్‌సీయూ)ఏర్పాటు చేయడం కూడా ఆ నిబంధనల్లో ఒకటిగా వుంది. ఈ అంశంపై జనవరిలో విచారించిన ఇద్దరు సభ్యుల డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పు చీలిపోవడంతో దీన్ని జస్టిస్ చందూర్కర్‌కు నివేదించాల్సి వచ్చింది. భావ ప్రకటనా స్వేచ్ఛపై ఎలాటి ప్రభావం పడదని పేర్కొంటూ జస్టిస్ గోఖలే ఈ నిబంధనలను సమర్ధించగా, జస్టిస్ పటేల్ వీటిని కొట్టిపారేశారు.

ఈ నిబంధనలు సెన్సార్‌షిప్‌కు సంబంధించినవని వ్యాఖ్యానించారు. తాజాగా జస్టిస్ పటేల్ ఇచ్చిన తీర్పును చందూర్కర్ సమర్ధించారు. గతేడాది ఏప్రిల్ 6న కేంద్ర ప్రభుత్వం ఐటి నిబంధనలు-2021 కి సవరణలను తీసుకువచ్చింది. సవరించిన నిబంధనల కింద ఎఫ్‌సీయూ ఏ పోస్టునైనా బూటకమైనదిగా, వాస్తవాలను వక్రీకరించేదిగా వుందని భావించిన వెంటనే దాన్ని సామాజిక మాధ్యమాల వేదికలకు ట్యాగ్ చేస్తారు. ఇక ఆ పోస్టును తొలగించడం లేదా డిస్‌క్లైమర్ పెట్టడం తప్ప వాటికి మరో అవకాశం వుండదు. ఒకవేళ డిస్‌క్లైమర్ పెడితే వారికి గల రక్షణ కోల్పోయి, చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అవకాశం వుంటుంది.





కామ్రేడ్ సీతారామ్‌కు నివాళి




కామ్రేడ్ సీతారాం ఏచూరి గురించి గతించిన కాలపు భాషలో రాయడం నాకు చాలా కష్టంగానూ, బాధగానూ ఉంది. మా రాజకీయ జీవితాలు గత ఐదు దశాబ్దాలుగా అంత్యంత సన్నిహితంగా పెనవేసుకుపోయాయి. పార్టీ, వామపక్ష ఉద్యమం వివిధ దశల్లో ఎదుర్కొన్న ఆటుపోట్లను ఇద్దరమూ చవిచూశాం. యాభై ఏండ్ల క్రితం, 1974లో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో ఎస్‌ఎఫ్‌ఐలో మా మధ్య మొదలైన భావసారూప్య స్నేహం తరువాత పార్టీలో కూడా కొనసాగింది. పార్టీ కేంద్రంలో మేం ఇద్దరం 37 ఏండ్లపాటు కలిసి పనిచేశాం. నేను 1985లో పార్టీ కేంద్రానికి వచ్చాను. రెండేండ్ల తరువాత సీతారాం వచ్చి చేరారు. అప్పటి నుంచి మా ప్రయాణం ఒకే దిశలో కొనసాగింది. 1984లో మేం ఇద్దరం కేంద్ర కమిటీ సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపికయ్యాం. 1985లో జరిగిన పార్టీ 12వ మహాసభలో కేంద్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యాం. 1988లో జరిగిన 13వ మహాసభలో కేంద్ర కార్యదర్శి వర్గంలోకి, 1992లో జరిగిన 14వ మహాసభలో పార్టీ పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యాం. పార్టీ కోసం, వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమ అవసరాల కోసం సీతారాం చేసిన కృషిని నికరంగా అంచనా వేయడానికి మరింత సమయం, మరింత చర్చ అవసరం. ప్రస్తుతానికి నేను పార్టీకి సైద్ధాంతికంగా, కార్యక్రమపరంగా, రాజకీయపరంగా సీతారాం చేసిన ప్రత్యేక తోడ్పాటు గురించి వివరించే ప్రయత్నం చేస్తాను.

మార్క్సిజం-లెనినిజం ఆధారంగా పార్టీని సైద్ధాంతికంగా నిలబెట్టేందుకు కృషి

వివిధ లౌకిక ప్రతిపక్ష పార్టీల నాయకులతో సీతారామ్‌కు ఉన్న సంబంధాలు, ఆ పార్టీలను ఒకే ఉమ్మడివేదిక మీదకు తీసుకురాగలిగిన సామర్థ్యం గురించి ప్రధాన స్రవంతి మీడియాలో విస్తృతంగానే వచ్చింది. ప్రజా కార్యక్షేత్రంలో సీతారాం చేసిన ఈ కృషి వాస్తవమే. అయితే నేను పార్టీకి, మార్క్సిజానికి సీతారాం అందించిన కీలకమైన తోడ్పాటు గురించి ఇక్కడ ప్రధానంగా ప్రస్తావించదలిచాను. పార్టీ కేంద్రంలోనూ, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా మార్క్సిజం - లెనినిజం ఆధారంగా పార్టీని సైద్ధాంతికంగా నిలబెట్టే దానికి సీతారాం చేసిన కృషి ప్రత్యేకమైనది.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆవిర్భావ కాలం నుంచి మార్క్సిజం - లెనినిజం సూత్రాలను పునాదిగా చేసుకుని పనిచేసింది. అతివాద, మితవాద పోకడలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున సైద్ధాంతిక పోరాటం చేసింది. 1968లో బర్ద్వాన్‌లో జరిగిన పార్టీ ప్లీనంలో సైద్ధాంతిక సమస్యలపై ఆమోదించిన తీర్మానం భారత కమ్యూనిస్టు ఉద్యమంలోనే ఒక మైలురాయి వంటిది. అంతేకాక అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో సైద్ధాంతిక సమస్యలు, విభేదాల నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మార్క్సిజం - లెనినిజం సిద్ధాంతం ఆధారంగా స్వతంత్ర వైఖరిని, పంథాను రూపొందించుకుంది. అక్టోబర్ విప్లవ 70వ వార్షికోత్సవం సందర్భంగా 1987లో సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న మిఖాయిల్ గోర్బచెవ్ మాస్కోలో చేసిన ప్రసంగం మీద సీతారాం పార్టీ అనుసరిస్తున్న ఈ స్వతంత్ర్య వైఖరినే ముందుకుగొనిపోయాడు. సామాజిక వైరుధ్యాల మీద, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగించాల్సిన పోరాట స్వరూప స్వభావాల గురించి గోర్బచెవ్ చేసిన ప్రసంగం మార్క్సిస్టు విశ్లేషణ నుంచి విడగొట్టుకునేలా ఉన్నది. గోర్బచెవ్ సూత్రీకరణలను విమర్శించిన తొలి కమ్యూనిస్టు పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)యే. 1988 మే నెలలో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశం ఈ అంశంపై ప్రత్యేకంగా తీర్మానం చేసింది. దీనికి కొనసాగింపుగా 1988 ఆగస్టు నెలలో 'సోవియట్ యూనియన్‌లో పరిణామాలు' పేరిట మూడో తీర్మానం చేసింది. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీలో తలెత్తిన అంతర్గత పరిణామాలు, గ్లాస్‌నోస్త్, పెరిస్త్రోయికా పేరిట ఆ పార్టీ చేస్తున్న తప్పిదాల మూలంగా సోషలిస్టు రష్యా ప్రమాదంలో పడనున్నదని మార్క్సిస్టు పార్టీ ఆ తీర్మానంలో హెచ్చరించింది. తూర్పు యూరప్ దేశాలలో నెలకొన్న సంక్షోభం మూలంగా అక్కడి సోషలిస్టు ప్రభుత్వాలు కుప్పకూలిపోయాయి. ఆయా దేశాల్లో కమ్యూనిస్టు

సైద్ధాంతిక నిబద్ధత లోపించడం, సోషలిజం నిర్మాణంలో చోటుచేసుకున్న వక్రీకరణల మూలంగానే ఈ పరిస్థితులు దాపురించాయని మార్క్సిస్టు పార్టీ 1990 మేలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం మరో తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని రూపొందించడంలో సీతారాం కీలకమైన పాత్ర పోషించాడు. తదనంతర కాలంలో ఒక సమగ్ర సైద్ధాంతిక డాక్యుమెంట్ రూపొందించడానికి ఈ తీర్మానం పునాదిగా పనిచేసింది. 1991లో సోవియట్ సోషలిస్టు రష్యా పతనమయ్యాక సోషలిజానికి తగిలిన ఈ తీవ్రమైన చారిత్రాత్మకమైన ఎదురుదెబ్బను పరిగణనలోకి తీసుకుని సోవియట్ పతనానంతర సైద్ధాంతిక సమస్యల మీద పార్టీ తన వైఖరిని నిర్దేశించుకున్నది. 1992లో మద్రాస్‌లో జరిగిన పార్టీ 14వ మహాసభలో కూలంకషంగా చర్చ జరిగిన తరువాత 'సైద్ధాంతిక సమస్యల'పై రూపొందించిన ఈ తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. కామ్రేడ్ సీతారాం మహాసభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టి, చర్చలను క్రోడీ కరించి ముగింపు సమాధానం ఇచ్చాడు. పొలిట్‌బ్యూరో తరపున ఒక కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు సైద్ధాంతిక తీర్మానం ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి. సాధా రణంగా సైద్ధాంతిక అంశాలపై కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య తీర్మానాలు ప్రవేశపెడుతుంటారు. కామ్రేడ్ సీతారాంలోని సిద్ధాంతకారుడిని పార్టీ గుర్తించిందనడానికి ఇది ఒక నిదర్శనం. ఆ రోజు నుండి పార్టీ పొలిట్‌బ్యూరోలో సైద్ధాంతిక అంశాలపై చర్చకు కామ్రేడ్ సీతారాం చోదక శక్తిగా పనిచేశాడు.



ప్రకాష్‌కరత్

ఈ రకమైన సైద్ధాంతిక పటిష్టత కలిగి ఉన్న నేపథ్యంలో కార్ల్‌మార్క్స్ 175వ జయంతిని పురస్కరించు కుని మార్క్సిస్టు పార్టీ కలకత్తాలో ఒక అంత ర్జాతీయ సదస్సుని నిర్వ హించింది. 'వర్తమాన ప్రపంచం - మార్క్సిజం ప్రాసంగికత' అన్న అంశం పై ఈ సదస్సు జరిగింది. సోవియట్ రష్యాలో, తూర్పు యూరప్ దేశాల్లో సోషలిస్టు ప్రభుత్వాలు కూలిపోవడం, రష్యా విచ్ఛిన్నమైపోయిన నేపథ్యంలో మార్క్సి జం ప్రాసంగికత మీద జరిగిన తొలి అంతర్జాతీయ సదస్సు ఇది. 21 కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరై పత్రాలు సమర్పించారు. పార్టీ అంతర్జాతీయ వ్యవహారాల విభాగానికి బాధ్యుడిగా ఉన్న సీతారాం పార్టీ తరపున ఈ సదస్సుకు పత్రం సమర్పించడమే కాకుండా ఈ సదస్సుకు నిర్వాహకుడు, సమన్వయకర్త బాధ్యతలు కూడా నెరవేర్చాడు.

ఫాసిస్టు హిందూత్వ సిద్ధాంతానికి వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటానికి తోడ్పాటు

సైద్ధాంతిక సమస్యలపై మార్క్సిస్టు పార్టీ అవగాహనను తాజాపరుచుకోవాలని కేంద్ర కమిటీ నిర్ణయించాక సహజంగానే ఆ బాధ్యత కామ్రేడ్ సీతారాం భుజస్కంధాలపై పడింది. 2012లో కోజికోడ్‌లో జరిగిన పార్టీ 20వ మహాసభలో 'కొన్ని సైద్ధాంతిక సమస్యలు' పేరిట తీర్మానాన్ని కామ్రేడ్ సీతారాం ప్రవేశపెట్టాడు. కూలం కషంగా చర్చ జరిగిన పిదప మహా సభ తీర్మానాన్ని ఆమోదించింది. అలాగే ఫాసిస్టు హిందూత్వ సిద్ధాంతానికి వ్యతిరేకంగా సాగించాల్సిన సైద్ధాంతిక పోరాటం వంటి కీలకమైన అంశం మీద కూడా కామ్రేడ్ సీతారాం విలువైన తోడ్పాటు అందించారు. ఈ పోరాటంలో సీతారాం పోషించిన కీలకపాత్రకు సంబంధించిన ఒక అంశాన్ని ఇక్కడ ఉదహరించాలి. ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్ చాలక్ అయిన ఎంఎస్ గోల్వాల్కర్ 1939లో 'మనం - మన జాతీయత' పేరిట 77 పేజీల పుస్తకం ఒకటి రాశాడు. 1993లో సీతారాం ఈ పుస్తకం మీద ఒక విమర్శ రాశాడు. గోల్వాల్కర్ రాసిన పుస్తకం హిందూత్వ రాష్ట్ర ఫాసిస్టు ధోరణులను పట్టిస్తుంది. అయితే ఈ పుస్తకం అసలు ప్రతి మార్కెట్‌లో దొరకడం లేదు. సీతారాం అలాంటి అసలు ప్రతిని దొరకబుచ్చుకుని గోల్వాల్కర్ సిద్ధాంతంలోని ఫాసిస్టు భావాలను, లక్షణాలను నిశితంగా, లోతుగా విమర్శిస్తూ ఒక వ్యాసం రాశాడు. ఈ వ్యాసం 1993లో, మార్చి 12 'ఫ్రంట్‌లైన్' పత్రికలో ప్రచురించారు. ఆ తర్వాత మరింత విస్తరించి 'ఫ్రంట్‌లైన్' ప్రచురణగా వెలువడింది. ఆర్‌ఎస్‌ఎస్ మీద సాధికార విశ్లేషకుడిగా పేరొందిన ఎజి నూరాని సీతారాం రాసిన ఈ పుస్తకం చదివి గొప్పగా మెచ్చుకున్నాడు. హిందూత్వ సిద్ధాంతాన్ని సైద్ధాంతికంగా స్పష్టమైన అవగాహనతో వివేచించగలిగిన శక్తి, దూరదృష్టి కలిగి ఉన్న మూలంగానే సీతారాం హిందూత్వ మతతత్వ శక్తులకు వ్యతిరేకంగానూ, లౌకిక విలువల పరిరక్షణకు సాగించిన పోరాటంలో తగిన రాజకీయ నిబద్ధతను సాధించుకున్నాడు.

ఏ కమ్యూనిస్టు పార్టీకి అయినా 'కార్యక్రమం' ప్రాథమిక డాక్యుమెంట్‌గా ఉంటుంది. దాని ఆధారంగానే ఎత్తుగడల పంథాను రూపొందించుకుంటుంది. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 9వ మహాసభలో కార్యక్రమాన్ని రూపొందించుకుంది. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో ప్రజాతంత్ర విప్లవ సాధనకు అనుసరించాల్సిన వ్యూహంపై ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో జరిగిన సుదీర్ఘ అంతర్గత పోరాట పర్యవసానంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించుకుంది మార్క్సిస్టు పార్టీ. అయితే, జాతీయంగానూ, అంతర్జాతీ యంగానూ సంభవించిన రెండు ప్రధాన పరిణామాల నేపథ్యంలో ఈ 'కార్యక్రమాన్ని' తాజా పరచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. సోవియట్ యూనియన్ పతనానంతరం సామ్రాజ్యవాద ఆధిపత్యం బలపడుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ బలాబలాల పొందికలో వచ్చిన ప్రధాన మార్పులు ఆ కీలక పరిణామాల్లో ఒకటి కాగా, రెండవది మనదేశంలో నయా ఉదారవాద విధానాల ఆధారంగా చేపడుతున్న పెట్టుబడిదారీ అభివృద్ధి పంథా మూలంగా చోటుచేసుకుంటున్న మార్పులు. పార్టీ కార్యక్రమాన్ని తాజాపరచడానికి కామ్రేడ్ హరికిషన్‌సింగ్ సూర్జిత్ ఆధ్వర్యాన ఒక కమిషన్‌ను పార్టీ నియమించింది. కామ్రేడ్ సీతారాం ఈ కమిషన్‌లో ఒక సభ్యుడు కాగా, సూర్జిత్ దీనికి కన్వీనర్‌గా ఉన్నారు. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానాల మీద సీతారామ్‌కు ఉన్న లోతైన అవగాహన మూలంగా 'కార్యక్రమం'లోని 'పెట్టుబడిదారీ అభివృద్ధి పంథా'ను తాజా పరచడంలో తనే కీలకపాత్ర పోషించాడు. ఒక దశలో 1964లో పార్టీ రూపొందించుకున్న కార్యక్రమంలో (భారత) రాజ్య స్వభావానికి సంబంధించిన లక్షణాలను, తాజాపరచబడిన అంశాలను పొందుపరచాలని నేనూ, సీతారాం గట్టిగా పట్టుపట్టాం.

వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరగనున్న పార్టీ 24వ మహాసభ కోసం విధాన పత్రాల రూపకల్పన, మహాసభ షెడ్యూల్ గురించి పొలిట్‌బ్యూరో తగిన నిర్ణయాలు తీసుకోవడానికి సీతారాం చొరవ చూపించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తన అనారోగ్యం మహాసభ ఏర్పాట్లపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందో అని నా దగ్గర ఆందోళన వ్యక్తం చేశాడు. అంతా సజావుగానే నడిచిపోతుంది. కొద్ది రోజుల్లో నువ్వు కూడా బాగై బయటకు వచ్చేస్తావులే అని సీతారాంతో నమ్మకంగా చెప్పాను. కానీ, ఇలా జరిగిపోయింది.

నిర్దిష్టంగా అధ్యయనం చేయగలిగిన వ్యక్తి....

సీతారాం ఏచూరి చేసిన కృషిని కూలంకషంగా అంచనా వెయ్యడం ఇప్పుడు నేవున్న స్థితిలో సాధ్యం కాకుండా ఉంది. మార్క్సిజం -లెనినిజం పట్ల అకుంఠిత అంకిత భావం కలిగి, నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అధ్యయనం చేయగలిగి తన యావజ్జీవితాన్ని పార్టీకి అంకితం చేసిన కామ్రేడ్, మన సీతారాం. దేశ లౌకిక, ప్రజాస్వామిక విలువలు కాపాడడానికి, దోపిడీ రహిత సోషలిస్టు సమాజ స్థాపనకు సీతారాం చేసిన కృషి మనకే కాదు, భావి కమ్యూనిస్టు, అభ్యుదయ శక్తులకు కూడా గొప్ప ఉత్తేజాన్ని ఇస్తుంది.


నాయకత్వ పాత్ర పోషించిన సీతారాం

దేశ రాజకీయాలు మితవాదం వైపు మొగ్గడం, 2014 ఎన్నికలలో బీజేపీ విజయం సాధించడం, మోడీ అధికార పగ్గాలు చేపట్టడంతో వచ్చిన గుణాత్మకమైన మార్పులను దృష్టిలో పెట్టుకుని రాజకీయంగా ఎదురైన ఈ నూతన సవాలును, భారత రాజ్యాంగంలోని లౌకిక - ప్రజాస్వామిక విలువలకు ఏర్పడ్డ తీవ్ర ప్రమాదాలను దీటుగా ఎదుర్కోవడానికి తగిన రాజకీయ ఎత్తుగడల పంథాలను రూపొందించడంలో సీతారాం నాయకత్వ పాత్ర పోషించాడు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు తగినంత బలంలేని నేపథ్యంలో తగిన రాజకీయ ఎత్తుగడల పంథాలను రూపొందించడంలో కూడా సీతారాం చురుకైన పాత్ర పోషించాడు. హిందూత్వ నిరంకుశ శక్తుల ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి ఒక విశాల వేదిక నిర్మాణం ఈ కారణంగానే సాధ్యపడింది.

కామ్రేడ్ ఏచూరి వారసత్వాన్ని కొనసాగిద్దాం!

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి అందించిన సేవలు, వారసత్వం హఠాత్తుగా, అనూహ్యంగా నిలిచిపోయాయి. ఆయన అకాల మరణంతో అతను చేయాల్సిన పని అసంపూర్తిగా మిగిలిపోయింది. భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి ఏచూరి చేయాల్సింది ఇంకా చాలా ఉంది. అంతే కాదు. వారి హఠాన్మరణం వల్ల భవిష్యత్ తరాలు వారి అమూల్యమైన మార్గదర్శ కత్వాన్ని కోల్పోయాయి.





మాణిక్ సర్కార్

సీతారాం ఏచూరి కమ్యూనిస్టు ఉద్యమంలో అత్యున్నతమైన, బహు ముఖ ప్రజ్ఞ కలిగిన నాయకుడు. అతను మార్క్సిజం, లెనినిజంపై పాండిత్యం, గట్టి సైద్ధాంతిక పునాది ఉన్నవాడు. అంతే కాదు, మార్క్సిస్టు అర్థశాస్త్రంలో అతని నైపుణ్యం కూడా ఎన్నతగ్గది. కమ్యూనిస్టు ఉద్యమ వ్యతిరేకులు కూడా సైద్ధాంతిక లేదా ఆర్థిక అంశాలపై అతనితో సవాల్ చేయడానికి సాహసించే వారు కాదు. ఎందుకంటే, అతను తన పదునైన, ఫలవంతమైన వాదనలతోనే కాకుండా శక్తివంతమైన రచనలతో తమను ఎలాగైనా ఒప్పిస్తాడన్న సంగతి వాళ్లకి కూడా తెలుసు. సీపీఐ(ఎం) తరపున ఒక అంశంపై వాదించే ముందు దానికి సంబంధించిన విభిన్న కోణాలను విస్మరించేవాడు కాదు. చర్చల్లో పాల్గొనేటప్పుడు తీవ్రమైన వాదోపవాదాలు చేస్తూనే వాటిని ఆస్వాదించేవాడు. అదే సమయంలో విశాల దక్షతతో వ్యవహరించేవాడు.

అంకితభావం కలిగిన సీరియస్ విద్యార్థి నాయకుడిగా సీతారాం ఏచూరి దేశం నలుమూలలా విస్తతంగా పర్యటించారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక లక్షణాలను, వారి సమస్యలను అర్థం చేసుకోవడానికి వివిధ రాష్ట్రాలను సందర్శించారు. ఈ లోతైన అధ్యయనం అతను వివిధ రాష్ట్రాల్లో విద్యార్థి ఉద్యమాలను సమర్థవంతంగా నిర్మించడానికి తోడ్పడింది. అతని ప్రయత్నాలు భారతదేశమంతటా విద్యార్థి ఉద్యమం, దాని నిర్మాణం పెరుగుదల, విస్తరణకు తోడ్పడ్డాయి. విద్యార్థి నాయకుడిగా అంతర్దృష్టి, గడించిన అనుభవం అమూల్యమైనవనే విషయం తర్వాతి కాలంలో అతడు పార్టీలో సమర్థవంతమైన నాయకుడిగా ఎదిగే క్రమంలో నిరూపించబడింది.

వివిధ ముఖ్యమైన ప్రచురణలను రాసే, సంపాదకత్వం వహించే క్రమంలో ఏచూరి తన అసాధారణమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఎస్ఎఫ్ఐ పత్రిక 'స్టూడెంట్ స్ట్రగుల్'కి సంపాదకునిగా దానిని విభిన్నంగా, ఆకర్షణీయమైన రూపంతో తీర్చి దిద్దడమే కాక, మంచి నాణ్యత, వైవిధ్యమైన అంశాలతో అభివద్ధి చేశాడు. ఇది ఆ సమయంలో విద్యార్థి ఉద్యమ నాయకుల దష్టిని ఆకర్షించడమే కాక అగ్రశ్రేణి మేధావులు, విమర్శకులను కూడా ఆకట్టుకుంది. ఇదే ఒరవడిని కామ్రేడ్ ఏచూరి సీపీఐ(ఎం) వారపత్రిక 'పీపుల్స్ డెమొక్రసీ' త్రైమాసిక సైద్ధాంతిక పత్రిక 'ది మార్క్సిస్టు'కు సంపాదకునిగా పనిచేసిన సమయంలో కూడా కొనసాగించారు. వీటన్నిటితో పాటు ఏచూరి అసంఖ్యాకమైన విలువైన పుస్తకాలు కూడా రాశారు. అనేకమంది కమ్యూనిస్టులకు రాజకీయ సైద్ధాంతిక పోరాటాల సందర్భంగా ఈ పుస్తకాలు ముఖ్య వనరులుగా ఉపయోగపడ్డాయి.

సీపీఐ(ఎం)తో సంబంధాన్ని కొనసాగించింది వియత్నాం కమ్యూనిస్టు పార్టీనే

1964లో సీపీఐ(ఎం) ఏర్పడిన ప్రారంభ దినాలలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం నుంచి ఒంటరిపాటుకు గురైంది. ప్రధాన రాజకీయ పార్టీలైన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ యుఎస్ఎస్ఆర్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా సీపీఐ(ఎం) పట్ల ప్రతికూల వైఖరిని అవలంబించాయి. ఒక్క వియత్నాం కమ్యూనిస్టు పార్టీ మాత్రమే ఈ కాలంలో సీపీఐ(ఎం)తో సంబంధాన్ని కొనసాగించింది. ఒంటరిగా ఉన్నప్పటికీ సీపీఐ(ఎం) తన సైద్ధాంతిక, రాజకీయ విధానాలపై స్థిర నిర్ణయంతో ఉంది. తన పార్టీ సొంత కార్యక్రమాన్ని అనుసరిస్తూ, వర్గ, సామూహిక పోరాటాలను అభివద్ధి చేయడంపై దష్టి పెట్టింది. కాలక్రమేణా సీపీఐ(ఎం) కార్మిక, రైతాంగ, మధ్య తరగతి వర్గాల్లో గుర్తింపు, ఆమోదాన్ని పొందింది. ఈ పెరుగుతున్న మద్దతు కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపురలో వామపక్ష ప్రజాతంత్ర, వామపక్ష నాయకత్వంలోని ప్రభుత్వాల ఏర్పాటులో ప్రతిబింబించింది. ఈ అనుభవాల ద్వారా ప్రధాన అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీలు సీపీఐ(ఎం) పట్ల గతంలో ఉన్న అపార్థాలను సరిచేసుకుని పార్టీల మధ్య రాజకీయ సంబంధాలు అభివద్ధి చేయడం ప్రారంభించాయి. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి అవటానికి ముందు హరి కిషన్ సింగ్ సూర్జిత్ ప్రపంచవ్యాప్తంగా వివిధ కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీలతో రాజకీయ సంబంధాలు నెలకొల్పడంలోనూ, కొనసాగించడంలోనూ కీలక పాత్ర పోషించారు. పార్టీ నిర్ణయానికి అనుగుణంగా కామ్రేడ్ ఏచూరిని ఈ బాధ్యత ల్లోకి ప్రవేశపెట్టారు. చివరికి ఆయన పార్టీ అంతర్జాతీయ విభాగానికి ఇన్‌చార్జిగా నియమించబడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీలతో బలమైన సంబంధాలను నేరపుతూ సీతారాం ఏచూరి కీలక పాత్రను నిర్వహించారు. అతని పని లాంఛనప్రాయ సంబంధాలకు మించి ఉండేది. సోదర పార్టీల సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణాత్మక అంశాలను ఏచూరి చాలా లోతుగా అధ్యయనం చేశాడు. ఈ ప్రయత్నం సీపీఐ(ఎం)కి అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవడానికి, అంతర్జాతీయ వ్యవహారాల్లో సరైన నిర్ణయాలు తీసుకోవటంలోనూ దోహదపడింది.

కేంద్రీకత ప్రజాస్వామ్యం అనేది కమ్యూనిస్ట్ పార్టీ యొక్క ప్రాథమిక నిర్మాణ సూత్రం. ప్రధాన కార్యదర్శిగా సీతారాం ఏచూరి దాని ఆచరణకు గట్టిగా కట్టుబడి ఉన్నారు. కమ్యూనిస్ట్ పార్టీలో, సంఘటిత నిర్ణయాలను అమలుచేసే క్రమంలో, నిర్మాణ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటూనే, స్వేచ్ఛాయుతంగా చర్చ జరిపే స్వేచ్ఛ ఉండాలి. ఈ సూత్రానికి ఆయన చైతన్యపూర్వకంగా కట్టుబడి ఉండడం ఆయన హయాంలో పార్టీని ఏకీకతం చేయడంలో దోహద పడింది. సీతారాం ఏచూరి మనముందు అనేక ముఖ్యమైన పాఠాలు, అసంపూర్తిగా ఉన్న అనేక పనులను మిగిల్చివెళ్లారు. అతను మనతో లేకపోవడం నిస్సందేహంగా మనల్ని కలవరపరుస్తుంది. కానీ నిరాశ చెందేందుకు, లేదా అలసత్వం వహించేందుకు ఇది సమయం కాదు. వామపక్ష ఐక్యతను పెంపొందించుకుంటూ, వామపక్ష- ప్రజాస్వామ్య లౌకిక కూటమిని బలపరుస్తూ, తనను తాను బలోపేతం చేసుకోవడం పార్టీ ముందున్న తక్షణ కర్తవ్యం. కామ్రేడ్ సీతారాం ఏచూరి స్మతిని నిజంగా గౌరవించటమంటే, ఈ సవాళ్లను మనం చిత్తశుద్ధితో, సీరియస్‌గా ఎదుర్కోవాలి. నిబద్ధతను పునరుద్ధరించుకుని ప్రజలకు చేరువ కావాలి. వివిధ పోరాటాలలో ప్రజలను సమీకరించడానికి సానుకూల ప్రయత్నాలు చేయాలి. యువతరాన్ని ఆకర్షించడానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. అడ్డంకులను అధిగమించి దాని లక్ష్యాలను సాధించగల సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా పార్టీని చైతన్యవంతం చేయాలి.

వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులను ఏకం చేయడంలో కీలకపాత్ర

ఆర్ఎస్ఎస్ బీజేపీ కూటమిని ఒంటరిని చేసి, ఓడించాలంటే దేశంలోని వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులను ఏకం చేయడం అత్యంత అవసరం. ఈ కీలక పనిలో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారు. ఈ ఐక్యతను నిర్మించడానికి అవసరమైన రాజకీయ మెళకువలను, వ్యూహాలను వినమ్రతతోనూ, నైపుణ్యంతోనూ సాధించారు. ఇతర రాజకీయ పార్టీలతో సమావేశాలు, చర్చల్లో హరికిషన్ సింగ్ సుర్జీత్‌తో కలిసి పాల్గొనే క్రమంలో యేచూరి తన సామర్థ్యాలను పదును పెట్టుకున్నారు. పార్లమెంటు ఎగువ సభ సభ్యునిగా సీతారాం రాజకీయ పరిపక్వతను, సమర్థతను ప్రదర్శిస్తూ గణనీయమైన ప్రభావాన్ని చూపారు. పార్లమెంటులో విభిన్న రాజకీయ పార్టీలతో కలివిడిగా ఉండే అతని సామర్థ్యం లౌకిక శక్తుల మధ్య సమన్వయం, ఐక్యతను పెంపొందించడానికి సహాయపడింది. గత కొన్ని సంవత్సరాలలో, 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఇండియా బ్లాక్‌ని ఏర్పాటు చేయడంలో ప్రభావవంతంగా వ్యవహరించడంలో అతని పాత్ర ప్రత్యేకంగా చెప్పుకోదగినది.

విశ్వమానవుడు, కమ్యూనిస్టు, చరిత్రకారుడు,

సృజనాత్మక వ్యూహకర్త



నేను చివరిసారి కామ్రేడ్ సీతారాం ఏచూరితో ఆగస్టు 22న మాట్లాడాను. కామ్రేడ్ బుద్ధదేవ్ సంస్మరణ సభ కోసం ఆయన వీడియో మెసేజ్ రికార్డుచేసి పంపమన్నాను. అప్పడే ఐసీయూ నుండి బయటికొచ్చిన ఆయన వెంటనే అంగీకరించారు. ఎంతసేపు మాట్లాడాలని కూడా ఆయన వాకబు చేశారు. ఆయన భార్య సీమా, నేనూ ఇరువురమూ ఆయన ఆరోగ్యం ఎంతసేపు అనుమతిస్తే అంతసేపే మాట్లాడమని చెప్పాం.
మధ్యాహ్నం నేను నేతాజీ ఇన్‌డోర్ స్టేడియంలో వేలాదిగా అక్కడ జమ అయిన పార్టీ కార్యకర్తలను, అభిమానులను ఉద్దేశించి దాన్ని ప్రసారం చేయాలని అడిగేటప్పుడు అదే ఆయన చిట్టచివరి ఉపన్యాసమని నేనూ భావించలేదు. బుద్ధదేవ్ గురించి కామ్రేడ్ సీతారాం చెప్పే మాటలను రాసుకుంటూనే ఆస్పత్రి బెడ్‌లోని ఆయన చివరి విశేషమైన ఫొటో సీమ తీసింది.
సీతారాం యేచూరి చాలా తొందరగా వెళ్ళిపోయాడు. పార్టీకి, భారత వామపక్ష ఉద్యమానికి, బెంగాల్‌కు, అన్నింటికీ మించి ఇండియాకు ఆయన అవసరం ఉండింది.

బహుముఖ ప్రజ్ఞాశాలి



మొహమ్మద్ సలీం

ఆయనలాంటి స్థాయున్న వ్యక్తికి నివాళి అర్పించడం కష్టం. సీతారాం ఏచూరి ఒక మార్క్సిస్టు లెనినిస్టు, ఒక సిద్ధాంతవేత్త, ఆర్థిక శాస్త్రవేత్త, చరిత్ర కారుడు, క్రియాశీల కార్యకర్త, అన్నిటికంటే ముఖ్యంగా ఆచరణవాది. భారతదేశ బహుళత్వమంటే ఆయనకి తెగమక్కువ. దాన్ని కాపాడ్డానికి ఆయన అహరహం కృషి చేశారు.

చదువు - పోరాడు : పెద్ద చరిత్రకారుడు

చదువు - పోరాడు అనే ఎస్ఎఫ్ఐ నినాదానికి సీతారాం నిలువెత్తు రూపం. 1970లలో 'స్టూడెంట్ స్ట్రగుల్' పత్రిక సంపాదకుడుగా దేశంలో కమ్యూనిస్టుల చరిత్రకు సంబంధించిన వాస్తవాలను వెలికితీసి వాటిని వాటి యథాస్థానంలో ఉంచేందుకు ఆయన తన నిశిత దృష్టిని కేంద్రీకరించారు. అదేసమయంలో ఆర్ఎస్ఎస్ భగత్‌సింగ్‌ను సొంతం చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలను ఆయన వమ్ముచేశారు. భగత్‌సింగ్ ఒక విప్లవకారుడని, నాస్తికుడని, కమ్యూనిస్టని రుజువుచేసే అనేక చారిత్రక వాస్తవాలను దాన్లో ప్రచురించారు. ఆనాటి, అనేకమంది కమ్యూనిస్టు యోధులవలె జాతీయోద్యమ సాంప్రదాయాలను మున్ముందుకు తీసుకెళ్ళేందుకు ఆయన పతాకధారియై నిలిచాడు. కమ్యూనిస్టుల ప్రతిష్టాత్మక చరిత్ర, దేశ ప్రధాన స్రవంతి గుర్తింపులోకి తేబడింది. దానికి ఆయన మేథోపరమైన కార్యాచరణ ఎంతో తోడ్పడింది. అండమాన్‌లోని సెల్యులార్ జైలు విశేషాలను పార్లమెంటు రికార్డుల నుంచి తవ్వి తీయడానికి ఆయనతో కలిసి నేనూ చేసిన కృషి ద్వారా జాతీయోద్యమంలో కమ్యూనిస్టుల పాత్రను సమున్నతంగా నిలిపేందుకు తోడ్పడింది.

మార్క్సిస్టు సిద్ధాంతవేత్త, ప్రజామేధావి, మాటకారి

మాకినేని బసవపున్నయ్య, ఇ.ఎమ్.ఎస్., సూర్జిత్, జ్యోతిబసు వంటి ప్రతిష్టాత్మక నేతల శిక్షణలో కమ్యూనిస్టు ఉద్యమంలోకి సీతారాం ప్రవేశించారు. ఫలితంగా సైద్ధాంతిక కమిట్‌మెంట్ ఆయనకు అలవడింది. ప్రజల్ని ఐక్యం చేయడం నేర్చుకున్నారు. కరకు రాజకీయాలను తన మేధోశక్తితో, నైపుణ్యంతో దారికి తేగలగడం ఆయన మనకు వదిలివెళ్ళిన వారసత్వం.

కాంగ్రెస్‌లో తిరుగుబాటు బావుటా ఎగరేసిన వి.పి.సింగ్, బహుగుణలు 1987లో కోలకతాలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో ఒక మీటింగ్ నిర్వహించారు. జ్యోతిబసు, సీతారామ్‌లతో ప్రఖ్యాత జేఎన్‌యూ ప్రొఫెసర్ అక్కడున్నారు. నేను డీవైఎఫ్ఐ నాయకుడిగా అక్కడ వలంటీర్ బాధ్యతల్లో ఉన్నాను. హఠాత్తుగా సీతారాం నన్నుద్దేశించి "రాజకీయాల కోసం పిహెచ్.డిని పక్కన పడేసినందుకు నీ వల్ల నేను కూడా తిట్లు తినాల్సి వచ్చిందిరా!" అన్నారు. ఏదిఏమైనా, ఆయన విలువైన మేధావేకాదు, విద్యావేత్త కూడా. 20వ శతాబ్దంలో జరిగిన - సోవియట్ కూలిపోవడం, బాబ్రీ విధ్వంసం, సరళీకృత ఆర్థిక విధానాల ప్రారంభాన్ని అద్భుతంగా సిద్ధాంతీకరించారు. మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంత సాయంతో ఒక యువ పొలిట్ బ్యూరో సభ్యునిగా సీతారాం ఆ చారిత్రక సందర్భంలో అవి మన దేశంలో ఎటువంటి ఆర్థిక నమూనా మార్పులకు దారితీస్తాయో ప్రజలకు వివరించారు. సీతారాం యేచూరి పిహెచ్.డి చేయలేదు. కాని ఆయన రాసిన వ్యాసాలు, ఉపన్యాసాలు, పార్టీ తీర్మానాలు అయన్ని ఒక మేధావి రాజకీయవేత్తగా, 'సిద్ధాంతవేత్తగా, మాటల మాంత్రికుని'గా నిలుపుతాయి.

సంకీర్ణాల నిర్మాత, బహుళత్వం కోసం, సంక్షేమ రాజ్యం కోసం పోరాడిన యోధుడు

80, 90 దశకాల్లో అస్సాం, పంజాబ్‌ల్లో వేర్పాటువాద ఉద్యమాలు పెల్లుబుకడం, బీజేపీ తన మతోన్మాద కోరలు చాచడం, కాంగ్రెస్ అవినీతి సంక్షోభంలో కూరుకుపోవడం - ఆ దశలో మన సీనియర్ నేతల మార్గదర్శకత్వంలో యూపీఏ-1 ఏర్పాటులో సీతారాం ప్రధానపాత్ర పోషించారు. అదే సందర్భంలో ఆయన మైనారిటీల హక్కులు, భారతదేశ భిన్నత్వ రక్షణ, మతోన్మాదంపై పోరాడే సేనానిగా నిలిచారు.

వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వకాలంలో హిందూత్వ అసలు స్వరూపాన్ని బహిరంగపరచడంలో సీతారాం కీలక భూమిక పోషించారు. నేటి ఉధృత పద్ధతుల్లోగాక, ప్రచ్ఛన్న రూపాల్లో ఆనాడు మతోన్మాదం ఉండింది. దానిపై సీతారాం అలుపెరుగని పోరాటం చేశారు. యూపీఏ-1 కాలంలో సీతారాం ప్రధానంగా సంక్షేమ రాజ్యంపై కేంద్రీకరించారు. పౌర సంఘాలు, ప్రభుత్వేతర సంస్థలు, ప్లానింగ్ కమిషన్ వంటి వాటన్నిటినీ కలిపి సీతారామ్ ఒక నెట్‌వర్క్ చేశారు. విధాన నిర్ణయాల్లో జోక్యం చేసుకుని ఉపాధి హామీ చట్టం, ఆహార హక్కు చట్టం, విద్యాహక్కు చట్టం వంటి వాటి ఏర్పాటులో ముఖ్య భూమిక పోషించారు. మతోన్మాదంపై పోరాటమేగాక, కార్మికుల, రైతుల హక్కుల రక్షణకై సంక్షేమ రాజ్యాన్ని కాపాడటానికి ఆయన ప్రయత్నిస్తూనే ఉండేవాడు.

కల్లోల దశాబ్దంలో అసాధ్యమైన వృత్తి

2014-24 మధ్యకాలం పార్టీకి, వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమానికి, ప్రధాన కార్యదర్శిగా సీతారామ్ యేచూరికి నిస్సందేహంగా పరీక్షా సమయమే. మోడీ ప్రభుత్వం నిరంతర దాడుల నేపథ్యంలో కమ్యూనిస్టులే కాదు, కమ్యూనిస్టులుగా భావించబడే వారు సైతం ధైర్య సాహసాలను, తెలివితేటలను, ఓపికను ప్రదర్శించాలి. ఎన్నికల్లో ఎదురుదెబ్బలు ఎదురైనా దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని సజీవంగా, దృశ్యమానంగా, బలంగా, సచేతనంగా నిలిపేందుకు సీతారాం కృషి తోడ్పడింది. సైద్ధాంతికంగా బలమైన, రాజకీయంగా నిబద్ధమైన, అందరికీ ఆమోదయోగ్యమైన, సాంస్కృతికంగా నిర్మలమైన ప్రకాశవంతమైన మోము ఆయన కాలానికి చెందిన నెలబాలునిగా సీతారామ్ ఎప్పటికీ గుర్తుండిపోతారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886